
అనంతలక్ష్మి కంబైన్స్
ఈ కాలపు పిల్లలు
నిర్మాత డి. భాస్కరరావు
దర్శకత్వం లక్ష్మీదీపక్
alpana
సోల్ డిస్ట్రిబ్యూటర్స్
అన్నపూర్ణ పిక్చర్స్
అన్నపూర్ణ ఫిలింస్

తొలిమాట

మళ్ళీ మహాకవి శ్రీ శ్రీ రచనలను జ్యోతి మీ కందించ బోతోందని తెలుపుటకు సంతోషిస్తున్నాము. లోపల పేజీలలో ప్రకటన చూడగలరు.

*   *   *


'భార్యలు తీయగా అనుమానించ గలరా?' – ఈ అనుమానం మీకు ఉండొచ్చు. అనుమానించగలరేమో చూడండి మరి పేజీ – 36.

*   *   *


ఆశ్చర్యం కలిగించే అనుభూతి ఒక్కో-సారి మనల్ని ఆలోచనా శూన్యుల్ని చేస్తుంది, కదూ అయోమయపు ఆలోచనలలోకి నెట్టేస్తుంది. మన ఆలోచనలలో మనం ఉంటే జరుగుతున్న కార్యం ఆగదు. అయిపోతుంది. ఆ తర్వాత మిగిలేది మరింత ఆశ్చర్యమే అవుతుంది. —పే-60.

*   *   *

ఆంధ్రులు ఆరంభ శూరులేనా? చూడండి పే – 57.



మీ కేశ సంపదకు
అవసరం లేదు రీటా వారి మీ కురుల
సౌభాగ్యాన్ని వృద్ధిచేసుకోండి మీ
కోశాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి
నిగనిగలాడుతూ మెత్తగా వుండవలెనంటే
ఇంతకుమించి చేయవలసిందేమిలేదు
* సరికొత్త ప్యాకింగులో వస్తున్నది
రీటా ప్రతీ చోటా దొరకును
రీటా
రీటా కంపెనీ, బొంబాయి. కలకత్తా. మద్రాసు


REGD' 169505
EST D:1940
త్రివేణి
వక్కపొడి
గంగ, యమున, సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి, సువాసన, పరిమళాల సమ్మేళనం
త్రివేణి వక్కపొడి
TRIVE
PARI
NUT
త్రివేణి వక్కపొడి
మచిలీపట్నం
PHONE: 270
TRIVENI NUT POWDER MFG. CO.
CIRCLEPET,
MACHILIPATNAM (A.P.)
Mg. PARTNER: DESU VENKATA SUBBA RAO

లలిత

ఉషారాణి

'ఎందుకిలా జరిగింది' పదేపదే అనుకుంది లలిత. గొప్పగా కాకపోయినా చిన్నప్పటినుంచి తనను బాగానే చూశారు తల్లిదండ్రులు. తమ శక్తికి తగ్గట్టు రెండు వేలు కట్నమిచ్చి సూర్యంతో తన వివాహం జరిపించారు. అతనికి తల్లిలేదు తండ్రి ఒక చెల్లెలు ఉన్నారు తమవద్ద తీసుకున్న కట్నం డబ్బుతో సూర్యం తండ్రి కూతురి పెళ్ళి చేశాడు. అయినా తను ఏమాత్రం బాధపడలేదు. భర్త తనని అభిమానిస్తే చాలనుకుంది. తను కాపురానికి వచ్చి ఒక్క నెల అయింది. పెళ్ళిఅయి మూడు నెలలు, ఈ మూడు నెలలలో లలిత భర్త మనసు ఏమిటో కాస్తయినా అర్ధం చేసుకోలేక పోయింది.

సూర్యం పనిచేసేది చిట్ ఫండ్ కంపెనీలో. ఉదయంనుంచి సాయంత్రం వరకూ అతను అందరిళ్ళకు తిరిగి, డబ్బు కట్టించుకుంటాడు. జీతం నూటఅరవై. చిన్నపాత పెంకుటిల్లు తక్కువలో అద్దెకు తీసుకున్నాడు. మునికొండలోఉన్న ఎకరం మాగాణిని సూర్యం తండ్రి చూస్తూంటాడు. ఎన్నో ఆశలతో వచ్చిన లలిత మొదట తమ ఇంటిని చూడగానే నిరుత్సాహ పడింది.

సూర్యం ఉదయం తొమ్మిది గంటలకు వెళ్ళి సాయంత్రం ఆరింటికి కానీ రాడు. లలిత తొమ్మిది లోపల పనంతా ముగిస్తుంది మధ్యకాలమంతా లలిత ఒంటరిగా ఉండాలి భర్తకోసం ఎదురు తెన్నులు చూడటమే ఆమె పని. లలితతో సూర్యం ముక్తసరిగా మాట్లాడుతాడు. అంటీ అంటనట్టు ప్రవర్తిస్తాడు. కొత్త భార్యన్న మోజు అతని కేమాత్రం లేదు. లలిత అందమైనది ఆమె అందం అతన్ని కదిలించలేక పోయింది ఎన్నో ఆశలతో, కోటి కోర్కెలతో సూర్యంతో అగ్ని సాక్షిగా మూడుముళ్ళు వేయించుకున్న లలితకు అతని ప్రవర్తన గొడ్డలి పెట్టు. భర్త ఆంతర్యం అర్థం కాక సతమతమవుతోంది.

ఎదురింటివారి గోడ గడియారం రంగున ఐదు గంటలు కొట్టింది, లలిత ఉలిక్కిపడి ఆలోచనలోంచి తేరుకుంది. ఎదురింటి గడియారం మనసులో కదిలింది. తమ ఇంట్లో చిన్న అలారం టైంపీస్ అయినా లేదు. భర్త చేతిని వాచీలేదు. అతనికి వచ్చే జీతం ఖర్చులకే చాలవు నిట్టూరుస్తూ లేచింది.

తండ్రి తనకు కుంపటి కొనిచ్చాడు కానీ దానికి కావలసిన బొగ్గులు ఎంత కాలం కొనివ్వగలడు. భర్త పుల్లలపొయ్యి పెట్టమన్నాడు.

ఎంతో అవస్థతో పుల్లలపొయ్యి వెలిగించింది. భగభగలాడుతున్న ఆ మంటలో తన ఆశలన్నీ అహూతి అయిపోయినట్లనిపించింది. పనంతా చేసి నీట్‌గా రెడీ అయి పూలు కొనుక్కొని పెట్టుకుని భర్తరాక కోసం నిరీక్షించసాగింది.


* * *

చిరాకు మొహంపై చిందులాడుతున్నట్లుగా వచ్చాడు సూర్యం. సైకిల్ దిగుతూ లలితవేపు చూసాడు. ఒక్కసారి అతని మనసు చివుక్కుమంది. ఆమె పెట్టుకున్న పూలపై సూర్యం చూపు పడింది. లలితను చిఱునవ్వుతో వీక్షించలేదు. ఆప్యాయంగా మాట్లాడి అప్పటి వరకూ ఆమె వెన్నంటి ఉన్న వంటరితనాన్ని పోగొట్టలేదు. లలిత తోడి ఉంచిన నీళ్ళతో స్నానం చేసి పక్కపై వాలిపోయాడు

లలితకు గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు అయింది. అది దుఃఖం భర్త తనను పలకరించలేదు. సినిమాలలోలా, కథలలోలా వస్తూనే తనను దగ్గరకు తీసుకోలేదు. కనీసం చిఱునవ్వు పలకరింపైనా లేదు. అలసటగా పడుకున్న సూర్యం ముఖం చూడగానే తన అర్ధం లేని అపోహలకు హృదయం కలుక్కుమంది. పాపం ఎండలో పగలంతా కాళ్ళు అరిగేట్లు తిరిగి వస్తే తనింత స్వార్థంగా ఆలోచిస్తోందా? ఆ క్షణంలో సూర్యంపై ఎంతో జాలి కలిగింది. అతని ప్రక్కగా కూర్చుని పిలిచింది.

"ఏమిటి?" కళ్ళుమూసుకునే అడిగేడు.

"బాగా చీకటి పడింది. ఆకలిగాలేదూ, రండి భోజనం చేద్దాం" అనునయంగా అంది.



డైనా తినొచ్చు. ఎండలో కష్టపడి వచ్చిన వాడిని కాసేపైనా నన్ను పడుకోనివ్వవా?" విసురుగా అన్నాడు

లలిత మటి మాట్లాడకుండా నిశ్శబ్దంగా వాకిట్లోకి వచ్చింది. కడుపులో ఆకలి దహిస్తోంది పొద్దున్న పది గంటలకు తిన్న అన్నం. మధ్యలో కనీసం కాఫీ అయినా ఉండదు. ఒక్క సీసా పాలు తెస్తారు ఉదయం కాఫీ తాగుతారు మిగిలిన పాలు తోడుపేసి రాత్రికి, మర్నాటి ఉదయానికి మజ్జిగగా వాడుతారు టిఫెన్ చేసుకుందామన్నా అవసరమైన వస్తువులు ఇంట్లో ఉండవు భర్త లేకుండా తినాలన్నా లలితకు ఇష్టం ఉండదు ఒకనికి ఆదివారం లీవే. ఆ రోజైనా ఇంట్లో ఉండడు. లలితతో కబుర్లు చెప్పక, ఒక్క పిక్చర్ కన్నా తీసుకు వెళ్ళక ఆదివారం కూడా తను వచ్చిన ఈ నాలుగు వారాలు భర్త ఎక్కడకు వెళ్ళింది లలితకు అర్థంకాలేదు. పేకాటకు వెళ్తాడని తెలియదు. రేపు ఆదివారం రేపైనా ఆయన్ని బ్రతిమాలి ఇంట్లో ఉంచాలి అనుకుంది లలిత.

* * *

ఉదయం లలిత సూర్యానికి కాఫీ ఇచ్చి తన కాఫీ గ్లాస్కూడా తెచ్చుకుంది, అది చూసిన సూర్యం మనసు బాధపడింది.

'లలిత ఎప్పుడు ఇంట్లోనే నీడ పట్టున కూర్చుంటుంది. తను ఎండలో రోజంతా తిరిగే వ్యక్తి. లలిత కాఫీ త్రాగకపోతే ఏమౌతుంది? ఆమె కాఫీ త్రాగకుండా

ఉంటే ఎండలో అలసి వచ్చిన తను మఱి కొంచెం మజ్జిగ త్రాగొచ్చుకదా' లలితకీ విషయం ఎలా చెప్పటం? నువ్వు కాఫీ త్రాగకపోయినా పరవాలేదనీ,ప్రమాదమేం లేదనీ ఎలా చెప్పాలి?' అనుకున్నాడు.

సూర్యంది వింత మనసు. ఎంతసేపూ తను కష్టపడుతున్నాడు లలిత హాయిగా జీవిస్తోందని అతని ఆలోచన. తండ్రితో ఉన్నప్పుడూ ఇలాగే ఆలోచించేవాడు.కానీ తండ్రి నేర్పుగా అతన్ని లొంగదీసుకున్నాడు. అందుకే అతనికి కట్నంగా వచ్చిన డబ్బుతో కూతురి పెళ్ళి చేయగలిగేడు.

తొమ్మిది కావస్తోంది లలిత వంట గదిలో పని చేసుకుంటోంది. రెండు గదుల పాతకాలపు పెంకుటిల్లు వీళ్ళది సూర్యం తొమ్మిదింటిదా దర్జాగా పడుకుని అప్పుడు హడావుడిగా లేచాడు. పెరటిలో నావి ఉంది. ఒక్క బకెట్ నీళ్ళన్నా సూర్యం తోడడు. పనిమనిషి లేదు. లలితే నీళ్ళు తోడుతుంది. స్నానం ముగించి భోజనానికి కూర్చున్నాడు. లలిత అతనికి వడ్డించి కొంత కూర గిన్నెలో ఉంచేసింది.

సూర్యం వదనం వివర్ణమైంది. 'ఏం తను కూర లేకుండా పచ్చడితో తినలేదా? ఇంట్లో హాయిగా తీరి కూర్చునే దానికి కూర ఎందుకు? ఆ కూర నాకుపెడ్తే మఱి కొంచెం అన్నం తిననా?' అనుకున్నాడు.

ఆవేశం ఆపుకోలేక "ఆ కూర ఎవరికి?" అన్నాడు

వింతగా చూస్తూ "నాకు ఏం?"అంది

"ఊరికే అడిగాను" ముభావంగా అన్నాడు

సూర్యం వెళ్ళబోయే ముందు "ఒక్క పది పైసలు ఇచ్చి వెళ్ళండి" అడిగింది లలిత

"దేనికి?" విసుగ్గా ఇడిగాడు.

"నాకు పూలంటే ఇష్టం. సాయంత్రం కొని పెట్టుకుంటాను" చిన్నతనంగా చెప్పింది. పది పైసలకు వివరం అడిగే భర్తను అసహ్యించుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ.

సూర్యం మనసు ఆలోచనలో పడింది. పది పైసలు మరొక పది పైసలు జేరిస్తే మధ్యాహ్నం ఎండలో తనకు టీ వస్తుంది. పాడు పువ్వులు పదిపైసలు తగలేస్తే పది నిముషాలలో వాడిపోతాయి.

"నా దగ్గిర చిల్లర లేదు" అనేసి ముందుకు కదలిపోయాడు. లలితకు దుఃఖం ముంచుకు వచ్చింది

*　　*　　*

సాయంత్రం సూర్యం వచ్చేసరికి లలిత పనులన్నీ చేసి అందంగా అలంకరించుకుంది

ఆమె సిగలోని పూలను చూసి సూర్యం భృకుటి అనుమానంగా ముడిపడింది.

"పూలు ఎక్కడివి?" సూటిగా అడిగాడు.

"బట్టలు ఉతుకుతుంటే మీ పాంట్ జేబులో ఇరవై పైసలు కనిపించినయి" అందంగా మందహాసం చేస్తూ చెప్పింది

సూర్యం పనిమనిషిని కానీ, చాకలిని కానీ పెట్టలేదు. ఇంట్లో అన్ని పనులూ లలితే చేస్తుంది,

సూర్యం రుసరుస లాడుతూ స్నానం చేసి పడుకున్నాడు.

"ఏమండీ! పొద్దుటినుంచీ ఎప్పుడు వస్తారా అని మీ కోసం ఎదురు చూస్తుంటాను. వచ్చారుగా.ఏదైనా మాట్లాడండీ!" దిగులుగా అన్నది.

"దర్జాగా నువ్వు ఇంట్లో కూర్చుంటావు. నేను చచ్చే చాకిరీ చేసే మనిషిని. నీతో కబుర్లు చెప్పటమేనా నా పని.నన్ను కాసేపు పడుకోనివ్వు'' కసురుకున్నాడు.

*　　*　　*

ఆ రోజు ఎదురింటివారు వాళ్ళ పాప పుట్టిన రోజని స్వీట్స్ పంచారు.

జాంగిరీ, జిలేబీ, రెండు లడ్డులు ఇచ్చారు. లలిత వాటిని రెండు ప్లేటులో పెట్టి తీసుకువచ్చింది.

అది చూడగానే సూర్యం మనసు మండింది. తనుకూడా తినాలా? తిరిగి తిరిగి వచ్చిన నాకు పెట్టకూడదా? అనుకుంటూ లలిత తనకివ్వబోతున్న ప్లేట్‌ను విసురుగా లాక్కున్నాడు

అతని చర్యకు లలిత విస్తుపోయింది.

*　　*　　*

లలిత, సూర్యంల సంసారాన్ని దాటుకుంటూ ఐదారు నెలలు గడిచాయి. సూర్యం ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదు. వాటిని ఆచరణలో పెట్టటం నేర్చుకున్నాడు

నిర్మొహమాటంగా తన అభిప్రాయాలు చెప్తున్న భర్తను చూస్తుంటే లలితకు మతిపోతోంది "ఈయన మనిషేనా"? అనే భయంకర అనుమానం మొలకెత్తటంతో శరీరం గగుర్పాటుతో జలదరించింది.

అప్పటి నుండి లలిత అతనితో మాటలు తగ్గించేసింది. సూర్యం కాస్త శాంతించాడు.

ఈ పరిస్థితులలో తను తల్లి కాబోతుందన్న సంగతి తెలిసి సంతోషించాలో ఏడవాలో అర్థం కాకుండాపోయింది.

ఎప్పటి కప్పుడు సూర్యం తనను చిత్రహింసచేస్తున్నాడు కానీ అది తగ్గుతుందనే ఆశ ఎక్కడా కనిపించటంలేదు. నీరసంగా నిట్టూర్చింది.

ఆరాత్రి "నేను తల్లిని కాబోతున్నాను" అంటూ సహజమైన సిగ్గుతో పరవశంగా భర్తకు చెప్పింది.

అతని ముఖంలో ఆశించిన భావాలు ఎక్కడా లేవు.

"ఏమండీ! మాట్లాడరేం?" అడిగింది.

వింటున్న సూర్యం ఒక్కసారిగా ఎగిరిపడ్డాడు "నీకేం? ఎన్నిసార్లయినా తల్లివి అవుతావు. కష్టపడి చెమటోడ్చి సంపాదించే వాడినన్న జాలి నీకేమాత్రం అయినా ఉందా? నా కష్టంలో నువ్వు హాయిగా బ్రతుకుతున్నావ్ ఇక నీ పిల్లలు కూడా నా కష్టం తిని బ్రతకాలా?"

ఒక భర్త, తండ్రి కాబోతున్న వ్యక్తి నోటినుంచి వస్తున్న మాటలకు లలిత నివ్వెరపోయింది

"దీనికి కారణం మీరు కూడాను. మీకు మాత్రం పిల్లలు కారా?" కోపంగా అడిగింది

"ఛీ ఛీ పాడు సంత. నా మెడకు బండ." తిట్టుకుంటూ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

శిలాప్రతిమలా మ్రాన్పడి కూర్చుండిపోయింది లలిత. ఆ రాత్రి, మరునాడు పగలంతా కూడా సూర్యం ఇంటికి రాలేదు. రాత్రి ఎనిమిది అవుతుండగా వచ్చాడు. ఇంటికి తాళం వేసుంది. అది చూసి తెల్లబోయాడు. ఇంతలో ప్రక్కింటి అబ్బాయి వచ్చి "ఆంటీ వాళ్ళ నాన్నగారి ఇంటికి వెళ్తున్నానని చెప్పమని తాళం ఇమ్మన్నారు" అంటూ తాళంచెవి ఇచ్చాడు.

సూర్యం ఆశ్చర్యపోయాడు. 'ఎన్ని తిట్టినా మౌనంగా సహించే వ్యక్తే కానీ తొందరపడదే!' అనుకున్నాడు.

తాళం తీసి లోపలకు వచ్చాడు. పాత పెంకులు కావటంతో పైనుంచి దుమ్ము రాలి పడుతుంది. లలిత ఎప్పటికప్పుడు శుభ్రపరిచేది. ఈ రోజు ఇల్లంతా దుమ్ము పేరుకుంది.

పోతేపోయింది. ఇంక నేను సంపాదించేదంతా హాయిగా నేనే ఖర్చుపెట్టుకోవచ్చు అని సంతోషించాడు. పాంట్ తీసి లుంగీ కట్టుకుందామని ట్రంకు పెట్టె తీసాడు. లుంగీపై పేపర్. తీసి చదివాడు,

'మీకు లలిత వ్రాసేది. ఇటువంటి భయంకర బ్రతుకు నేను బ్రతుకలేను మీరన్నట్లు నా బిడ్డలు మీ చేతుల్లో నరకం చూడటం నేను భరించలేను. అందుకే వెళ్ళిపోతున్నాను — లలిత '

దాన్ని నలిపి నిర్లక్ష్యంగా ఒక మూలకు విసిరికొట్టాడు ఆకలిగా లేక అలాగే మంచంపై వాలి అలసటగా నిద్రపోయాడు.

* * *

మర్నాడు ఉదయం ఇల్లంతా ఒకటే దుమ్ము. సూర్యంకు పిచ్చిగా ఉంది చీపురు పుచ్చుకుని సాధ్యమైనంతవరకు ఊడ్చాడు. చీపురు అరిగి అరిగి చాల చిన్నదిగా ఉంది. కొత్త చీపురు తెమ్మని



'ఈ మహా శిల్పాన్ని పూర్తి చేయలేని కారణం కమా అడిగారు. ఇదిగో ఇదీ.'

లలిత బ్రతిమాలటం గుర్తు వచ్చింది. కాఫీ పెట్టుకుందామని పుల్లల పొయ్యి వెలిగించటానికి ఏడున్నరకు ప్రయాసపడి వెలిగించాడు కాఫీ ఏమీ బాగులేదు. 'లలిత ఇచ్చే కాఫీ అమృతంలా ఉంటుంది' అనుకున్నాడు.

అన్నం వండాడు. మంట ఎక్కువయి తెలియక అది కాస్తా జావరూపం దాల్చింది దొండకాయవేపుడు చెయ్యబోతే చక్కగా మాడి మసిబొగ్గు అయిపోయింది స్నానం చేద్దామని పెరట్లోకి వెళ్ళాడు. రెండు బకెట్లు నీళ్ళు తోడేసరికి చేతులు ఒరుసుకుపోయాయి.

బాధగా 'అబ్బా!' అంటూ అరిచేతులు చూసుకున్నాడు. 'అమ్మో' నీళ్ళు తోడటానికి లలిత ఇంత బాధపడుతుందా' అనిపించింది

రెండు రోజులు గడిచాయి. సూర్యం స్థితి అధ్వాన్నంగా తయారయింది

అన్ని పనులు చెయ్యాల్సివస్తోంది. చివరకు గిన్నెలు కూడా కడుక్కుంటున్నాడు. బట్టలు ఉతుక్కుని మరీ కంపెనీకి వెళ్ళాల్సివస్తోంది. త్వరగా రమ్మని కంపెనీ వారు వార్నింగ్ కూడా ఇచ్చారు.

సూర్యం పనులతో నీరసించిపోయాడు. తను కష్టపడుతుంటే లలిత హాయిగా కూర్చుంటోంది అనుకున్నాడు. కానీ తను 'ఒక్క చేద నీళ్ళు తోడగానే ఆమె బాధ తెలిసింది. ఉద్యోగంలో పడే శ్రమలాంటి శ్రమే లలితదని, లలిత పడే కష్టం అనేది ఎలా ఉంటుందో, ఇంట్లో పనులు చెయ్యాలంటే లలిత కూడా శ్రమ పడుతోందని తెలిసి ఆమె పడే పాటు అనుభవంలోకి వచ్చింది.

ఈ అనుభవాల మధ్యనుంచి అతనికో చక్కని సత్యం తెలిసింది. మనిషి విలువలు అర్థం కాసాగినయ్.

లలితను తను హింసించటం ఎంత అన్యాయమో స్పష్టంగా తెలిసివచ్చింది.

'లలితా' నన్ను క్షమించు' బాధగా అనుకున్నాడు.

అప్పటికప్పుడు తయారై బయటకు వచ్చాడు.

* * *

లలిత సంధ్య దీపం వెలిగిస్తోంది. దీపం వెలుగులో ఎదురుగా కన్పించిన వ్యక్తిని చూడగానే నిశ్చేష్టిత అయింది,

"లలితా" లోకం మరచి అనురాగంగా పిలిచాడు. ఆ పిలుపులోని మార్దవానికి లలిత పులకించిపోయింది. అతన్ని అల్లుకుపోయింది.

సూర్యం మనస్సు నిర్మలంగా ఉంది.

అప్పుడే వెలిగించిన దీపం (లాంతరు) వారి అనురాగానికి సంతోషిస్తున్నట్లుగా మరింత కాంతి పుంజుకుని నవ్వుతూ ఉంది. ★


సీరియల్

ఆరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి

శాంతం శివం సుందరం

జరిగిన కథ

శివరావు సౌమ్యుడు పై మెరుగులకు కాక వ్యక్తిత్వాలకు విలువనిచ్చే వ్యక్తి. ఆయన భార్య మీనాక్షి అందుకు పూర్తిగా వ్యతిరేకం. వారి కున్న ఇద్దరాడ పిల్లలలో పెద్దది ఉమ. గుణాలకు తల్లి పోలిక. తండ్రి గుణాలకు వారసురాలు సుందరి. ఆర్థిక చిక్కులలో ఉన్న గాయక కళాకారుడు సత్యమూర్తికి సాయం చేద్దామనుకున్న సుందరిని కసిరి కొటింది మీనాక్షి శివరావు సత్యమూర్తికి సాయం చేసానని



"ఏమిటి" భర్త కెదురుగా ఒక కుర్చీలో కోపంగా కూలబడింది, కుర్చీ విరిగిపోతుం దేమోనని చూపరులకు అన్పించేటంత ఘోరంగా.

"సారీ, నిద్ర డిస్టర్బ్ అయిందనుకుంటాను." శివరావు పొడిపొడిగా అన్నాడు.

"ఎటూ అవ్వనే అయ్యిందిగా చెప్పండిక అదేమిటో" అతి చీకాకును ప్రదర్శిస్తూ, ఆవులించి, కుర్చీలో వెనక్కు జారగిలబడింది.

"ఈ రోజు పార్టీకి ఎంతైంది?" భోజనం చేస్తూనే అడిగాడు శివరావు, ఆమె దెస చూడకుండా.

అడగరాని ఘోరమైన విషయమేదో అడిగినట్లుగా మీనాక్షి ముఖం క్రోధారుణమైనది "అంటే" తీక్ష్ణంగా ఎదురుప్రశ్న వేసింది.

"అర్థంకాని మాటేమీ అడగలేదే? పార్టీ ఖర్చు ఎంతైంది?" శివరావు కంఠంలో విసుగుదల

"ఇంకా బిల్లులన్నీ చూడలేదు నేను, సుమారు నాలుగువేలవరకూ అయ్యుంటుంది." అసహనంగా పలికింది స్వరం.

"నాలుగా?"

"ఔను. పార్టీ ఖర్చులు — అంటే డ్రింక్స్, మీల్స్ బేరర్స్ — వగైరా ఖర్చంతా మూడు వేలవుంటుంది మిగిలినది బట్టలకు. ఒక పార్టీలో వేసిన దుస్తులు మరో పార్టీలో వేసుకోనుగా నేను" గోళ్ళ పాలిష్ చూసుకుంటూ అన్నది మీనాక్షి. అంతలోనే లేచి నుంచుంటూ, "ఈ దిక్కుమాలిన లెక్కలన్నీ అడగటానికా ఇప్పుడు నన్ను పనిమాలా పిలిచారు" అన్నది.

"కూర్చో మీనా, అవసరమున్నది గనుకనే అడుగుతున్నాను."

ప్రాణం బిగబట్టి వింటూన్నది సుందరి తల్లిదండ్రుల సంభాషణను

"ఏమిటా అవసరం" ఖంగుమన్నది మీనాక్షి స్వరం. కనులలో క్రోధం ఉట్టిపడ్తూన్నది.

"పార్టీలు యివ్వడానికి ఒక అర్థమూ, సందర్భమూ వుంటాయి. ఇప్పుడెందుకింత ఖర్చుపెట్టినట్లు"

"నా డబ్బు నేను ఖర్చుపెట్టుకుంటున్నాను. నాకు మీకు లెక్కలు చెప్పవలసిన అగత్యమూ లేదు, పైసాపైసాకు ముఖం చూచుకోవలసిన గతిమాలిన దశా పట్టలేదు." తీవ్రంగా అన్నది.

"ఎందుకు మీనా అంత అసహనంగా మాట్లాడుతావ్ డబ్బు ఎవరిదో నీవు నాకు అడుగడుగునా గుర్తుచేయనవసరంలేదు పిల్లలుగలవాళ్ళం—ఆలోచించి ఖర్చుపెట్టుకోవాలని మాత్రమే నేనంటున్నాను"

"సారీ. జీవితంలో ఏనాడూ లేని అలవాటు నాకీనాడు క్రొత్తగా ఎలా వస్తుంది? డీఐజీ (D.I.G.) గారి ఏకైక కుమార్తెను" సగర్వంగా అన్నది "ఊహ

తెలిసిన నాటినుండీ నా అలవాట్లు యివే. థ్యాంక్ గాడ్—ఈ అలవాట్లు నేర్పిన మా నాన్న అందుకవసరమైన ఐశ్వర్యాన్ని కూడా యిచ్చిపోయారు నాకు."

శివరావు ముఖాన కత్తివాటుకు నెత్తురుచుక్క మిగలలేదు.

అతడు తనను తాను సంబాళించుకుని మాట్లాడే లోపుగానే తిరిగి మీనాక్షి అన్నది. "ఎప్పటికప్పుడు నేను మిమ్మల్ని చూస్తూనే వున్నాను. నేను పార్టీ తలపెట్టే సరికి ఏమీ సహాయం లేకపోగా కనీసం పార్టీలో ముఖమైనా చూపరు. లోకంలోని బాధ్యతలన్నీ మీ నెత్తినే వున్నట్టు నటన! సదాశివం, రంగనాధం—ఒకరేమిటి—ముఖ్యులైన 'జెంట్స్' కూడ చాలమంది వచ్చారు అందరి ఎదుటా నా తల తీసినట్లైంది." ఆవేశంతో రొప్పుతోంది మీనాక్షి.

సుందరి కలిగించుకున్నది "మనకు కావలసినంతమంది నౌకర్లూ, గుమాస్తాలూ వున్నారు ఇదికాక ఆఫీసు 'స్టాఫ్'లో కొంతమందిని కూడా పంపించారు ఏర్పాట్లు చూడటానికి. ఇక డాడీ స్వయంగా కూడా ఏమి చేయాలి మమ్మీ?"

"యూ షటప్ సిల్లీ క్రీచర్!" పది నిముషాలకోసారి తప్పనిసరిగా ఒకో ఇంగ్లీషు ముక్క దొర్లించడం కూడ మీనాక్షికి అలవాటు. "తగుదునమ్మా అంటూ నాకే చెప్తున్నావా నువ్వు? ఎక్కడా బాగుపడే లక్షణాలు కన్పించడంలేదు నీలో."

తల్లి అదలింపూ, నిరసనలకు చిన్నబుచ్చుకున్న సుందరిని శివరావు జాలిగా చూచాడు. "నువ్వు వెళ్ళి పడుకోమ్మా చాలా ప్రొద్దుపోయింది." అన్నాడు.

సుందరి వెళ్ళిపోయింది తన గదిలోనికి.

"బాగానే తయారుచేస్తున్నారు గారాల కూతుర్ని." ఈసడింపుగా అన్నది మీనాక్షి భర్త నుద్దేశించి "ఇంతకూ సుందరి తిన్నగా యింటికి రాక మీ దగ్గర కెందుకొచ్చింది? మీరిద్దరూ కలిసి ఎలా వచ్చారు?"

భోజనం ముగించి లేస్తూ విసుగ్గా అన్నాడు శివరావు. "మీనా! తండ్రీ, కూతురూ కలసి తిరిగితే ఆక్షేపణ లేదు పరాయివాడితో తిరిగితే లోకమంతా చెప్పుకుంటుంది. ఉమ విషయం నీ కిదివరకే చాలసార్లు చెప్పాను. ఈనాడు మరలా హెచ్చరిస్తున్నాను. కొంచం కట్టుబాట్లుంటే అయినింటి ఆడపిల్లలకు క్షేమం."

"నా పెంపకంపైనా, నా పద్ధతులపైనా మీకంత చిన్నచూపు అన్నమాట?"


మేడమీది తన గదిలోనికి నిష్క్రమిస్తూన్న భర్తను వదలిపెట్టలేదు మీనాక్షి. బుసలుకొడుతూ అనుసరించింది.

"మాట్లాడరేం? నేను పిల్లల్ని సరిగా పెంచడంలేదనా మీ అభిప్రాయం?"

అదోక మాదిరిగా నవ్వాడు శివరావు "నీవూ పెంచలేదు, నేనూ పెంచలేదు; ఆయాలు పెంచారన్నది అందరికీ తెలుసు. కనీసం ఇప్పుడైనా ఏది మంచో, ఏది చెడో తెలియగల శిక్షణ నిమ్మంటున్నాను"

"చూస్తున్నానుగా! ఎందుకో ఒకందుకు రోజూ నన్ను విమర్శించితేగానీ మీకీ

రాక్షసుడే దిగివస్తే ...



మధ్య తోచడంలేదు నేను పుట్టిన—పెరిగిన అంతస్థులు అటువంటివి. పిల్లల్ని చంక నేసుకు తిరుగుతూ, మాటిమాటికీ సిగ్గుబిడియాలు లేకుండా పాలిస్తూ, వాళ్ళ మల మూత్రాలతో కంపుకొడుతూ తిరిగే మామూలు కుటుంబాలవాళ్ళకి నా వంటివాళ్ళు విడ్డూరంగానే కన్పిస్తారు."

"మీనా! మన వివాహం ఏనాడో అయిపోయింది. ప్రస్తుతం మనకు వివాహం కావలసిన కూతుళ్ళున్నారు. ఈ దశలో కూడా నీ భర్త నీకంటె ఎన్ని అంతస్థులు తక్కువలోనివాడో తలచుకు తలచుకు వాపోవడంవల్ల లాభమేమిటి? మన ఉమ, ఆ సదాశివం కొడుకు శంకర్‌తో సినిమాలకూ, షికార్లకూ తిరుగుతోందని, చూచిన వాళ్ళు చెప్పడమే కాదు—'ఇద్దరికీ పెళ్ళి కుదిరిందా' అని అడుగుతున్నారు' నాకు ఏమి చెప్పాలో తెలియడంలేదు."

"నాన్సెన్స్, రోగ్స్, కల్చర్‌లెస్ బ్రూట్స్" కాలితో నేలను కసిగా తన్నింది. "ఆడా, మగా కలసి తిరిగితే అందులో ఏదో సంబంధం వుండి తీరాలా? ఎప్పుడు బాగుపడ్తుంది ఈ పూర్ ఇండియా? అయినా మన అంతస్థూ, దర్జాలూ, పద్ధతులూ ఈ మామూలు మట్టిమనుష్యులకేం తెలిసి ఏడుస్తాయి? ఆఫ్టరాల్—అటువంటి వాళ్ళకోసమా మీరు ఇంతగా యిదౌతూన్నది?"

"మీనా, ఇది అంత తేలికగా తోసిపారేయగల విషయం కాదు. అయినా అంతెందుకు? సదాశివం భార్యా, నువ్వూ స్నేహితులే కదా? మంచి సమయం చూచి

అడిగి నిర్ణయం చేయరాదూ? ఆ తర్వాత వాళ్ళెలా తిరిగినా మనకు నిశ్చింత."

"వ్హాట్?!" ఆశ్చర్యంగా అర్థం కానట్లు అడుగుతూ, భర్తను పిచ్చివాడిని చూచినట్లు చూచింది మీనాక్షి.

"ఏం? శంకర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేసుకువచ్చాడట. ఇక ఆ కుటుంబంవారితో—నీకు బాగా నచ్చితేనేకాని నువ్వు స్నేహం చేయవన్నది యధార్థమేగా?"

"మీకేం మతిగాని పోలేదు కదా?"

"ఎందుకనీ? సదాశివానికి మనకంటే ఎక్కువ బిజినెస్ వున్నది. ఒక్కడే కొడుకు, చదువు బాగానే వుంది. నీకు కావలసినవి ఇవే కదా?"

"ఆఁ. మహావుంది బిజినెస్. కొడుకు ఒక్కడే అయితే కూతుళ్ళు నలుగురు లేరూ? వాళ్ళంతా కదలి వెళ్ళేసరికి ఇక కొడుక్కి మిగిలేదేముందీ? మనకున్నదంతా ఈ యిద్దరికే కదా? ఒక్కొక్కళ్ళకి పదిలక్షలు తక్కువ కాదు మనం యిచ్చే ఆస్తి"

"అవునూ. అయితే?"

"మన ఆస్తికంటె ఎక్కువ వున్నవాడు కాకపోతే కనీసం మనతో సరితూగే వాడన్నా రావాలి మన యింటి అల్లుడుగా. అంతేకానీ, ఆఫ్టరాల్ సదాశివం పెళ్ళాన్ని—నేను, మన అమ్మాయిని కోడలిగా చేసుకోమని ఎలా అడుగుతా ననుకున్నారు? నా పిల్లలు కావాలని వాళ్ళంతట వాళ్ళే రావాలి కానీ, ఈ మీనాక్షి అలా ఒకళ్ళని దేవిరించేది కాదు"

"సరే. నీ యిష్టం. మరి నీ నిర్ణయం అదే అయితే ఉమను కొంచం హద్దుల్లో ఉంచు. శంకర్‌తో తిరగనీయకు."


"అబ్బబ్బబ్బ! బీసీ నాటి మాటలు మాట్లాడతారేం మీరు? రోజులు మారాయి, అమ్మాయి చదువుకుంది, సోషల్‌గా 'మూవ్' అవ్వడం తెలిసినది! ఇంతమాత్రాన కొంపలేం అంటుకుపోయాయి?"

"రోజులు మారాయి కానీ మనుషులూ, మనసులలోని మాలిన్యమూ, వయసులు తెచ్చే చపలతా మారవు మీనా."

నిర్లక్ష్యంగా నవ్వింది మీనాక్షి, 'ఉమ నా కూతురు సుమా' అన్నట్లు

"శంకర్ కాకుంటే మరొకరు. ఉమ ఎటూ చదువు మానేసింది గనుక, మనం వివాహ ప్రయత్నంలో వుండటం అవసరం."

"ఛీ ఛీ, ఉమకు ఇరవై రెండో ఏడే కదా ఇంకా? అప్పుడే పెళ్ళా? హెల్! పెళ్ళైతే ఏముందీ? అది అమ్మా, నేను అమ్మమ్మనూ? నో నో, నా కసహ్యం ఇంత తొందరగా పెళ్ళిళ్ళు చేయడం. ఏం మించిపోలేదు ఇప్పుడే వాళ్ళ 'ఫ్రీడం'ని చంపేయలేను" ఖండితంగా అనేసి తన గదిలోనికి నిష్క్రమించింది



5

"నమస్కారమండి."

"ఓ వచ్చావా? కూర్చో."

కానీ సత్యమూర్తి కూర్చోలేదు. శివరావు ఎదుటనున్న టేబుల్‌కు ఒకప్రక్కగా కొంచం ఒదిగి నిలబడ్డాడు, అతడు చూస్తూన్న పని పూర్తిచేసి తలెత్తేవరకూ.

"అరె, ఇంకా నిలబడే వున్నావా? కూర్చోవోయ్."

"ఫర్వాలేదండి. ఇదిగో నా సర్టిఫికెట్స్." చేతిలోని పెద్ద కవరును శివరావుకు అందించాడు.

అన్నీ వివరంగా చూచిన శివరావు వదనం ఆనంద ప్రఫుల్లమైనది.

"భేష్. చదువులో ఫస్ట్. లలిత కళలలో ఫస్ట్. అయినా ఉద్యోగం లేక అల్లల్లాడుతున్నాడు'" స్వగతాన్ని పైకే విన్పించాడు

"నాకు తండ్రి లేరు. ఎవరూ పెద్దవారు లేరు సిఫార్సులు చేయటానికి. అందుకే " మాటలు ఎలా పూరించాలో తెలియనట్లుగా వుండిపోయాడు.

శివరావు గంభీర దరహాసం ఒలికించాడు.

"మీరు ఏ పని యిచ్చినా నమ్మకంగా చేసుకుంటాను సార్."

శివరావు గుబురుమీసాల చాటునుండి మరో మందహాసం, దయార్ద్రమైన చూపూ ద్యోతకమైనాయి.

"ఒక నెలవరకూ తర్ఫీదు జరుగుతుంది. నా పర్సనల్ అసిస్టెంటుగా పనిచేయ

గలవా?" నిశితంగా చూస్తూ అడిగాడు.

వేయి జ్యోత్స్నల కాంతితో వెలిగిపోయింది సత్యమూర్తి వదనం. ఏడాదిగా ఉద్యోగం కొరకు తిరిగి తిరిగి వేసారిపోయి, జీవితం పైననే విరక్తి పెంచుకుంటూన్న అతడికి ఈ క్షణంలో దైవం శివరావు రూపంలో సాక్షాత్కరించి వరా లొసగుతూన్నట్లే అనుభవమై కొలది క్షణాలు ఏమి మాట్లాడవలెనో కూడ తెలియక తబ్బిబ్బుపడి చూడసాగాడు.

"జీతం ఏడు వందలు, వసతి సౌకర్యం వుంటుంది."

ఇప్పుడూ మాట్లాడలేదు సత్యమూర్తి.

"ఏమిటి, ఆలోచించుకోవాలా?"

"లేదు సార్. ఇంకా ఆలోచన ఏమిటి, మీరింతగా నన్ను ఆదుకుంటూంటే? కానీ ఒక్క మనవి."

"ఏమిటి?"

"మన్నించాలి. పద్ధతులకు విరుద్ధంగా అడగరానిదే అడుగుతున్నాను మీరు నన్ను నమ్మగలిగితే ఒక్క అయిదు వందలు అడ్వాన్సుగా యిప్పించండి. వారం రోజుల తర్వాత పనిలో జేరుతాను నన్ను నమ్మండి సార్. మా అమ్మకు ఆపరేషన్ ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. ముందు డబ్బు చేతిలో వుంచితే కానీ, డాక్టర్ ఆస్పత్రిలో అసలు అడుగే పెట్టనివ్వడు."

ఒక్క నిముషం ఆలోచించి ఫోను చేతికి తీసుకున్నాడు శివరావు

"హల్లో! డాక్టర్ పరబ్రహ్మం' ఆఁ నేనే శివరావును నా దగ్గర పని చేస్తూన్న ఓ అబ్బాయి సత్యమూర్తి అనీ ఈ సాయంత్రం నీ దగ్గరకు పంపుతున్నాను. అతడి తల్లికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి ఆఁ ఆఁ. అదే మరి స్వంత కేసులా చూచుకోవాలి. ఓ. కే. థాంక్యూ."

ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో చూస్తూన్న సత్యమూర్తి దెస తిరిగాడు శివరావు. "చూడు మూర్తీ. సాయంత్రం అయిదు గంటలకు మీ తల్లిగార్ని డాక్టర్ పరబ్రహ్మం గారికి చూపు. నేను మాట్లాడాను ఆయనతో, చాలా ప్రసిద్ధిగల డాక్టరు. అనవసరంగా జనాన్ని పిండుకు తినే రకం కాదు."


వెంటనే తన సెక్రెటరీ రీటాను పిలిచాడు.

"చూడు రీటా. అయిదొందల రూపాయలూ, డాక్టర్ పరబ్రహ్మంగారి అడ్రసూ యివ్వు ఈయనకు."

"ఓకే సర్."

"త్వరలోనే నీవు వెళ్ళిపోతున్నావ్ కదా? ఆ స్థానంలో ఈయన్ని భర్తీ చేసుకుంటాను. నువ్వు లేని లోటు నాకు కన్పించకుండా తర్ఫీదు యియ్యి."

"ఓకే సర్."



ఔచిత్యం ఆత్మగా, సభ్యత ప్రాణంగా నటించే బహు కొద్దిమందిలో సత్యనారాయణ ఒకడు. 'జ్యోతి' చిత్రంలో ఆయనకు దీటైన నటనను ప్రదర్శించింది జయసుధ. శ్రీ అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్ పతాకం క్రింద, క్రాంతికుమార్ సృష్టిస్తే, కె. రాఘవేంద్రరావు ప్రాణం పోసిన బొమ్మ 'జ్యోతి'.

"చూడు మూర్తీ. ఎపాయింట్‌మెంట్ ఆర్డరూ, డబ్బూ తీసుకువెళ్ళు. రీటా యిస్తుంది. డాక్టర్‌గారి అడ్రస్‌కూడా తీసుకో. ఎప్పటికప్పుడు పరిస్థితి నాకు తెలియజేస్తూండు. నీ వీలు వెంట వచ్చి డ్యూటీలో చేరు."

సత్యమూర్తి నమస్కరిస్తూ ఏవో కృతజ్ఞతావాక్యాలు పలుకబోయాడు.

"నో." హుందాగా, ప్రేమగా మందలించాడు శివరావు.

"వర్క్ మోర్. టాక్ లెస్!"

6

"ఎవరో ఆ శివరావుగారు, భగవంతుడే ననుకుంటాను. రోజూ దీపం పెట్టి మొక్కుతాను."

అనుదినం లెక్కలేనన్ని సార్లు అన్నమాటే మరలా మరలా అనుకోసాగింది భద్రమ్మ.

"ఔనమ్మా." అంగీకారంగా అంటాడు సత్యమూర్తి, శివరావుయెడల భక్తిప్రపత్తులు నిండిన హృదయంతో.

కుట్లు విప్పిన నాడు అన్నాడు డాక్టర్ పరబ్రహ్మం,

"రేపు మీరు యింటికి వెళ్ళిపోవచ్చు. ఆహారాది విషయాల్లో మాత్రం నేను చెప్పిన జాగ్రత్తలు తీసుకుంటూండండి మూడు నెలలవరకూ."

"అలాగే బాబూ!" చమర్చిన నేత్రాలతో డాక్టర్‌దెస చూస్తూ నమస్కరించింది భద్రమ్మ. "మీరూ, శివరావుగారూ మరలా నాకు పునర్జన్మనిచ్చారు. నా ఒక్కగానొక్క

కొడుకు ఏకాకి కాకుండా రక్షించారు."

"మాదేముందీ, దైవనిర్ణయం." హుందాగా అన్నాడు పరబ్రహ్మం.

అక్కడే వున్న సత్యమూర్తి అన్నాడు "నిజం డాక్టరుగారూ! శివరావు గారూ, మీరూ ఆదుకోకుంటే నేను అమ్మను బ్రతికించుకోగలగడం కలలో మాట."

సత్యమూర్తి వీపుపై ఆదరంగా తట్టుతూ, మాట మార్చాడు పరబ్రహ్మం. "వయస్సు కూడా ఎక్కువే గనుక కొంత జాగ్రత్తగా వుండాలి. ఎక్కువగా శ్రమ పడకూడదు, పళ్ళూ, గ్లూకోజ్—బలమైన ఆహారం యిస్తుండాలి."

అపరాధివలె తల వాల్చుకున్న సత్యమూర్తి మందస్వరాన అన్నాడు. "ఇంత కాలం అశక్తుణ్ణి. ఇకమీదట జాగ్రత్తగానే చూచుకుంటాను డాక్టరుగారూ! నాకు నౌఖరీ దొరికింది మీరు బిల్లు ఇవ్వండి. నేను ఆ ఏర్పాట్లు చూచుకుంటాను"

"బిల్లు శివరావుగారు తమకు పంపమన్నారు. నిన్ననే ఆయనకు పంపించి వేశాను."

తల్లీ కుమారులిద్దరూ ఆశ్చర్యాతీతమైన అనుభూతితో ముఖముఖాలు చూచుకున్నారు.

"బిల్లు విషయం ఆయనకు వదలివేయండి మీరేం శ్రమపడనవసరంలేదు ఆఁ విను సత్యమూర్తీ! ఒక్క మాట—నౌఖరీ దొరికిందంటున్నావు అదృష్ట వంతుడివౌతావ్ విశ్వాసంగా, బాధ్యతతో ప్రవర్తిస్తే మా శివరావు సామాన్యుడు కాదు, దేవుఁడే మంచివారికి." అంటూనే డాక్టర్ నిష్క్రమించాడు.

"డాక్టరుగారి మాటలు నిజం బాబూ! ఉద్యోగం ఇవ్వటానికి లంచాలు కోరి పీడించుతూన్న ఈ కాలంలో ఇటువంటి వ్యక్తి వున్నారంటే దేవుఁడు కాక ఎవరు? నా చర్మం చెప్పులు కుట్టి యిచ్చినా తీరదేమో! ఉద్యోగం బాధ్యతతో చేయడమే కాదు, ఆయన ఎప్పుడే పని చెప్పినా 'ఇది నా పని కాదు' అనకు స్వంత మనిషిలా ప్రవర్తించు."

"అలాగేనమ్మా!"

7

కళాశాలకు వెళ్ళటానికి తయారై పోర్టికోలోనికి వచ్చిన సుందరికి అప్పుడే గేటు దాటి ఆవరణలోనికి వస్తూన్న సత్యమూర్తి కన్పించాడు.

ఆమెలో ఒక్కసారిగా సంతోషం పెల్లుబికింది.

"మీరా?" అని సుందరి పలుకరిస్తూన్నంతలోనే అతడు సగౌరవంగా నమస్కరించాడు.

"ఆ రోజునుండీ మిమ్మల్నొకసారి కలుద్దామనుకుంటూనే వుంటున్నాను. కానీ " అర్ధోక్తిలో ఆపివేశాడు.

"ఎందుకో?" తెలిసే అడిగింది సుందరి.

"నేనిలా నిలబడటానికి కారకులైనవారికి కృతజ్ఞతలు తెలియజేసుకోవడం కనీస ధర్మం కాదా?"

"ఓ! అయితే లాంఛనం తీర్చుకోవటానికే నన్ను కలుసుకోవాలనుకున్నారన్న మాట? అంతేనా?"

సమాధానం చెప్పలేని సత్యమూర్తి తల వాల్చుకున్నాడు

"ఏమిటవి? ఆఫీస్ ఫైల్సు యింటికి తెచ్చినట్లున్నారే?" మాట మార్చింది సుందరి.

"ఔను కొన్ని కాగితాలపై నాన్నగారి సంతకాలు అర్జంటుగా తీసుకోవాలి. ఇంట్లోనే వున్నారా?"

"ఆc. రండి. ఇక్కడ కూర్చోండి. నేను నాన్నగారికి చెప్పివస్తాను "

ఆ గృహవాసులు ఎంత సంపన్నులో చాటి చెప్తూన్న ఆ డ్రాయింగ్ రూం లోని ప్రతి వస్తువునూ పరిశీలనగా, ఆశ్చర్యంగా చూస్తూన్న సత్యమూర్తి తల త్రిప్పి చూచాడు అడుగుల సవ్వడి విని.

వెంటనే లేచి నిలబడ్డాడు తడబడుతూ, ఏ భయంకర వన్యమృగాన్నో చూచి నట్లుగా.

ఎక్కడికో వెళ్ళటానికి తయారై వచ్చిన మీనాక్షి సత్యమూర్తిని చూస్తూనే అయిష్టతతో కనుబొమలు ముడివైచింది.

"ఎవరవు నువ్వు? ఏం కావాలి?"

"నేను నేను "

"ఓ!" గుర్తుకు వచ్చినట్లుగా తల పంకించింది. "ఏం మళ్ళీ వచ్చావ్?" ఉరిమింది

"నేను అది కాదండి " సత్యమూర్తికి కంగారులో ఏం మాట్లాడాలో తెలియటంలేదు.

మీనాక్షికి విసుగూ, కోపం ఎక్కువౌతున్నాయ్ "ఆc. నువ్వు నువ్వే, కన్పిస్తోనే వుందిగా? ఏమిటా గొణుగుడు? నీ గానసభలు మా కొద్దు మొర్రో అంటోంటే మళ్ళీ తయారయ్యావెందుకు? వెళ్ళు వెళ్ళు. మాటిమాటికీ విసిగించబోకు "

"శివరావుగారు రమ్మన్నారండి." ఎలాగో చెప్పగలిగాడు.

"ఓ!" అధికమైన ఆగ్రహంతో తల ఎగురవేస్తూ అన్నది "శివరావుగారికేమైనా క్రితం జన్మలో బంధువువా? వెర్రివేషాలు కట్టిపెట్టు ఫో. కదులు ముందిక్కడినుంచి."

"ఈ జన్మ బంధువే మీనా!"

ఆ స్వరం ఎనవచ్చిన దెస తల త్రిప్పి చూచారు ఇద్దరూ.

శివరావు ఒక్కో మెట్టే దిగి వస్తున్నాడు అతడి వెనుకే సుందరి.

సత్యమూర్తి మౌనంగా నమస్కరించాడు శివరావుకు.

"హల్లో మూర్తీ!" అని అతడిని పలుకరిస్తూ, "మన రీటా స్థానంలో భర్తీ

అయిన వ్యక్తి." అని భార్యకు వివరించాడు శివరావు.

మీనాక్షి మానసికస్థితి ఎట్లా వున్నదో ఆమె గిరుక్కున తిరిగి వేగంగా నిష్క్రమించడంలోనే స్పష్టమౌతూన్నది మెత్తని తివాచీతో ఆచ్ఛాదింపబడి వున్నప్పటికీ నేల అదురుతూన్నట్లే అన్పించింది ఆ పదధ్వనికి.

"మమ్మీ' నన్ను కాలేజీలో దింపి నువ్వు వెళ్తావా?" సుందరి తల్లి వెను వెంటనే వెళ్ళి అడిగింది

"స్పైము లేదు. నాకు బజారులో అర్జంటు పని వున్నది." విదిలించినట్లే అని వెళ్ళిపోయింది.

"నేనేం చేయను మరి"

"ఓ రోజు కాలేజి మానేస్తే ఏం కొంప మునగదు."

దీనంగా తండ్రి దెస చూచింది సుందరి

"నువ్వెలా వచ్చావ్ సత్యం?"

"ఆఫీస్ వాన్‌లో "

"నేను కాగితాలు చూస్తుంటాను. నువ్వు సుందరిని కాలేజీలో దిగవిడిచిరా."

సుందరి సంకోచంగా చూస్తూ నిలబడింది.

"వెళ్ళమ్మా ఈ రోజుకు. ఇక నీ కెప్పుడూ యిటువంటి ఇబ్బంది కలగకుండా నేను ఏర్పాటు చేస్తాగా"

సుందరి వదనం ఆనందంతో వికసించింది.

"థ్యాంక్యూ డాడీ." సంతోషంగానే వెళ్ళింది సత్యమూర్తితో కలిసి.

చాల తడవు సత్యమూర్తే తనకై తాను ఏమైనా మాట్లాడతాడేమోనని చూచింది సుందరి.

కానీ సత్యమూర్తి చాలా గంభీరంగా మౌనంగా వున్నాడు

"మా మమ్మీ ఎవరితోనైనా అలాగే మాట్లాడతారు. మీకు కోపం వచ్చిందను కుంటాను" అన్నది నెమ్మదిగా.


సత్యమూర్తి ఒక్కసారి సుందరి దెస చూచి చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

ఆ నవ్వు ఎంతో నిర్మలంగా కన్పట్టింది సుందరికి. ఇక ఆ విషయంమీద ఆ గంభీర మూర్తి ఏమీ తర్కించడని కూడా అవగాహన చేసుకున్నది అందుకే ప్రసంగం మార్చింది. "మీ అమ్మగారు కులాసాగా వున్నారా ఇప్పుడు?" ప్రకాశంగా అడిగింది.

సత్యమూర్తి ముఖం విప్పారింది తన తల్లి యోగక్షేమాల పట్ల. ఆ ధనికురాలి కున్న శ్రద్ధగురించి

"సుఖంగానే వున్నారండి." ఆనందంగా జవాబిచ్చాడు. "ఇంకా అంతగా ఓపిక రాలేదండి, ఎక్కడికీ వెళ్ళగల స్థితిలో లేదు. లేకుంటే ఎప్పుడో వచ్చి మీ దర్శనం చేసుకొనేదే."

"ఎందుకూ?" అయోమయంగా చూచింది సుందరి.



సత్యమూర్తి చూపులు త్రిప్పుకొంటూ జవాబు చెప్పాడు· "మీ గురించీ నాన్న గారి గురించీ చెప్పానండి. అనుదినం దైవపూజ చేసేటప్పుడు ఆమె సంస్మరించేది మిమ్మల్నే·"

"మీరు గోరంతలు కొండంతలు చేసి ఎదుటివారికి లేనిపోని గొప్పదనం అంట కడతారు." తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నది.

"నిజం చెప్పాను. అంతే వచ్చే ఆదివారంనాడు తీసుకొస్తాను మా అమ్మను."

గుండెల్లో రాయి పడింది సుందరికి అతడితో మాట్లాడుతూ అంతవరకూ పొందిన సంతోషమంతా యెగిరిపోయింది.

ఆ రోజంతా ఆమెకు కళాశాలలో ఒక్కపారం కూడా తలకెక్కలేదు.

ఆ భయమంతా సాయంత్రం తండ్రికి వెల్లడించింది.

"సత్యమూర్తిగారు తల్లిని మన యింటికి తీసుకొస్తారట "

"ఊఁ. నాతోకూడ అన్నాడు." పరధ్యానంగా అన్నాడు శివరావు.

"ఈ ప్రమాదం గడిచే ఉపాయం ఆలోచించాలి."

"ఏం? ఏమిటీ?" అప్పటికి శివరావు అన్యమనస్కత తగ్గి సరిగా కూర్చుని అడిగాడు.

"ఏముందీ? ఇంటికి వస్తే వాళ్ళకీ మనకూ కూడ పరువు దక్కదు. మమ్మీ మన క్రింది అంతస్థు వాళ్ళ నెవ్వరినీ మనుషులుగా చూడదు."

"ఔను. కాని, వస్తామన్న వాళ్ళని రావద్దని ఎలా చెప్తాం? మన ఉద్యోగులకూ

పరిచితులకూ అందఱకూ తెలిసిన విషయమేగా ఇదీ? ఆవిడకూ్కడా తెలుస్తుంది. అంతేగా?"

"పోనీ మనమే ఒక్కసారి ఫార్మల్‌గా వెళ్ళి చూచి వచ్చేస్తే?" బెదురుతూనే అన్నది.

"వాళ్ళ యింటికా?" ఆలోచనా పూర్వకంగా అన్నాడు.

అంతలో సత్యమూర్తి వచ్చాడు హడావుడిగా,"సార్. తీసుకొచ్చాను.చూడండి."

అదిరిపడింది సుందరి. 'కొంపదీసి ఈ రోజే తీసుకొచ్చాడా ఏం తల్లిని? మమ్మీ ఇంట్లోనే వున్నదికూడ, ఖర్మ.'

శివరావు గుబురు మీసాల చాటునుండి హుందాగా నవ్వు మెరిసింది.

"దా సుందరీ నీకోసం ఏం కొన్నానో చూడు."

ఏమీ అర్థంకాని సుందరి తండ్రి వెనుకనే నడుస్తూ బెదురు చూపులు చూడ సాగింది. సత్యమూర్తి ఇలా తమ యింటికి రావడం గురించి మళ్ళీ తల్లి ఏమి రభస చేస్తుందోనని.

"ఇది కేవలం నీకోసం సుందరీ." ఆవరణలో వున్న స్కూటర్‌ను చూపుతూ లాన్‌లో గార్డెన్ చెయిర్‌లో కూర్చున్నాడు శివరావు.

సుందరి వదనం ఆనంద ప్రపుల్లమైంది.

"ఓ! థాంక్యూడాడీ!" చిన్నపిల్లలా గెంతుతూ స్కూటర్‌చుట్టూ తిరగసాగింది.

"రంగు నచ్చిందా?"

"ఓ యస్!" చలాకీగా చెప్పింది.

"కారు వున్నదీ—లేదూ అని రోజూ నీవు ఇబ్బంది పడనక్కరలేదు. కాలేజీకి వెళ్ళటానికి ఇది రోజూ నీకూ అనువుగా వుంటుంది."

"అక్కడ మరో కలర్‌కూడా వున్నది కానీ ఈ రంగే చాలా అందంగా వున్న దండి." సత్యమూర్తి అన్న మాటలకు అటుచూచింది సుందరి.

"యువర్ సెలెక్షనీజ్ గుడ్. థాంక్యూ"


ఇంటికి వెళ్ళినా, భోజనం చేస్తున్నా, శయ్యను జేరినా సత్యమూర్తి ఆలోచనలు సుందరి చుట్టూనే పరిభ్రమించ సాగాయి.

'ఎంత చక్కటి మనసు, ఎంతటి సంస్కారయుత ప్రవర్తన! మరెంతటి అదృష్టవంతురాలు! తండ్రికి గారాల పట్టి, ఆహా!'

8

కుటుంబంలో ఉన్న సభ్యులు నలుగురు మాత్రమే. కానీ ఆ నలుగురూ ఒక్క సారి భోజనం చేయడ మనేది చాలా అరుదు. ఎప్పుడైనా కలసినా ఆ సందర్భం సర సంగా వుండడం కూడ అరుదే.

"సుందరికోసం స్కూటర్ తీసుకుంటూన్నట్టు నాకు మాట మాత్రంగానైనా చెప్పలేదేం?" మీనాక్షి భోజనానికంటె ముందు సవాళ్ళు ప్రారంభించింది.



"ఏదీ—ముందు అనుకుంటే కదా చెప్పడానికి? మొన్ననే ఏదో మాటలమీద జయేంద్రన్ చెప్పాడు—అతనిదేగా ఏజన్సీ—క్రొత్తలాటు స్కూటర్లు వచ్చాయనీ ఒకరిద్దరు తీసుకోవలసిన పార్టీలు తీసుకోడం లేదని, కారుతో ఎప్పుడూ నీకేదో ఓ పని వుండనే వుంటూంది. పాపం, సుందరికి అవస్థగా వుంటోంది. అందుకే "

"ఒక నెంబరు వాళ్ళు వదిలేస్తే తర్వాతి వాళ్ళ కిస్తారు. మన కెలా వచ్చింది ముందు తతంగమేమీ లేకుండా? బ్లాకున కొన్నారా? ఎంతిచ్చా రేమిటి?"

"మన కెందుకా అవస్థ అంతా? జయేంద్రన్ మనకు కావలసిన వాడేగా? ఎలాగో ఏర్పాటు చేస్తాడు మనకు బ్లాకూ గీకూ అవసరమేమిటి? ఫోన్ చేయగానే స్కూటర్ తీసుకో మన్నాడు కాదనకుండా. ఇంకా చెక్కు పంపలేదు. పంపిస్తాను రేపు." అంతలోనే నవ్వేస్తూ అన్నాడు "జయేంద్రన్ తెలివి తక్కువ వాడా ఏమిటి నాకు బ్లాకున అమ్మటానికి? ఈ రోజు ఒక పని చేశాడంటే రేపు నా చేత నాలుగు ఉపకారాలు పొందుతాడు."

ఉమ సుందరి వెప ఈర్ష్యగా చూచింది తల్లి దెస తిరిగి ఫిర్యాదుగా అన్నది. "నా పేపర్స్ దిద్దే వాళ్ళకి కాస్త చెప్పి నాకు పాస్ మార్కులు వచ్చేట్టు చూడమంటే అటువంటి పనులు తప్పు అన్నారు డాడీ, సుందరి కోసమైతే ఏద్దైనా చేస్తారు."

"ఉమా!" అదలింపుగా అన్నాడు శివరావు అయితే ఆ మందలింపు ఉమాకేమీ సిగ్గు కలిగించలేదు గర్వంగా నవ్వుకుంటూ భోజనాని కుపక్రమించింది.

"మనకు రెండు కార్లున్నాయి, ఆఫీస్ వెహికిల్స్ సరే సరి మళ్ళా ఇప్పుడు

అయిదారువేలతో స్కూటర్ దేనికి? అనవసరం." ఖచ్చితంగా అన్నది మీనాక్షి.

విస్మయంగా చూచాడు శివరావు. "మీనా!" అన్నాడు, అంతకంటే ఏమీ అనలేక.

"ఆఁ. ఏం?"

"ఒక్క అయిదారు వేలు—అదీ మన సుందరి సౌకర్యంకోసం లెక్క చూసు కొనేంత స్థితా మనది?"

"అంటే?" ఖంగుమంటూన్న స్వరంతో అడిగింది, చేతిలో నున్న చెమ్చాను పెద్ద శబ్దమయ్యేట్టు ప్లేటులో జార విడుస్తూ.

భర్త అనే ప్రతి మాటకూ, చేసే ప్రతి చేష్టకూ పెడార్థాలు తీస్తూ నిత్యం కయ్యానికి కాలు దువ్వుతూండడం మీనాక్షి ప్రత్యేక గుణం అని తెలిసినప్పటికీ, నాటి వివాదానికి కారణం తాను కావటం సుందరిని కృంగదీసింది. భోజనం చేయను మనస్కరించక, అలాగే తలవాల్చుకు కూర్చున్నది భార హృదయంతో.

ఇక ఈ తర్క వితర్కాల తర్వాతి ఘట్టం ఏమిటో ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో అనుభవపూర్వకంగా తెలిసిన శివరావు మౌనంగా భోజనాని కుపక్రమించాడు, అప్రియ సంఘటనలు జరిగే అవకాశాలను తప్పించే సదుద్దేశ్యంతో.

కానీ మీనాక్షి విడువలేదు. "మీ రసలు ఆనాటి కానాడు నన్ను లక్ష్య పెట్టడం తగ్గించేస్తున్నారు. దీని లెక్కేమిటన్నట్లుగా వుంటూన్నది మీ ధోరణి ప్రతి పనిలోనూ," నేరారోపణ చేసింది అమిత క్రోధం వ్యక్తీకరించే స్వరంతో.

శివరావు ఒక్కసారి తలెత్తి చూచి మరలా భోజనాని కుపక్రమించాడు.

సుందరి బెదురుగా మార్చి మార్చి చూడసాగింది తలిదండ్రులను.

"మరి సుందరికి స్కూటర్ కొంటే నాకో? నాకేం కొంటావ్ మమ్మీ?" ఉమ గారాలు పోతూ అడిగింది.

"ఛీ. స్కూటరా? మన స్టేటస్‌కి స్కూటరేమిటి చౌకబారు వాళ్ళలాగా? నువ్వడిగితే ఏం కాదన్నానమ్మా? అడుగు. ఏం కావాలో."

"కారు కావాలి." ఉమ మరింత గారాబంగా అడిగింది. "మా ఫ్రండ్సంతా అంటున్నారు నీకో స్వంత కారుండాలి అని."

"అలాగే కొనుక్కో. వచ్చే నెలలో కొంటాన్లే."

ఆనందానికి పట్టపగ్గాలులేని ఉమ అప్పటికప్పుడే భోజనం మధ్యలో లేచి, ఎవరో స్నేహితులకు ఫోన్‌చేసి చెప్తోంది ఈ శుభవార్త.

"హా హాఁ. మై డియర్. మా మమ్మీ నాకు ప్రత్యేకంగా ఓ కారు కొనిస్తా నన్నారు. ఏదైతే బాగుంటుం దంటావే?" ఏదేదో మాట్లాడ్తూనే వుంది ఫోన్ వదలి పెట్టకుండా.

"పిల్లల్ని పెంచే పద్ధతి ఇది కాదు మీనా." తాపీగా అన్నాడు శివరావు.

"ఓ! మీ నుండి నేర్చుకుంటాను అయితే." ఆటంబాంబు ప్రేలినట్లే వున్నది



పై ఫొటోలో 'ముగ్గురు మూర్ఖులు'న్నారు గుర్తించండి. (మూర్ఖురాంద్రు కాదని గమనించ మనవి) రచయిత, నిర్మాత మహేష్, కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో నిర్మిస్తున్న హాస్యపు విందు 'ముగ్గురు మూర్ఖులు' చిత్రం.

ఆ కంఠస్వరం "ఏది పద్ధతో, ఏది పద్ధతి కాదో నా విషయంలో తెలిసినంతగా స్వవిషయంలో తెలియదా?"

"నా మాటను కాదనడమే నీవు పనిగా పెట్టుకొంటే నేనేం చెప్పలేను. ఉమకు ప్రత్యేకం కారు ఎందు కిప్పుడు?"

"సుందరికి స్కూటర్ ఎందుకో ఆలోచించేరా? దర్జాగా కార్లలో తిరిగే మన స్టేటస్ ఏమిటి? సుందరి స్కూటర్ మీద రోజూ కాలేజికి పోతే మన డిగ్నిటీకి ఎంత భంగం అది?"

"లేదు మమ్మీ, స్కూటర్ నడపడం చక్కగా వుంటుంది నాకు "

"నువ్వు నోర్ముయ్ " సుందరి మాటలు పూర్తి కాకుండానే కసిరి పారేసింది మీనాక్షి.

ఎల్లప్పుడూ సహనంగా, శాంతంగా కన్పట్టే శివరావు వదనంలో కొద్దిగా క్రోధం పొడచూపింది "కొంత వయస్సంటూ వచ్చిన తర్వాత వాళ్ళని అనేమాట ఏదో, అనకూడని మాట ఏదో ఆలోచించాలి. సంతానమైనంత మాత్రాన ఎప్పుడూ పసిపిల్లలనుగా చూడకూడదు" భోజనం అసంపూర్తిగానే వదలి నాప్‌కిన్ విసరి పడేస్తూ విసవిసా వెళ్ళిపోయాడు.

చూస్తూండగానే మీనాక్షి వదనంలో చండికారూపం ద్యోతకమైనది.

ఫలితంగా ఆ ఖరీదైన డిన్నర్ సెట్‌లోని కొన్ని వస్తువులు ఛళ్ళు ఛళ్ళున నేలన పడి తునా తునకలైనాయి.

భర్తను వెన్నంటి వెళ్ళింది వడివడిగా అడుగులువేస్తూ, యుద్ధసన్నద్ధురాలై.

ఈ సన్నివేశం ఉమలో ఎటువంటి చలనాన్నీ కల్గించలేదు. ఆమె అలా తరగని సంతోషంతో ఫోన్‌లో మాట్లాడ్తూనే వుంది స్నేహితురాలితో.

ఉమకంటె రెండున్నర సంవత్సరాలు చిన్నదైన సుందరిని మాత్రం ఈ సంఘటన కృంగదీయడమే కాదు, కంట తడి పెట్టేట్లు చేసింది. తానూ భోజనం వదలి తన గదిలోనికి వెళ్ళిపోయింది

బీదవారు కడుపునిండా తినడానికి లేక ధనికులపై అసూయ జెందుతారు. కాని అన్నీ వుండీ వున్నవారుకూడా తినలేరని వారికి తెలియదు!

తన గదిలో రకరకాల యోచనలతో చింతిల్లుతూన్న ఆమెకు తలిదండ్రుల వాగ్వాదం స్పష్టంగా వినవస్తోంది.

"అడుగడుగునా నన్ను విమర్శిస్తారేం? ఏమిటసలు మీ ఉద్దేశ్యం? నేను పిల్లల్ని సరిగా పెంచడం లేదూ? పిల్లల ఎదరే ఆ మాట అనడంలో మీ ఉద్దేశ్యం?" తారా స్థాయిలో వినవస్తోంది మీనాక్షి కంఠం.

అతి నెమ్మదిగా శాంతంగా విన్పించింది శివరావు కంఠం.

"నేను కేవలం పిల్లల సమక్షంలో అన్నాను. నీవు ఇంటి నౌఖర్లందరికీ, ఇరుగు పొరుగు లందరికీ చాటించుతున్నావ్ తెలుసా? అంత బిగ్గరగా ఎందుకు అరుస్తావ్?"

మీనాక్షి మరింత రెచ్చిపోయింది. "అందుకు కారణం ఎవరు? మీరు! నా కిష్టం లేని పనులు చేసి నాకు పిచ్చి పట్టేట్టు చేయడం, ఎదురు నా దోషమేదో వున్నట్లు నాకే ధర్మపన్నాలు చెప్పడం."

శివరావులో శాంతం చెదరలేదు.

"కన్న బిడ్డకు సౌకర్యంగా స్కూటర్ కొనడం తప్పు కాదు. మరి ఆ స్కూటర్ డిగ్నిటీకి భంగమని నువ్వనుకోవడం నా నేరం కాదు, గౌరవ మర్యాదలూ, హుందా తనమూ అనేవి మన నడతలో,చేతలో,మాటలో వుంటాయి కాని,డాంబికాలలోకాదు."

"ఆ దిక్కుమాలిన స్కూటర్ గొడవకాదు నేననేది వెధవ అయిదారువేల కోసం నేనేం ఏడ్వడం లేదు ఇది చెప్పండి—తిండైనా లేని గర్భదరిద్రుడిని తెచ్చి ఆఫీసులో ఎందుకూర్చోబెట్టారు?"

"ఎవరూ?"

"వాడే. ఉదయం వచ్చినవాడు, రీటా స్థానంలో తన కూతుర్ని వేసుకోమని మిసెస్ వరదాచారి ఆర్నెల్లనుండీ కుక్కలా తిరుగుతోంది నా చుట్టూ అటువంటి వాళ్ళైతే అణగి మణగి పడివుంటారని నేననుకుంటూంటే "

"నా సెక్రెటరీగా మనిషే వుండాలి. కుక్కల అవసరం లేదు" [సశేషం]

హాచ్చ్

సుశీలకు మా చెడ్డ చిరాగ్గా వుంది. వారంలో ఏడురోజులు భర్త ఆలస్యంగా ఇంటికి చేరుతుంటే చిరాగ్గా వుండక చిద్విలాసంగా వుంటుందామరి! ఆ రోజూ షరా మామూలే, ఆకాశవాణి ఆంగ్ల వార్తలు సమాప్తమయ్యే సమయానికి పిల్లిలా ఇంట్లో అడుగు పెట్టాడు రాంబాబు బాంబులా పేలిపోయింది సుశీల! నేనీ కాపురం చేసే ఓపిక పోయిందంటూ బిర్ర బిగుసుక్కూచుంది.

'చూడు సుశీలా అసలేం జరిగిందంటే ' రాంబాబు మాటలు పూర్తి కాకుండానే 'హరికథలొద్దు మహాశయా' అంది రకు్కన సుశీల.

'కాదు కాదు వాస్తవగాథ నువ్వు విను. వింటే చాలా బాధపడతావ్' అంటూ మొదలెట్టి 'మా సుబ్బారావ్ లేడోయ్ అదే సుబ్బిగాడంటాం చూడూ వాడే పళ్ళేత్తు ఆ ఆ వాడికి పాపం మధ్యాహ్నం యాక్సిడెంటయింది. ముందు రెండు పళ్లు రాలిపోయాయి. ఇప్పుడు అందంగానే ఉన్నాడనుకో . అయినా మూతిదగ్గర వాచి మరీ హనుమంతరావులా వున్నాడు పాపం వాడిని హాస్పిటల్‌కి చేర్చి మందులవీ ఇప్పించి..ఆపైన .."

"చాలండీ చాలు మిమ్మల్నపార్థం చేసుకొన్నాను. పాపిష్టిదాన్ని' రండి తిండి తిందాం పాపం ఆ సుబ్బారావుగారి కెలా వుందో ఫోం చేసి హాస్పిటల్‌గానీ మళ్ళీవెళ్ళాలా నాకేం భయంలేదులెండి. కష్టంలో వున్న మిత్రుడ్ని ఆదుకోకపోతే మన స్నేహాలెందుకండీ " అంటూ తెగ బాధపడిపోయింది సుశీల. 'నా సుశీలదీ ఎంత దయార్ద్ర హృదయము' అంటూ మంద్రంగా పాడుకొంటూ స్లోమోషన్ సినిమా బొమ్మలా బాత్‌రూం వైపు నడిచాడు రాంబాబు.

భోజనాలయ్యాక విశ్రమించారు దంపతులు. హఠాత్తుగా సుశీల ఉలిక్కిపడి లేచి 'అయ్యయ్యో నా మతి మండా. .ఎంత పొరపాటు జరిగిందీ ఏమండీ నన్ను మన్నించండీ' అంటూ చెడామడా వాపోసాగింది.

'బాధపడకు ప్రియతమా అసలేం జరిగింది ' ఓదార్పుగా అన్నాడు రాంబాబు.

'అదేనండీ మీ సుబ్బారావుగారు లేరూ అదే మీరు సుబ్బిగారంటారు పళ్ళెత్తు ఆఁ ఆఁ ఆయనే సాయంత్రం మీకోసం వచ్చారండీ పాపం ఏడు గంటల వరకూ ఆవలిస్తూ, సిగరెట్లు కాలుస్తూ హాల్లోనే కూర్చొని ఎదురు చూశారు కాఫీ రెండుసార్లిచ్చి మర్యాద చేశాననుకోండి. .మిమ్మల్నిప్రొద్దున్నే ..'

"ఆపు నేను వినలేను. నిజం చెప్పేస్తాను రామారావూ,రాజూ రెండురౌండ్లు వేసుకుందామంటే అబ్బే అది కాదు. పేక రెండురౌండ్లే అనుకున్నా గానీ వెధవది అలాగే మరో నాలుగు రౌండ్లు గడిచిపోయింది. రేపట్నుంచీ ఒట్టు ఏ ఒట్టుబడితే ఆ ఒట్టు ఒట్టుమీద ఒట్టు.. ఆరుదాటి ఇంటికొస్తే నాపేరు తీసి మరో పేరు పెట్టు లేదా నన్ను కొట్టు కాని

ఇప్పటికి మాత్రం . కోపం తగ్గించు
సుశీలా నా జీవన ప్రేమ లీలా "

సుశీల నవ్వేసింది. 'అలాగండి దారికి-హన్నా అబద్ధాలా! ఇక ఆ విషయం గుర్తు చేసుకోవడం నాకూ ఇష్టం లేదు ఎందుకంటే '

'ఎందుకంటే '

సుశీల మాట్లాడలేదు. తన తలలోవే మల్లెపూలు వాసన చూడసాగింది

* * *

దబదబ తలుపు శబ్దానికి మెలకువ వచ్చింది సుశీలకు. బద్ధకంగా ఆవులించి టైంచూస్తే ఆరు దాటుతోంది. కళ్ళు నులుముకొంటూ తలుపు తీసింది. ఎదురుగా ఖంగారుగా నిలబడ్డ పరమేశాన్ని చూసి ఖంగారుపడింది.

'ఏడీవీడూ నిద్రలేవలా లేపమ్మా కొంచెం అర్జంటూ' అంటూనే వచ్చి కుర్చీలో కూలబడ్డాడు పరమేశం. సుశీల వెళ్ళి రాంబాబును లేపింది

"ప్రొద్దున్నే కొంపలు మునిగి పోతున్నట్లు నిద్రలేపమని ఎవడు చెప్పాడ్రా నీకూ సుశీలాకాఫీ ఇవ్వవూ "అంటూ వస్తున్నాడు రాంబాబు హాలులోకి.

'కాఫీకాదు వెళ్ళాలి. ఏరా నిన్న మధ్యాహ్నమనగా ఆ సుబ్బిగాడికి ఆక్సిడెంటయి హాస్పిటల్ లో వుంటే నువ్వటు చూడకపోయావు. నేను ఇప్పటివరకూ అక్కడే వుండి వస్తున్నా. ఫర్వాలేదులే. మరీ ప్రమాదం లేదు,చెడ్డలో మంచంటారు చూడు. ఎత్తుపళ్లూ రెండూ రాలిపోయాయి మూతి ఆంజనేయుడి మూతిలావున్నా..."

పరమేశం మాటలు వినడం మానేసిన రాంబాబు భార్య వంక గుర్రుగా చూడసాగాడు.

—వేమూరి సత్యనారాయణ

మరీ మినీ కథ

శ్రీరంగనీతులు

"ఇవ్వాళ మన గాంధీతాత పుట్టినరోజు. ఈయన మనకు దర్శన మిచ్చిన దేవుడు. అహింసయే ఈయన వేదము. ఈయన అడుగు జాడల్లో నడవడం మన కర్తవ్యం. కావున మీరు ఇవ్వాళ మేకల్ని కోసి మాంసం అమ్మవద్దు" అని గ్రామ పెద్ద జగన్నాథంగారు బోధిస్తున్నారు

అందరూ ఒప్పుకొంటూ ఎవరి దారిన వారు వెళ్లారు. నరసింహం ఒక్కడు మిగిలి పోయాడు. నేడు గడపడం ఎలా? ఇదే ఆయన ప్రశ్న.

రోజూ నరసింహం మేకల చర్మాలు ఇక్కడినుంచి పట్నానికి తీసికెళ్ళి అమ్ముతాడు. అందులో రోజూ మూడు ఒక్కోనాడు నాలుగురూపాయలు సంపాయిస్తాడు. మరి ఇవ్వాళ?

వస్తులు తప్పవనుకొంటూ గొణుక్కుంటూ ఇంటిదారి పట్టాడు.

"గాంధీతాత పుట్టిన్నాడు వస్తులుంటె పుణ్యమైనా లభిస్తది. అతనిలో చోటుచేసుకొందీ వాక్యం.

ఇంట్లోకి అడుగుపెట్టాడు.

"ఎమామె' ఇయ్యాల్ల బేగే ఇంటికొస్తివి. బ్యారం లేదా?" అందుకొంది భార్య సీతాలు.

సీతాలు జగన్నాధం గారింట పని మనిషి.

"మీ అయ్యగారొచ్చి ఇయ్యాల మేకలు కొయ్యొద్దు. గాంధీతాత పుట్టిన రోజు అని ఇంకేమో చెప్పాడే."

"అయ్యో! నేను ఇప్పుడే అల్లింట్ల కోడ్ని కోసి వస్తున్నగద. అయ్యగారే కొయ్యమంద్రు" అంది అర్థంకాని సీతాలు.

—శశి

★ విశ్వ దంపతులు ★

విశాల విశ్వాంతరాళంలో
తారోద్యాన వనాంతరాలలో
నిత్యనూతనంగా నిర్విరామంగా
విహరించే ఆదర్శ ప్రేమికులు
జగన్మిత్రులు - సూర్యచంద్రులు !

పంచ ఖండాలలో
ప్రపంచ తత్త్వాలతో
విరించి విరచిత విలాసకావ్యంలో
చరించి చలించి గతించే
భూగృహ గ్రహవాసులు
స్త్రీపురుష జాతి పాత్రలు !
వీరు బలిష్ఠంగా నిర్మించుకున్న
అసమాన సమాజానికి
మీ అసమాన సమానత్వం - పాఠం !

అప్రపూర్ణ భావ సంకీర్ణంతో
నిద్రాణంలో నిర్యాణమై
పరంపరాగతంగా సంక్రమిస్తున్న
జాతి వర్గ వర్ణ ఝంఝూనిలాలలో
కులకళేబర దహనవీచికలు వీచి
భారతమాత శ్వాస కుహరాలలో
నృత్యం చేస్తున్న తత్త్వాన్ని
శాశ్వత దంపతులారా తిలకించండి !

నిరాశా నిస్పృహా వేదనలతో
నీరసించే మానవజాతి చాతకాలకై
అశాఖ విశాఖ వృక్షవాటికలో
స్వాతీ ముక్తాఫల వర్షాన్ని కురిపించి
నవచైతన్యానికి - భవితవ్యానికి
పురోభివృద్ధికి - సమైక్యసిద్ధికి
సోపానాలను చూపండి !
శుభాశిషాలను కురిపించండి !
ఓ విశ్వదంపతు లారా !!

అది నిజం, ఇది నిజం!

కుతూహలం— ఒక్కొక్కప్పుడు మహ చెడ్డది.

ఒక్కొక్కప్పుడు అమిత మంచిది.

ఎడనెడ అత్యవసరపరిస్థితి కల్పిస్తుంది.

ఏ కొండ గుహలోనో ముక్కు మూసుకుని ఏకాంతంగా సమాజానికి దూరంగా బ్రతికితే తప్ప మనిషన్నవాడు కుతూహలం బారినుండి తప్పించుకోలేడు.

మా ఆఫీసులో ఓ వింత మనిషున్నాడు. వింత అంటే అతనికి నాలుగు కాళ్లూ, ఐదు కళ్లూ ఉన్నాయని కాదు. మనలో లేనిది-అతనిలో ఉంది. అదే వింత. ఆ వింత మనిషి పేరు—వేణు. చాలా అందమైన వాడు.

అపరిమిత మితభాషి. మంచి గుమాస్తా. అవసరానికి మించి అక్షరం పొల్లుమాట మాట్లాడని వాడు. నిజానికి ఇటువంటి మనిషి మా మధ్య ఉన్నందుకు మేము గర్వించాలి. ఎమర్జెన్సీ డిక్లేర్ చెయ్యక ముందుకూడా పది గంటల ఒక నిముషానికి సీటులో కూర్చుని పని ప్రారంభించేవాడు.

ఐదు గంటల ఒక నిముషానికి ఆఫీసు మెట్లు దిగేవాడు ఈ చివరి నిజం. ఇదే మా పాలిటి శత్రువై కూర్చుంది. ఓవర్ టైముకి మా శాఖలో అవసరం లేదు. ఉన్నా, ఓవర్ టైము వొద్దని ఐదు అయ్యేసరికి వెళ్ళిపోయేవాడే ఏమో!

మనిషి సంఘజీవి. చుట్టూ ఉన్నవారి ననుసరించి ప్రవర్తిస్తూ ఉండాలి అది. మనిషిగా అతని ధర్మం, న్యాయం వీటి నతిక్రమించే వేణు మాకు పచ్చి వెలక్కాయ ఐపోయాడు.

మగవాళ్ళకు కొన్ని ప్రివిలేజెస్ ఉన్నాయి (ఈ నిజాన్ని రాస్తున్నందుకు మహిళలు క్షమించాలి). సిగరెట్లు పేకాట తాగడం రోడ్లమీద పని లేకుండా తిరగడం, ఎవరికీ చెప్పకుండా సినిమాలకి పోవడం—వగైరాలు.

ఈ అవకాశాలు ఆడవాళ్ళకి లేవనికాదు. ఉన్నావాళ్ళు ఎప్పుడో తప్ప వినియోగించుకోరు. వాడుకనుబట్టి కొన్ని అధికారాలు ప్రాప్తిస్తాయి కదా? (చూడుడు. 'లా'లో యీజ్‌మెంట్ అను అధ్యాయము).

ఈ మగ అధికారాలను వేటినీ వేణు ఉపయోగించడు. అతని జీతంలో ఐదు పైసలుకూడా తగ్గదు.ఏ డిడక్షనూ ఉండదు జీతంలో. కవరు తెరవకుండా జేబులో వేసేసుకుని వెళ్ళిపోయే వేణుని చూస్తే మాకు మహా అసూయ.

ఆవేళ—"ఈ వేణు మన కొంప ముంచుతాడోయ్ ఏదో ఓరోజు,"అన్నాడు శంకరం నేను చేసిన డీలుషోకి డబ్బు లిస్తూ.

ఆడుతున్న ఆరుగురమూ భయంగా చూశాం. శంకరం తత్వమే అంత. ఉండుండి పిడుగులాటి మాట పడేసి మనని కంగారు పెట్టేస్తాడు

అతని మాటలకి టీకా తాత్పర్యా లతనే చెప్పాలి. లేకపోతే అన్వయించుకుని అర్థం చేసుకోవడం మన తరంకాదు.

"ఆడవాళ్ళకి అంటువ్యాధులు అతి

త్వరగా వ్యాప్తిస్తాయి కనుక మనం వెంటనే మేలుకోవాలి. మేలుకుని తీరాలి."

విశ్వం—సస్పెన్సు భరించలేక—ఓ అరుపు అరిచాడు—"మా కర్థమయ్యేటట్లు ఏడవ్వోయ్ ఆ ఏడ్చే దేమిటో—"

ఆ కాంప్లిమెంటు తింటేతప్ప శంకరం సవ్యంగా చెప్పడు.

"మనం అంతా మంచివాళ్ళం. పేక ముక్కల్ని ప్రేమించగలం. రమ్మునైనా రమ్మని పిలవగలం. తెలుగు సినిమాలకి కూడా రెగ్యులర్‌గా అటెండెన్స్ వేయించుకోగలం. రష్‌ని పెంచడం ఎందుకని అర్ధరాత్రి తప్ప యిళ్ళకి చేరని అతి మంచి వాళ్ళం. వేణు—విద్రోహి. అతను ఐదూ పదీ అయ్యేసరికి ఇంట్లో—ఇల్లాలిముందు వాల్తాడు. ఆడవాళ్ళ నోట్లో అయ్యరిడ్లీ కూడా నానదు. వేణు భార్య మన భార్యలతో (శంకరం భాష అంతే) తన భర్త మంచితనం గురించి చెప్పక మానదు. ఇహ మనకి ఇంటికి చేరేసరికి-సీతాపతీ.... చాపే గతీ అంటూ పాటలో కలిసి పోయాడు. శంకరం పాటలో పడ్డాడంటే ఆపడం ఎవరి తరమూ కాదు. మ్యూజిక్ కూడా సొంతంగా యిచ్చేసుకుని మూడు నిముషాలూ మాడెగర గొడతాడు.

సమస్య — ప్రమాదం — అర్థమై పోయింది అందరికీ.

మోహన్ మెల్లగా అన్నాడు—"ఫర్లేదర్రా. వేణు భార్య కూడా నన్ను ముట్టుకోకు నామాల కాకే. వేణుకి తగ్గదే."



"ప్చ్!" నిట్టూర్చాడు రఘు. "లాభం లేదొరేయ్. ఆడాళ్ళని నమ్మలేం."

రచయిత కావాలని ప్రయత్నించి ప్రయత్నించి మానేసిన రఘు కథ చెప్తాడని తేలిపోయింది. పాఠకులు దొరక్కపోయేసరికి శ్రోతలకి పురాణ కథలు చెప్పేడం అలవాటు చేసుకున్నాడు. మాంచి టైముచూసి—పేకాటదగ్గరా—క్యాంటీన్ టేబులు దగ్గరా కథలు చెప్పేస్తుంటాడు రఘు. మేము చిక్కిపోయాం.

కథ—విని చావ్వలసిందే.

"అడవిలాటి చోట రెండే రెండు కుటుంబాలుండేవి. ఆడాళ్ళిద్దరూ పోట్లాడేసుకున్నారు ఎవరు ఎవర్ని అక్కా అని పిలవాలా తేలక ఒకరింటి పోపు రెండో యింట ఘుమఘుమ లాడకుండా తలుపులు మూసేసుకున్నారు. కొంతకాలం గడిచింది. సంక్రాంతి పండగొచ్చింది ఆ వేళ ఇద్దరూ ఒక్కసారే రెండిళ్ళ మధ్య తలుపులూ తెరిచారు. వాళ్ళ చేతుల్లో

"ఏమున్నాయ్?" సస్పెన్సు భరించలేని విశ్వం కరిచినట్లు కసిరాడు.

త్రుళ్ళిపడి నోరు జార్చాడు రఘు— "కొత్త చీరెలు. పండక్కి మొగుళ్ళు కొన్నవి—"

"నిజమే—" వంత పలికాడు శేఖరం. "ఆడవాళ్ళ చీరలపిచ్చి అలాటిదే. మా ఆవిడ ప్రయాణ మైందంటే కిందటి సారి వచ్చాక కొన్న చీరలన్నీ పట్టుకెళ్తుంది అక్కడుండేది ఒకటి రెండ్రోజులే అయినా "

"కనుక—ఏ కొత్తచీరో మన మహిళా మణులను ఏకం చేయక మానదు.

ఆ యొక్క మహిళా మండలిలో—మొగుళ్ళ మంచి చెడ్డల ప్రసక్తి— "

"మన మొహాలు! మనలో మంచి అదే చెడ్డ ఏమంటుంది"?

"అలాగనకు. ఆడవాళ్ళు అసాధ్యులు. ఐస్క్రీముతో అగ్గిపెట్టె వెలిగించేగలరు. మనం యింత మంచివాళ్ళమా? ఏ స్త్రీ నంత గుడ్ షెపర్డ్సమా? మనలోకూడా లోపం ఎంచేగలరు."

"ముందు—కర్తవ్యం ఆలోచించండి. అసలే మన మగాళ్ళకి రోజులు బాగులేవు. ప్రమాదం రాకుండా జాగ్రత్త పడకపోతే మన పేకాట గల్లంతు. వెట్ పార్టీలకి నూకలు చెల్లు. సాయిబు మసాలా పకోడీలూ, రామయ్య చేగోడీలూ "

అందరూ తీవ్రాలోచనలో పడ్డారు. పేకాట సాగుతూంది—నిశ్శబ్దంగా.

అందరి ముందూ ఒకటే ప్రశ్న. వేణు అంత టంచన్గా ఇంటికెందు కెళ్తాడు? వెళ్ళి ఏం చేస్తాడు?

"హా, తెలిసెన్ " అరిచాడు రఘు. "దొంగ రాస్కెల్, ఇందుకా యిల్లు పట్టుకు వేలాడతావ్! నువ్వు నీచుడివి. దుర్మార్గుడివి. దుశ్శాసనుడివి. సినిమా విలన్ వి."

"ఎవరు?"

"ఇంకెవరు? వేణు."

"వేణు ఎందుకు నీచుడు? దుర్మార్గుడు? దుశ్శాసనుడు? సినిమా విలనుడు?"

ఆవేశంగా రొప్పి—"వేణుభార్య చాలా అందమయింది. వీడిది వొట్టి విషపు హృదయం. అందుకే ఆమెను—సీతలాటి ఆమెను—అనుమానించి వీలైనంత సేపు కాపలా కాయడం. అందుకే ఆఫీసు



నుంచి అలాగ పరుగెత్తడం— "అని ఆగాడు.

ఒక్కసారిగా చర్చ సీతమీదకి మళ్ళింది. వేణు భార్య పేరేమిటో మాకు తెలీదు. సీత అనే ఉదహరించుకోసాగాం.

సీతను చాలా అందగత్తెగా తేల్చి పారేసింది మా సంఘం.

"పెళ్ళా న్ననుమానించడ మేమిటీ బొత్తిగా!''

"పెళ్ళాన్నికాక ఎవరి ననుమానిస్తే ఎవరూరుకుంటారు?"

"మనం మంచివాళ్ళం. ఎందుకంటే పెళ్ళాల ననుమానించం."

పకోడీలూ, టీ, చేగోడీలూ, సిగరెట్లూ అన్నీ ఐపోయాక పేకాటా ఐపోయింది. కొందరి జేబుల్లో డబ్బులూ ఐపోయాయి.

వాచ్ మన్ చేత చీవాట్లు తిని—క్లబ్బు వొదిలి రోడ్డుమీద పడ్డాం.

"చూడూ! రేపు నువ్వు వేణు దగ్గరికెళ్ళి నాలుగు చీవాట్లు పెట్టి—అనుమానపడకూడదని చెప్పి—మనలో కలపాలి. ఏం?"


నలుగురూ కలిసి అలాగ ప్రతిపాదించాక యిక నేనేం చేసేది? కాదన్నా లాభం లేదు. ఎలాగో పని ముగించాలి సవ్యంగా. పిల్లి మెడలో గంట కట్టవలసిన బాధ్యత నామీదపడినందుకు భయపడుతూనే అంగీకరించాను.

ఆ రాత్రి నిద్రకి స్వస్తిచెప్పి—సిగరెట్లనాశ్రయించి—వేణుని జయించడానికి ఉపాయాలాలోచించాను.

తెల్లవారింది. ఆఫీసుకి గంట టైముందనగానే వేణు యింటికి బయలుదేరాను.

"రండి —"ఆహ్వానించాడు వేణు. అప్పటికే అతను భోజనమో టిఫినో కానిచ్చేసినట్లున్నాడు. నాకు-కాఫీ తెప్పించాడు.

అప్పుడు అతని శ్రీమతిని చూశాను.



ఈ అమ్మాయిని దమ్మిడీ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నానర్రా!

మే మనుకున్న దానికంటె ఎక్కువ అందంగా లేదు.

ఇద్దరమూ కలిసి ఆఫీసుకి బయలు దేరాం.

"చూడండి వేణూ!—"

"ఏమిటి?"

"అనుమానం అనేది మంచి లక్షణం కాదు "

ఆశ్చర్యంగా చూశాడు.—"ఔను."

"అందులోనూ—మగవాడు—భార్య ననుమానించడం చాలా ఘోరం."

"అంతకంటెనరకం మరొకటుండదు. ఏమంటారు?"

"మీరు చాలా నిజం చెప్పారు. తిరుగు లేని నిజం—" నవ్వాడతను.

మెత్తని పులి—అనుకున్నాను.

ఈ మనిషిని మృదువుగా జయించడం అసాధ్యం అనుకున్నాను.

ఆఫీసు—దగ్గర పడిపోతూంది.

"థాంక్స్ ఇవాళనుంచీ మీరు అనుమానపు నరకంనుంచి బయటపడి "

"సారీ," నవ్వుతూనే అన్నాడు-"నా తరం కాదు—"

నాకోపం వొచ్చింది, ఓడిపోతున్నందుకు బాధ. "ఎందుకని? మీరు మనుషులు కారా? మీలో మానవత్వం లేదా? అనుమానించడం అమానుషం కాదూ?"

"క్షమించండి, మీరు వాగ్దానం చేస్తే మీకొక తియ్యని రహస్యం చెబుతాను—"

"సరే" వాగ్దానం చేశాను.

"ఎవరికీ చెప్పకండి. చెబితే ప్రమాదమని కాదు. కానీ—"

"చెప్పనన్నానుగా—"

"అనుమానం ఎప్పుడూ చేదుగానే ఉండదు. ఒక్కొక్కప్పుడు మధురంగా అతి మధురంగా ఉంటుంది."

"నాకు—కవిత్వం అర్థంకాదు."

"ఆ చక్కని అనుభవాన్ని—మాటలలోకి యిమడ్చడం చాలా కష్టం. భార్య భర్తననుమానిస్తే — చాలా హాయిగా ఉంటుంది. మా శ్రీమతికి—నా అందాన్ని చూసి ఎవరయినా ప్రేమించేస్తారని తెగ భయం. అందుకని తన శాయశక్తులా నా చుట్టూ అనుక్షణం అందమైన స్వర్గాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తూంటుంది. వివరాలు ఒకరికి చెప్పదగ్గవి కావు, నాకోసం రోజుకొక స్వర్గం సృష్టించేది మా శ్రీమతి. ఒక్కొక్క బందిఖానా బాధగా ఉండదు. తీయగా ఉంటుంది అది—అనుభవైక వేద్యం "

ప్రపంచాన్ని మొదటిసారి చూసినట్లయింది

నన్ను చూస్తూ — జాలితో కాబోలు నవ్వుతున్నాడు వేణు.

అతనిమీద అసూయ వేస్తోంది!

భార్యలు తీయగా అనుమానించగలరా?

★

సీరియల్

హే మంగళా

ఎ. శ్యామలారాణి

జరిగిన కథ: చిన్నతనంలోనే తల్లి దండ్రుల్ని పోగొట్టుకున్న మంగళకు అండగా నిలిచి ఆమె ఆస్తిపాస్తుల్ని సంరక్షించి ఆదరించాడు చౌదరి. రామం కుటుంబంలో దాదాపు ఒక మనిషిగా మసలేది మంగళ. రామం భార్య గౌరి అంటే ఎంతో అభిమానం. రామం తమ్ముడు రాజంటే ఎంతో అనురాగం ఆమెకు. రాజు చదువుకు డబ్బు సాయం చెయ్యాడానికి తనకున్న ఒక్క ఆధారమూ అయిన యిల్లు అమ్మేసింది మంగళ. పట్నంలో పెరిగి చదువుకున్న గౌరి, మురళీబాబును ప్రేమించీ అతన్ని పొందలేక పోయిందన్న విషయం ఒక సందర్భంలో గౌరే చెప్పింది మంగళకు. ఇల్లు అమ్మిన మంగళని తన యింట్లోనే వుండమన్నాడు రామం. మురళీబాబు వచ్చి గౌరిని కలుసుకొన్నాడు. గౌరి పిన్ని ఆడిన దుర్మార్గపు నాటకం కారణంగా మురళీబాబు తనను చేసుకోలేక పోయాడని తెలిసిన గౌరి కలత చెందింది. తన స్నేహితురాలు కృష్ణవేణిని పడుపువృత్తిలోకి దింప ప్రయత్నిస్తున్న ఆమె తల్లికి నచ్చచెప్పి కాపాడింది మంగళ. కృష్ణవేణిని పొందాలని చూసిన రంగనాథానికి బుద్ధి చెప్పింది మంగళ. హఠాత్తుగా రామం మరణించాడు. ఆ బాధ తట్టుకోలేని రాజు మనశ్శాంతికోసమని చెప్పి గమ్యం లేని యాత్రకు బయల్దేరాడు. రంగనాథం మంగళపై పగబట్టాడు. డబ్బు చిక్కులు ఎక్కువై సతమత మవసాగారు మంగళ, గౌరి. పరిస్థితి చక్కదిద్దేందుకు తీవ్రంగా ప్రయత్నించ సాగింది మంగళ. మంగళపై గౌరికి దురభిప్రాయం ఏర్పరచేందుకు ప్రయత్నించిన రంగనాథానికి శృంగభంగమయింది. కన్నకు ప్రమాదకరమైన జబ్బు చేస్తే

11



వారంరోజులుగడిచాయి. మురళిబాబు రోజూ వచ్చివెళుతున్నాడు. కన్నకి బాగా జ్వరం తగ్గిపోయింది. కొద్దిగా లేచికూచుని, కబుర్లు చెప్తున్నాడు. ఈ వారం రోజుల్లో వాడికి మురళిబాబుతో మంచి దోస్తీ కుదిరింది "డాక్టరు బాబాయ్!" అనడం మొదలు పెట్టాడు. వాళ్ళ బాబాయ్ ఎక్కడున్నాడో వెతికి తీసుకురమ్మని చెప్తూంటాడు

ఆరోజు శుక్రవారం. మంగళ అప్పుడే సర్వమంగళాదేవి ఆలయం నుండి ప్రసాదం పట్టుకుని వచ్చింది. "కృష్ణవేణిని చూసి ఎన్నాళ్ళయిందో ఇప్పుడే వచ్చేస్తా" నంటూ పళ్ళెం గౌరి చేతిలో వుంచింది

"చీకటి పడకుండా వచ్చేయాలి సుమా! ఈ మధ్య నాకు మరీ భయం ఎక్కువయింది" అంది గౌరి.

"సరే" నంటూ మంగళ వెనుతిరగబోయేసరికి గుమ్మంలో కారాగి, మురళిబాబు దిగి వచ్చాడు.

"అరె, ఈ రోజు వీడు కూడా బయటికొచ్చేశాడే—ఏమిటి కథ?" అంటూ ఆశ్చర్యంగా కన్నకేసి చూసాడు.

"అంతా నీ దయ మురళీ! ఇంతసేపూ నీ గురించే అడుగుతున్నాడు" అని చెప్తూంది గౌరి. కాని మురళి దృష్టి ఆమె కేసి లేకపోవటం చూసి గౌరికి ఏమిటన్నట్లు సంజ్ఞ చేసింది మంగళ. మురళిబాబు ముఖంలోకి సూటిగా చూసింది గౌరి. అతని రెండు కళ్ళు ఆమె చేతిలోని పళ్ళెం మీదే వున్నాయని గ్రహించడానికట్టేసేపు పట్టలేదు.

"ఓ ఇదుగో! ఇది సర్వమంగళాదేవి ప్రసాదం" కొబ్బరి చెక్క చీడీ మెట్టుకేసి కొట్టబోతూంటే "అహఁహఁ ఆగాగు" అన్నాడు మురళిబాబు. ఇద్దరూ ఆశ్చర్యంగా అతనికేసి చూసేరు

"గౌరీ—ఎన్నాళ్ళనుంచో ఒక కోరిక వుండిపోయింది తీర్చగలవా?"

"ఏమిటది?"

"తీరుస్తావా?"

"నావల్లనయేదేదైనా సరే తప్పక చేస్తాను మురళీ-కాని, నీ కోరిక తీర్చేంత సామర్థ్యం నాకుందా అనే ఆలోచిస్తున్నాను."

"ఓ తప్పకుండా తీర్చగలవు కాని, తీరా చెప్తే మీ అక్క చెల్లెళ్ళిద్దరూ కలిసి నవ్వుతారేమోనని భయం."

"నవ్వంగాక నవ్వమని గౌరి తరఫున కూడా హామీ ఇస్తున్నాన్నేను. చెప్పెయ్ మురళీబాబూ!" అంది మంగళ చనువుగా.

"చెప్పనా అయితే! ఎన్ని సంవత్సరాలనుండో నీ చేత్తో కొబ్బరుండలు చేసి పెడితే తినాలనుంది గౌరీ!" గౌరి ఏమంటుందోనని, ముఖం దించుకున్నాడు మురళిబాబు.

గౌరి పక పకా నవ్వడం ప్రారంభించింది.

"అయ్యో రామా-ఇంతేనా? హడలగొట్టావు లెద్దు. అయితే మొత్తానికెన్ని దేశాలు తిరిగొచ్చినా, ఎన్ని రకరకాల రుచులు తిన్నా, నీ పాత అలవాట్లు ఇంకా పోలేదన్నమాట."

మంగళ గంభీరంగా చూస్తూ గౌరి

భుజం మీద చరిచింది

"ఏమైంద"ని తృళ్ళిపడింది గౌరి. "నవ్వంగాక నవ్వమని నేను మాటిస్తే, నువ్వు నా ప్రతిజ్ఞ భంగం చేస్తున్నావు" అంది మరింత సీరియస్‌గా. ఆ మాటకి గౌరి, మురళీబాబు కూడా మరింతగా నవ్వుతూంటే, వాళ్ళతోపాటు తనూ నవ్వుకుంటూ, లేడిపిల్లలా ఛంగున వీధిలోకి పరుగు తీసింది మంగళ

కొబ్బరుండలుచేసి తెస్తానని లోనికి వెళ్ళింది గౌరి. వాకిట్లో వున్న మంచం మీద ఓ ప్రక్క కన్నగాడిని కూర్చోపెట్టుకుని, తనూ కూచుని, వాడితో సమానంగా కబుర్లు చెప్పడం ప్రారంభించాడు మురళీ.

ఆదేసమయంలో నలుగురిని వెంటేసుకుని, రంగనాధం ఆ తోవంటే వెళ్లాడని వాళ్ళెవరూ గమనించలేదు

* * *

గుమ్మంలో అడుగు పెట్టిన మంగళను చూస్తూనే, ఎదురుగా పరుగెత్తుకు వెళ్ళి కౌగలించుకొని, వుక్కిరి బిక్కిరి చేసేసింది కృష్ణవేణి.

"అబ్బబ్బ-వదులూ మరీ అలా ఎముకలు విరిచి పోగెడితే ఎలా? నీ సంతోషమంతా నా కర్ధమయిందిలే. ఆ ముసలి పీనుగ యింట్లోంచి దయచేసి ఉంటుందంతేనా? సంతోష మొచ్చినా, దుఃఖ మొచ్చినా పెద్ద చిక్కేలా వుంది నీతో!" అంటూ విడిపించుకుంది మంగళ.

"అవును మంగళా! ఆ ముసలి దెయ్యం పీడ వదిలింది. నీ ధర్మమానని నేనిప్పుడు హాయిగా వున్నాను. అంతే కాదు—మరొక శుభవార్త! గోవిందు



నెల్లాళ్ళలో వస్తున్నానని వుత్తరం రాసాడీవాళే!" సిగ్గుతో కృష్ణ ముఖం ఎరుపెక్కింది.

"అది గదీ సంగతి! ఆ కబురు తెలిసిన దగ్గర్నుంచీ, ఎవరు గుమ్మంలో అడుగు పెట్టినా, గోవిందేననుకుని వాటేసుకుంటున్నావన్న మాట!" వెక్కిరించింది మంగళ.

"ఛీ పో సిగ్గులేదు" గసుస్తూ మంగళ నొక్క తోపు తోసింది.

"ఉత్తరం సంగతి మీ అమ్మవరకూ రాలేదు కద!"

"లేదు—అదీ అదృష్టమే. లేకుంటే చచ్చూరుకునేదాన్ని. అందుకే వుత్తరాలు రాయొద్దని చెప్పేను గోవిందుకి. వస్తున్న సంతోషంలో ఆ మాట మరచిపోయినట్టున్నాడు!" గోవిందు మీద కాస్త కోపం నటించబోయింది కృష్ణవేణి.

"కృష్ణా! ఈవాళెందుకో నాకు చాలా



ఆనందంగా వుంది. నాకే నీపాటి ప్రజ్ఞవుంటే అలసి సొమ్మసిల్లే వరకు, ఆడి పాడాలనుంది నువ్వేనా ఓ చక్కని పాటపాడుతూ, నాట్యం చేదూ!" అంది మంగళ మువ్వలు తెచ్చి తానే కృష్ణ కాలికి తొడుగుతూ.

"విటుల బాధ తప్పినా నీ పోరు తప్పే టట్లు లేదే నాకు" అంటూనే రెండో కాలికి మువ్వలు తానే ధరించింది కృష్ణ.

అసలు సంగతేమిటో తెలియని మాణిక్యం చెప్పనక్కర్లేకుండానే, కూతురు ఆటపాటల్లో లీనమవుతూందను కుని సంతోషిస్తూ, మరింత బలంగా బుగ్గనున్న కారాకిళ్ళీ నములుకుంటూ తబలా ముందు కూర్చుంది.

గోపికా విరహగీతం ఎత్తుకుంది కృష్ణవేణి. అంతవరకూ ఆమె మనసే నాట్యం చేస్తూంది. ఇప్పుడు మనసు, శరీరం, ఏకమై వర్తించసాగేయి. నెల్లాళ్ళలో తన సమక్షంలో నిలవబోతూన్న గోవిందుని కృష్ణుడిగా చిత్రించుకుని, విరహోన్నతి సహజంగా అభినయిస్తూంది. ఎక్కడికి వెళ్ళాడో, ఏమయ్యాడో ఎప్పు డొస్తాడో తెలియని రాజుని తలచుకొని, క్రుంగిపోయింది మంగళ హృదయం.

"ఏం, ముఖం అలా పెట్టేశావ్? అడిగినప్పటి ఉత్సాహమంతా ఏమైంది? నాపాట, నాట్యం నీకు నచ్చలేదా?" గోముగా అడుగుతూంది కృష్ణ. తెప్ప రిల్లి చూసింది మంగళ. పాటెప్పుడో ముగిసిపోయిందని, మాణిక్యం కూడా వెళ్ళిపోయిందని తెలిసి, తనకు తెలియ నందుకు ఆశ్చర్యపోయింది.

"ఛ ఛ! అదేం కాదు కృష్ణా!" తనను తనే సంబాళించుకుంది.

"ఏమో, నువ్వు చాలా మారిపోయా వింతట్లోనే. రాజు జ్ఞాపకం వచ్చాడు కదూ?"

మనసులో సంగతి కృష్ణవేణి కని పెట్టేయడం మంగళకి బొత్తిగా నచ్చ లేదు. "రాక రాక ఆ మహానుభావుడే గుర్తుకు రావాలీ?" అంది బింకంగా.

"ఏం? రాజుకాక ఇంకెవరుంటారు నీ మనసులో?" కవ్వించింది కృష్ణమరింతగా.

"నేను రాజు మనసులో వుంటేగా? రాజు నా మనసులో ఉండటానికి నేనెంత మొండి ఘటాన్నో నీకు తెలుసు. నన్ను ఖాతరు చెయ్యని వాళ్ళని, పిసరంత నేను కూడా ఖాతరు చెయ్యను కాని, ఇక్కడికీ సొద కట్టిపెట్టు. మరి నువ్వు ఒక శుభ వార్త నాకు చెప్పేవు కదా, నే చెప్పింది వినవా?" అని మాట మార్చింది.

"ఏమిటదీ?"

"ఈ మధ్య మా కన్నగాడికి చచ్చి నంత జబ్బు చేసేసింది" మొదలు పెట్టబోతుంటేనే, కృష్ణ అడ్డు తగిలింది.

"మీ గౌరమ్మ స్నేహితు డెవరో పెద్ద డాక్టరుబాబు, అదనుచూసుకుని ప్రవేశించి, మద్రాడికి జబ్బు నయం చెయ్యడం పేరుతో, ఇంట్లో తిష్టవేసాడంతేనా?" పూర్తిచేసింది కృష్ణ.

"కృష్ణా!" గట్టిగా అరిచి, లేచి నిల బడింది మంగళ. "ఈ మాట నువ్వుకాక ఇంకెవరేనా అని ఉంటే, నాలిక చీరేసే



తియ్యగా ఉంది మరి?" అని కొంటెగా నవ్వడం ప్రారంభించాడు. గౌరి సిగ్గుపడితే ఎంత అందంగా ఉంటుందో, ఆ రోజే మొదటిసారిగా తెలిసింది మురళిబాబుకి. "నిజమే గౌరీ! నువ్వు చెప్పినట్టు ఇది రోగలక్షణమే! నువ్వు తప్ప, దీనికే డాక్టర్లూ ఏమీ చెయ్యలేరు- నాన్నగారితో చెప్పలేను కాని, అమ్మతో చెప్పి, చెప్పించేస్తాను- చదువు పూర్తయేవరకు పెళ్ళి చెయ్యమంటే, నా కసలు ఈ చదువబ్బుతుందో, అబ్బదోనని భయంగా ఉంది!" అన్నాడు. గౌరి తుర్రున బయటకు పారిపోయింది.

తరువాత మురళిబాబు ఆలోచించలేకపోతున్నాడు. అనుకున్నదొకటి- అయినది మరొకటి. ఆ జ్ఞాపకాలు మాత్రం, ఈనాడిద్దరికీ కూడా సంతోషదాయకంగా లేవు.

కన్న, కొబ్బరుండలు తింటానని పేచీ పెడుతూంటే నచ్చజెప్తూ సముదాయిస్తూ లోపలికి తీసుకుపోయింది వాడిని, మంగళ. గౌరి నెమ్మదిగా మెట్లమీద చతికిలబడింది. మురళిబాబు పళ్ళెం దూరంగా నెట్టేడు.

"అదేం? కోరి చేయించుకొని వదిలేసావేం?"

"అదే జీవితంలో విచిత్రం గౌరీ! మనం కోరినవి, ఆశపడినవి జరిగేవరకూ నమ్మకం లేదు., మాయలోపడి అంతా 'నాది, నాది' అనుకుంటూ ఆకాశానికెగిరి అధఃపాతాళానికి కుంగుతూంటాం. ఏమో, తినాలన్న సరదా నాలో చచ్చిపోయింది, తీసెయ్- మరి తినలేను."

"నీ వేదాంత ధోరణి నాకేం నచ్చడం లేదు మురళీ!"

"అయితే ఏం చెయ్యమంటావో చెప్పు."

"చెప్పినట్టు చేస్తావా?"

"నువ్వు చెప్పినదెప్పుడూ కాదన్న గుర్తులేదు నాకు!"



"అయితే విను - ఏ మహా యోగులకో, మునీశ్వరులకో తప్ప, సామాన్య మానవులకి వంటరితనం వంటికంత మంచిదికాదు మురళీ-" మాట పూర్తి కాకుండానే లేచి నిల్చున్నాడు మురళిబాబు.

"ఎందుకు గౌరీ నన్నిలాంటిమాటలతో చిత్రహింస పెడతావ్? నీ కొడుక్కి వైద్యం చేసినందుకు నువ్విచ్చే 'ఫీజు' ఇదేనా?" ఆ మాటకు గౌరి దెబ్బతిన్నట్టుగా చూసింది

"నిన్ను చిత్రహింస పెడుతున్నానా? పొరపాటు మురళీ! నువ్వు వాడికి ప్రాణదానం చేసినందుకు నీకు ప్రత్యుపకారం చెయ్యలేక పోగా, బాధ పెడతానా? నీ మేలుకోరే చెప్తున్నాను. నువ్వు తరచూ ఈ పేదకొంపకి రావడం నీ భవిష్యత్తుకట్టే మంచిది కాదేమో!"

మురళిబాబు గౌరికేసి తదేకంగా చూసేడు. "చూడు గౌరీ, నాకు చెప్పుకో దగ్గ దగ్గర బంధువులు, ఆత్మీయులు ఎవరూ లేరని నీకు తెలుసు. ఎండిన బీడులాంటి నా మనసుకి నాలుగు వర్షపు చినుకుల్లాంటి నీ మాటలు కాస్త శాంతి కలిగిస్తాయేమోనని వస్తున్నాను.ఇక నా భవిష్యత్తు గురించా? నువ్వేం బెంగపడకు- భవిష్యత్తుని గురించి ఎన్నడూ తలవనేనా కూడదని నేనప్పుడే ఒక గుణపారం నేర్చుకున్నాను కర్మ, ప్రారబ్ధం-అంటారే అదే నిజం. జరగవలసినట్టే జరుగుతుంది, దానికోసం ఎందుకు భయం?" వేదాంతిలా నవ్వుతూ అన్నాడు.

"నీ మనసు నాకు తెలుసు మురళీ. కాని లోకానికి తెలియదు కదా! మనం సంఘ జీవులం- చుట్టూ ఉన్న సమాజాన్ని వ్యతిరేకించి శాంతిగా బ్రతకగలగడం కష్టం."

"చక్కగా చెప్పేవు గౌరీ, శాంతిగా బ్రతకడమని. నా సమాధానం కూడా విను. నువ్వు చెప్పిన ఈ సమాజానికి ఒకప్పుడు నేను 'జోహార్' అంటూనే బతికాను. కాని నా కప్పుడూ శాంతి లభించలేదు ఇక మిగిలిన దొక్కటే వ్యతిరేకించటం శాంతిని పొందటం కోసం ఇలా చేస్తున్నానో, నా కష తీర్చుకుంటున్నానో నాకే తెలియటం లేదు__ ఇంకేం చేస్తానో కూడా చెప్పలేను" మురళి సమాధానం విని ఏమనాలో తెలియక, మూగ బొమ్మలా చూస్తూ ఊరుకుంది గౌరి

అప్పటికి బాగా చీకటయి పోయింది. లాంతరు తెచ్చి చీడీలో దూలం కొక్కేనికి తగిల్చింది మంగళ. ఆకాశం ఫెళ ఫెళ మంది.

"వర్షం వచ్చేస్తూంది వెళ్ళొస్తాను గౌరీ వెళ్తున్నా మంగళా, కన్న పడుకున్నాడు కాబోలు-వాడికి రేపు పథ్యం పెట్టండి-వస్తా" అంటూ గుమ్మం దిగి పోయాడు, గౌరి ముభావంగా కొబ్బరి వుండల ప్లేటుకేసి చూసి, ఉరుముతూన్న ఆకాశం కేసి ఒక మారు చూసి, లేచి లోపలికి వెళ్ళిపోయింది.

మంగళ శిలావిగ్రహంలా పంచ ఒడ్డునే నిలబడింది వర్షం ఎప్పుడు మొదలయిందో తెలియనేలేదు పంచనుండి ధారలు కారి పరికిణీ కుచ్చెళ్ళు తడిసి



సంపూర్ణ రామాయణం ద్వారా శోభన్ బాబునూ చంద్రకళనూ సీతారాములుగా ప్రేక్షకులకు చూపించిన బాపు తమ దర్శకత్వంలో తయారవుతున్న మరో మంచి పౌరాణికం 'సీతాకల్యాణం' ద్వారా ప్రేక్షకులకు చూపించబోతున్న రాముడు (రవి), సీత (జయప్రద).

పోతూంటే అప్పటికి తెలివొచ్చి, తనూ విధి లేనట్టుగా లోనికి దారి తీసింది

12

"మంగళా! లే లే ఏమిటా నిద్ర- ఎంత పొద్దెక్కిందో చూడు-చౌదరిగారి కళ్ళంలో నాలుగు వంగ పింజలు దొరుకుతాయేమో తెస్తావూ?" అంటూ కుదుపుతూంది గౌరి

"అబ్బా-అప్పుడే తెల్లారిపోయిందా?" బద్ధకంగా లేచి కళ్ళు విప్పి చూసింది ఎర్రగా ఎండ కాస్తూందప్పుడే. అప్పిగాడు పశువుల్ని తోలుకెళుతున్నాడు "అమ్మ బాబోయ్!" అంటూ ఒక్క గెంతు గెంతింది మంచం మీద నుంచి కిందికి.

"మంగమ్మా!" బయట నుంచి కేక వినిపించింది.

"అరె, కేశవులు తాతలా వున్నాడు" అనుకుంటూనే బయటికొచ్చి "ఏం తాతా? ఏంటిలా వచ్చావు? బావొచ్చారా లేదా?" చక చక అడిగేసింది.

"అయ్యో తల్లి, ఒట్టి మూడ్రోజులైతేనే, నీకింకా తెల్దన్నమాట ఉన్నపాటున నిన్ను రమ్మని సెప్పేరు బాబు- బేగిరావాల మరి" అన్నాడు

అలా ఉన్నపాటున ఎప్పుడు రమ్మన్నా హడలిచస్తుంది మంగళ. ఏం కొంప మునిగిందోనని- ఆ ఆరాటం తీర్చుకుందికే అడిగింది "ఇంతకీ మనలో మనమాట! తాతా, బాబు కోపంగా ఉన్నారా, మామూలుగానే ఉన్నారా?" మంగళ ముఖం చూస్తే తాతకి నవ్వొచ్చింది

"ఏటో తల్లీ, ఆరి తమ్ముడుగారు పోయారుగదా, ఆ దుక్కంలో కోపవేఁటి? సంతోసవేటి? ఏటీ తెలీడంలేదా ముకంలో, నిన్ను రమ్మని సెప్పేరంతే."

"సర్లే, ఐదునిముషాల్లో వస్తానని చెప్పు" అంటూ గూట్లోంచి పందొంపుల్ల తీసి పెరట్లో బావిదగ్గరకు పరుగెత్తింది మంగళ.

"మంగళా? తొందరగా రమ్మీ! వచ్చే



టప్పుడు వంగపింజల సంగతి మరిచిపోకు" అని చౌదరిగారింటికి ప్రయాణమవుతూన్న మంగళను హెచ్చరించింది గౌరి

దారిపొడుగునా చౌదరి పిలుపుకి రకరకాల కారణాలు ఊహించింది మంగళ.ఒక్కటీ మనసుకి నచ్చలేదు. చివరికి కృష్ణవేణి చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. 'ఆఁ. అంతే. గోవిందు వస్తున్నట్టు ఉత్తరం వచ్చిఉంటుంది నిన్ననే వచ్చింది కాబోలు తెల్లారేసరికల్లా నాకు చెప్పలేక పోతే ఉండలేరు మరి' అని సమాధాన పడింది

చౌదరి అప్పుడే ఫలహారం ముగించి, మూతి తుడుచుకుంటూ భోజనాల బల్ల దగ్గర్నుంచి లేవాడు కావాలని మువ్వల పట్టీలు 'గిల్ గిల్' మనిపించింది మంగళ

"ఏమే మహా తల్లీ! ఎక్కడా అయిపు లేకుండా పోయావ్!" అని పలకరించి "ఒరే, పాపయ్యా- మంగళక్కూడా టిఫిన్ తీసుకురా!" అని పురమాయించాడు చౌదరి. అప్పటితో, మంగళకి మనసు కాస్త తేలికయింది 'ఫరవాలేద'ని ధైర్యమొచ్చింది.


"వొద్దొద్దు. ఇప్పుడు తినేంత తీరిక లేదు నాకు. మా గౌరి వంగ పింజలు తెమ్మంది తొందరగా వెళ్ళాలి"

"వంగ పింజలకేం తొందరొచ్చింది కాని కూచో ఇలా, చాలా రోజులాయె ఊళ్ళో లేనుగా! ఏమిటి సంగతులు, సందర్భాలు చెప్పు."

ఇడ్లీల ప్లేటు ముందుకొచ్చింది. వొరికిందే సమయమన్నట్టు ఏకబిగిని చెప్పడం ప్రారంభించింది మంగళ. అతను ఊరు వదలిన మరుక్షణంనుంచీ జరిగిన సంగతులన్నీ—

"కన్నగాడికెంత జబ్బు చేసేసిందనీ- అసలువచ్చి పోతాడనే అనుకున్నాం- నేను వట్టి నష్టజాతకురాలినట- నే నడుగుపెట్టిన చోటల్లా ఏదో నాశనవేఁ అవుతుందట- నా నుంచే మా రామం బావ చచ్చిపోయాట్ట నానుంచే రాజు దేశాంతరాలు పోయాట్ట- వీడూ గుటుక్కుమంటాడని ఏం గోల- ఏం గోల- అబ్బబ్బబ్బ ఏంచెప్పను- ఆ దొంగసచ్చిన ముసలి నక్కగాడు వేసిన కుతంత్రమంతా పూర్తిగా వింటే మీరింకా తెల్లబోతారు. సర్లెండి ఆ సంగతంతా తరువాత చెప్తానుకానీ, కన్నగాడి గురించి కదూ ఇప్పుడు చెప్తూంట. చెప్తే మీరు దెబ్బలాడతారని భయంకానీ, మీక్కాక ఇంకెవరికి చెప్తాను? సమయానికి మీరు లేకపోయారు. మేం చాలా అవస్థపడి పోయాం- ఓ పక్క చస్తాడో, బతుకుతాడో తెలియకుండా వాడు అలాంటప్పుడు ఆ మురళిబాబే రాకపోతే, వాడూ, వాడితో బాటూ గౌరీ, నేనూ ఈపాటికి చచ్చి ఉండేవాళ్ళం" మంగళ ఇంకా గుక్క విడవకుండా ఏదో చెప్పబోతూంది.

"ఆఁ. ఆగాగక్కడ" రక్కున అడ్డొచ్చాడు చౌదరి "నిన్నిప్పుడు పిలిపించిందెందుకో అర్థమైందా?" నోట్లో పెట్టుకోబోతూన్న ఇడ్లీ ముక్కని చేత్తో అలాగే పట్టుకుని, ఏదో కొంచెం అర్థమైనట్టైనా.



ఎంచేతో కొనస్టు తలూపింది

"ఎవరే ఆ మురళిబాబు?"

ఇప్పుడు మరికొంచెం అర్థమైంది "డా డా డాక్టరుబాబు!"

"అంతేనా?"

"గౌరి స్నేహితుడు గౌరి ఇంత పిల్లప్పటినుండీ పక్కపక్కల ఉండే వాడట"

"అంతేనా?"

'ఛ ఏమిటీ ప్రశ్న?' 'అంతేనా' 'అంతేనా' అనుకుంటూ!' అయినా సమాధానం చెప్పక తప్పదు. "పాపం, చాలా మంచివాడు అతని మనసెంత మంచిదో, హస్తవాసి కూడా అంత మంచిది!

"చాల్లే. కవిత్వం కట్టిపెట్టి ముందీ సంగతి చెప్పు. పరువుగా, మర్యాదగా ఈ ఊళ్ళో బ్రతకాలనుందా? లేదా?"

ఇప్పటికి పూర్తిగా బోధపడింది మంగళకి. "ఏమిటి మీరనేది?" అంటూ బల్ల దగ్గర్నుంచి లేచింది.

"ఇంకెలా చెప్పాలి? ఎంత డాక్టరయితే మాత్రం పరాయి మగాడికంత చనువిచ్చి రాత్రనక, పగలనక ఇంట్లో పెట్టుకుంటే లోకమేమంటుంది?"

"పరాయి మగాడేం కాదు- గౌరికి చిన్నప్పటి స్నేహితుడని చెప్పలా?" రోషంగా అంది మంగళ.

"ఇది పల్లెటూరని మరచిపోకే పిచ్చి మొఖమా! ఎన్నడూ పట్నం ముఖం చూడకపోయినా పట్నపువాళ్ళని మించిన కబుర్లు చెప్పడం మాత్రం వచ్చింది నీకు. అందుకే చెప్తున్నాను. నాకన్ని సంగతులూ తెలిసాయి ఆ కుర్రడాక్ట రెంత మంచి వాడయినా సరే, ఆమడ దూరంలో ఉంచడం మంచిదని గౌరితో చెప్పు. తరువాత ఎటుంచెటొచ్చినా నేనేం చెయ్యలేను" ఖచ్చితంగా అన్నాడు చౌదరి.

ఇప్పటితో మంగళ పూర్తిగా డీలా



పడిపోయింది. "ఎవరో తెలిసీ తెలియని వాళ్ళు, కిట్టనివాళ్ళు- ఏదో అన్నారనే సరిపెట్టుకున్నా నింత వరకూ - ఊరికి పెద్దగా, నలుగురికి చెప్పగల శక్తి ఉన్నా మీరూ అదేమాట అంటున్నారా?" అంది బిక్కముఖంపెట్టి

"నువ్వట్టి పిచ్చిదానివే మంగళా! ఈ పాపంలో ఎంచేతో నువ్వొక్కత్తెవీ కొండంత ఎత్తు ఎదిగి కూచున్నావు నీతో పాటు అందరూ ఎదిగిపోవాలని ఉబలాట పడతావు 'పదుగురాడు మాట పాటియై ధరజెల్లు' అన్నారు. ఊరంతా ఒకటైతే, నా ఒక్కడిమాట వినేదెవడు చెప్పు? అయినా మీ రంగనాథం మామ తలెత్తేక, నేసీ పెద్దరికాలన్నీ ఎప్పుడో వదులుకున్నాను. నేనసలు దేనితోనూ జోక్యం పెట్టుకోడం లేదు. ఎవరితోనూ పేచీలు పడటం నా కిష్టంలేదు ఇప్పుడు ఊరంతా రంగనాథం అడుగులకి మడుగులొత్తుతున్నారు అతగాడు నందంటే 'నంది', పందంటే 'పంది' అంటారిప్పుడు. అతని జాతకం అలా పరుగెడుతూందిప్పుడు. ఏం చేస్తాం? అయినా నాకేదో ఆ మాత్రం పెద్దరికం ఇచ్చినట్టు నటిస్తూ నలుగుర్నీ వెంటేసుకొచ్చి ఇదంతా సొదలా చెప్పుకొచ్చాడు కనక మనం మన జాగ్రత్తమీద ఉండాలి"

"కాని, ఆ నీచుడి సంగతి మీకింకా తెలియదు" మధ్యలో అడ్డొచ్చిన మంగళను వారించాడు చౌదరి.

"నాకు తెలియక కాదే వెర్రిపిల్లా! నీచుల సంగతి వినేదేముంది? వాళ్ళ ప్రభావం పరుగెత్తినన్నాళ్ళూ వాళ్ళనెవరూ ఆపలేరు గౌరి ఎలాంటి పిల్లో నాకు తెలుసు ఆ పిల్లకు తగని కష్టం వచ్చినందుకే బాధపడుతున్నాను. గోరుచుట్టుమీద రోకటిపోటులా ఇంకేమి దెబ్బ తగుల్తుందోనన్న భయం ఎలాగో నువ్వే నచ్చజెప్పు. ఆ డాక్టర్నిమాత్రం ఇకపైని మీ ఇంటికి తరచుగా రానివ్వద్దు."

చేష్టలుడిగి, కొయ్యబొమ్మలా కాసేపు నిల్చుండిపోయింది మంగళ 'ఆ మాట మురళిబాబుకి గౌరి అప్పుడే చెప్పనే చెప్పింది అయితే అతనూ చెప్పవలసిన మాట చెప్పేడు. వాళ్ళిద్దరి గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుకుందికి వీళ్ళందరికీ ఏమి హక్కుంది? రంగనాథం లాంటి తోడేళ్ళకి, గొర్రెల మందలాంటి ఈ మూర్ఖపు ప్రజలకి బుద్ధొచ్చేదెప్పుడు?' లోలోపలే ఆక్రోశిస్తుంది మంగళ.

"ఏమి? చెప్పిన సంగతి అర్థమైందా?"

"అర్థమైంది కాని, ఏరుదాటగానే తెప్ప తగలేసినట్టు అతన్ని రావద్దు పొమ్మని ఎలా చెప్పడం? ఏమో బాబూ నావల్లకాదు."

చౌదరి మనసులో కూడా ఏదో సంఘర్షణ జరుగుతూందని అతని ముఖమే చెప్తూంది కాని, అతని నోటంట వచ్చిన మాట అలా అనుకుందుకాస్కారమివ్వ లేదు

"అయితే అనుభవిస్తారు."

"దేవుడు లేడేమిటి? మంచివాళ్ళకెప్పుడూ కీడు జరగదు" బింకసరిగా అంది.


"హుఁ, మొన్న మొన్న నా కళ్ళ

ముందు పుట్టి, నాకే చెప్తున్నావే నువ్వు' వెళ్ళిరా।" అదోలా చూస్తూ లోపలికి వెళ్ళి పోయాడు చౌదరి.

మంగళ కొక్కసారి భయం వేసింది. జరిగిన గొడవంతా చెప్పుకుని కాస్త ఊరట పొంది, ధైర్యం తెచ్చుకుందా మనుకుంటే ఆ ఆశ కాస్తా హరించుకు పోయింది మీదుమిక్కిలి అతని ధోరణి మరింత క్రుంగదీసింది పశుబలానికీ, పదవులకీ అర్థం పర్థంలేని దాస్యం చెయ్య కూడదని, ఈ మనుషుల కెప్పటికి తెలుస్తుందో అనుకుంటూ, నడక సాగించింది

ఇంటి కెళ్ళగానే గౌరి ఎందుకు పిలిచారని అడిగితే ఏం చెప్పాలి? చెరువుగట్టున కూచుని ఆలోచించుకోసాగింది 'ఈ మాట అసలెలా చెప్పడం గౌరితో, ఊరు ఊరంతా పనీ పాటా మానుకుని ఈ విషయమే చర్చిస్తున్నారట. తగుదునమ్మా, అని ఈ బోడి వెధవలందరికీ నాయకత్వం వహించి 'వృద్ధనారీ పతివ్రత' అన్నట్టు కబుర్లు చెప్తున్నాట్ట రంగనాథం. ఉరేసుకు చావమను. ఎంచేస్తాడో చూస్తాను।" అనుకుంది

ఆ వెంటనే కృష్ణవేణి అన్నమాటలు కూడా జ్ఞాపకం వచ్చేయి ఎన్ని ధైర్య సాహసాలున్నా, ఎన్ని తెలివితేటలున్నా నువ్వూ ఆడదానివే నన్న సంగతి మరచిపోకంది. ఒక్కసారి, కూడగట్టుకున్న బలమంతా ఎవరో చేతితో పీకి పారేసినట్టయింది. లోపలికి వెళ్తూ వెళ్తూ చౌదరి చూసిన చూపు జ్ఞాపకానికొచ్చింది. ఏడుపొచ్చినంత పనయింది మంగళకి ఏమి ఉపద్రవం ముంచుకొస్తుందో ఇంకా ఆ రోజు 'అయ్యో' అనే ఒక్క వ్యక్తి



కూడా ఉండదే' చెప్పినందువలన వెలరేగే తుపాను నెదుర్కోవటమా, చెప్పక పోవడం వలన కలిగే అనర్థాన్నెదుర్కోవటమా, ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా ఉంది మంగళ పరిస్థితి

తీరా ఇల్లు చేరుకుని గౌరి ముఖం చూస్తేగాని వంకాయల సంగతి గుర్తుకి రాలేదు. "పోన్లే - బీరకాయ వేపుడుతో వాడికి పథ్యం పెట్టేశాను. కాని రెండు ఝాములయింది. భోజనానికి రా." అంది గౌరి, భోజనానికి కూచోబోతూ, చౌదరిగారెందుకు పిలిచారనికూడా అడిగింది.

"వచ్చి మూడు రోజులయినా కనపడలేదని పిలిపించారంటే' ఆయనకు నేనంటే వల్లమాలిన అభిమానం" అందే కాని మిగిలిన మాటలు పెదవులు దాటి రాలేదు. ఆ వేళప్పుడా మాటలు చెప్పి తినే తిండి చెడగొట్టటాని కామె మనసంగీకరించలేదు.

* * *

మూడు రోజులు గడిచాయి. మంగళ



ఇల్లు దాటి ఎటు వెళితే ఎలాంటి మాటలు విన వలసి వస్తుందోనన్నట్లు గడపదాటడం మానేసింది. ఊళ్ళో పుట్టిన పుకారు గురించి గౌరితో చెప్పనూ లేకపోతూంది. ఆ రోజు శుక్రవారం, ఆ మధ్యలో మురళి రావటమే లేదు

మంగళ, గౌరి కన్నని తీసుకుని గుడికి బయల్దేరుతున్నారు. లోగుమ్మానికి తాళం వేసి మెట్లు దిగబోతూంటే మురళి ఎదు రొచ్చాడు. ఒకందుకు గౌరి, ఒకందుకు మంగళ, అతనికి సంతోషంగా స్వాగతం చెప్పలేకపోయారు, కాని అతనెందుకో చాలా ఆనందంగా ఉన్నట్టున్నాడు.

"అబ్బో! మొత్తం ఇల్లు ఇల్లంతా ఎటో కదిలి వెళిపోతూందే! మరేం, వీడు కూడా బయల్దేరేశాడు!" అంటూ ఓ పెద్ద పొట్లం కన్న చేతిలో పెట్టేడు మురళి బాబు.

"ఇదేమిటి?" అంది ఆశ్చర్యంగా గౌరి.

"మిఠాయిలు"

"ఇప్పుడెందుకు?"

"ఎందుకేమిటి? తినడానికి!" నవ్వేడు మురళిబాబు

"అవున్లేకాని, అంత ప్రత్యేకించి తీపి పంచి పెడుతున్నావంటే ఏదైనా విశేష ముండాలని-" కాస్త ఆగింది ఆలోచిస్తూ.

"ఉందనే అనుకో!"

"తొందరగా చెప్పయితే మరి!"

"ఊహు—నువ్వే పోల్చుకోవాలి!"

"నేను పోల్చుకొనేసరికి, నా జీవితమే అయిపోతుంది కాని, నువ్విలా కూర్చో. మే మిప్పుడే గుడికి వెళ్ళొస్తాం - పద మంగళా!" అంది గౌరి - మంగళ మౌనంగా చూస్తూ నిల్చుంది.

"ఏ గుడికి?" మురళి బాబు అడిగాడు.

"సర్వమంగళాదేవి గుడికి. వీడికి బాగ యితే గుడికి తీసుకొస్తానన్నాను. చాలా మహిమగల తల్లి ఆవిడ."

"ఓహో అంటే మొక్కుకున్నావన్న మాట! ఆఁ గౌరీ! మొక్కుబడి అంటే జ్ఞాపకం వచ్చింది. నాకు జబ్బు చేసినప్పుడు నువ్వు మొక్కిన మొక్కు గుర్తుందా?" చిన్న కుర్రాడిలా తల తడుముకుంటూ అన్నాడు మురళిబాబు గౌరి విమూఢురాలిలా చూసిందతనికేసి


ఒకప్పుడు మురళిబాబుకి చాలా జబ్బు చేసింది అతని తల్లి, గౌరికూడా అప్పుడు చాలా భయపడ్డారు, ఏమవుతాడోనని. మొత్తానికెలాగో మురళిబాబు తేరుకుని మళ్ళీ లేచాడు. ఒకనాడు ప్రొఫెసరుగారింట్లో లేని సమయం చూసుకుని గౌరి పిల్లిలా చడిచెయ్యకుండా మురళి గదిలో ప్రవేశించి "ఓ మాట చెప్తాను. కోప్పడవుకదా?" అంది. "ఊఁహుఁ" అన్నాడు మురళి పుస్తకం పక్కకు నెట్టి.

"నువ్వు పెద్ద గండం గడచి బయట పడ్డావు కదా ఎవరివలనో తెలుసా?"

"ఊఁ. తెలుసు. ఈ దేవత పరిచర్యలు చెయ్యడంవల్ల!"

"తప్పు, తప్పు. అపచారం. లెంప లేసుకో ముందు. నువ్వు వెంకటేశ్వర స్వామి కృపవలన బ్రతికావు తెలుసా?" అంది రహస్యంలాగ.

"అదికూడా కావచ్చు!"



"మరయితే స్వామికి మొక్కుబడి తీర్చవద్దా?"

"ఓహో. అదొకటా, తీర్చేయ్!" చిలిపిగా నవ్వేడు

"మధ్య నేను తీర్చేద మేమిటి? నువ్వే తీర్చాలి." తన భయం పైకి కన్పించకుండా చెప్పింది.

"ఏం చెయ్యమంటావో చెప్పయితే."

"మరే మరే స్వామికి నీ తల నీలాలు "

మాట పూర్తి కాకుండానే కెవ్వన కేకేసి కుర్చీలోంచి ఎగిరినంత పనిచేశాడు మురళిబాబు. "అన్యాయం. అక్రమం, దారుణం. ఇంత ముచ్చటగా, అపురూపంగా చూసుకుంటూన్న జుట్టుని నే నివ్వనుగాక ఇవ్వను. ఏ పాపం వస్తే అది రానీ."అని చిందులెయ్యటంమొదలెట్టేడు

ఆ కేకలు విని మురళిబాబు తల్లి పరుగెత్తుకు వచ్చింది నసుగుతూనే తన మొక్కుబడి ఆవిడతో మెల్లగా చెప్పింది గౌరి ఆవిడ సంబరంగా నవ్వేసి "ఈ మాత్రానికే అంతగా అడుస్తావెందుకురా బాబూ. జుట్టు మళ్ళీ రాకపోతుందా ఏం? మొక్కుబడి తీర్చవలసిందే." నని గౌరికి వంతపాడింది.

"ఇంతకీ నా జుట్టుమీద తనకేం హక్కుంది, నన్నడగకుండా ఎవడు మొక్కమన్నాడు?" అని పేచీకి దిగేడు మురళిబాబు.

"జుట్టుమీదే ఏం ఖర్మరా? నీమీద సర్వ హక్కులూ ఉన్నాయి దానికి పిచ్చి పిచ్చి వేషాలెయ్యక బుద్ధిగా తిరపతి, పోయి మొక్కు తీర్చుకురా." అని గదిమిందావిడ.

వారం రోజులనాడు మురళిబాబు తిరుపతి నుండి తిరిగొచ్చేడు. గుండు చూసి నవ్వాపుకోలేకపోయిన గౌరిని ఉక్రోషంగా చూస్తూ జడ పట్టి లాగితే రివ్వున వాలి



ఒళ్ళో పడింది. మురళీ బాబు తల్లి ఆ దృశ్యం చూసీ చూడనట్టుగా కదిలి పోయిందక్కడి నుండి. సిగ్గుతో జేవురించిన ముఖంతో లేచి దూరంగా జరిగిన గౌరిని, ఉక్రోషమంతా మరచిపోయిన మురళీబాబు చిలిపి చేష్టలతో కవ్వించాడు

"గౌరీ! ఇక వెళ్దామా?" మంగళ గౌరి భుజంమీద చెయ్యి వేసింది ఒక్కసారి ఉలికిపడ్డట్లయి "ఊఁ" అంది గౌరి

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు నేను స్వీట్లు తేవడానికి కారణమేనా? అయ్యో గౌరీ! మరచేపోయావన్న మాట. ఈవాళ నా పుట్టిన రోజని." అన్నాడు మురళి.

"ఆఁ. అవును సుమా అవునవును. మరచే పోయాను." సర్దుకుంది గౌరి.

"పోన్లే కాని, మీరంతా దేవి దర్శనాని కెళ్తూంటే, నేనేం పాపం చేసాను? నేనూ వస్తాను పదండి" అని దారితీశాడు మురళి బాబు

గౌరికీ, మంగళకీ కూడా పైకి చెప్ప లేని భీతాహం కలుగుతూంది మనసుల్లో. మురళీబాబు మాత్రం ఏమీ పట్టించుకో కుండా కన్నగాడి నెత్తుకుని ముందు నడి చాడు

అమ్మవారి దర్శనం చేసుకుని, ఆలయ మంటపంమీద కూర్చున్నారు ముగ్గురూ. కాస్త దూరంలో ఉన్న పొన్నచెట్టు పరిమ ళాలు వెదజల్లుతూంది. కన్నకి ఆ పువ్వు లేరి దండకడితే సరదా. కన్నగాడి పేచీ పడలేక కన్నని తీసుకుని పొన్నచెట్టు కిందికి పోయి వాడి చేత పువ్వులేరించి దండ కడుతూంది మంగళ. మనసు మాత్రం ఇంకెక్కడో ఉంది

ఉన్నట్టుండి మురళీబాబు ఆశ్చర్యంగా గౌరి ముఖంలోకి చూసాడు అలా తదేకంగా చూస్తూనే ఉండిపోయాడు అది గ్రహించిన గౌరి "ఏమిటలా చూస్తావ్?" అంది ఎందుకో కోపమ్నుంచి భయం తన్నుకొస్తూంటే

"గౌరీ! నువ్వెప్పుడూ ఇలాగే ఎందుకుండ కూడదు?" అతని కంఠం కొద్దిగా జీరపోయింది

"ఏం? ఇప్పుడెలా ఉన్నాను?" మరింత కలవరపడింది గౌరి

"ఇప్పుడు నిజంగా 'మా గౌరి'లా కనిపిస్తున్నావు ఇన్నాళ్ళు బొట్టులేని నీ ముఖం చూస్తున్నప్పుడల్లా చెప్పలేని బాధ- ఏదో - ఏదో "

గౌరికి వాడి లెంపకాయ కొట్టినట్టయింది తను చేసిన పొరపాటేమిటో తెలిసి గజగజ వణికిపోయింది—'అలవాటు ప్రకారం అమ్మవారి కుంకం తీసి నొసటను దిద్దేసుకుందన్న మాట' అనుకోకుండానే ఆమెచేయి ఛర్రున నుదుటి మీదకు పోయింది

కాని, ఆచేయి నుదుటను చేరేలోగానే మురళీబాబు బలమైన చేతిలో ఇరుక్కుంది

"వద్దు గౌరీ! చెరపకు అది అమ్మవారి సింధూరం. శుభప్రదం - మంగళప్రదం" మురళీబాబు ఆవేశంగా అంటున్నాడు.

—(సశేషం)

★ పొంగు ★

"ఏమయ్యా, ఈ బస్సు యివాళ బయల్దేరదా" అడిగాడు లాల్చీ వేసుకున్నాయన తెలుగు పేపరులో నుంచి తల ఒకింత బయటకు పెట్టి.

"పదకొండింటికి వర్షం వస్తుంది. పది గంటలయినా బస్సు బయల్దేర లేదు. పదకొండింటి లోపల నలభై మైళ్ళు ఎలా ప్రయాణం చేస్తామబ్బా" అంటున్నాడు పెళ్ళి చూపులకు కొడుకుని తీసుకు వెడుతున్న తండ్రి.

అవతలి సీట్లో కూర్చున్న అందమైన అమ్మాయి నున్నటి భుజాలు చూస్తున్నాడు కాబోయే పెళ్ళి కొడుకు

"పోనీవయ్యా-బస్సుని త్వరగా. ఏమిటాలస్యం!" చేతిలో వున్న సెక్స్ పుస్తకాన్ని తెరుస్తూ అన్నాడు ముందు సీట్లో కూర్చున్న విద్యార్థి.

కండక్టర్ అన్నాడు నెమ్మదిగా "డిపో మేనేజర్ గారు వస్తానన్నారు సార్. ఆయన రాగానే బయల్దేరుదాం!"

"అదేమిటి - తొమ్మిదిన్నరకు బయల్దేరాల్సిన బస్సు పదయినా బయల్దేరదు. పైగా డిపో మానేజర్ రావాలంటావ్. ఆయన ఎప్పుడు వస్తాడో ఏమో" తెలుగు పేపరులో నుంచి బయటకు వచ్చిన తల అన్నది.

"వస్తారుసార్!" కండక్టర్ జవాబు.

"బస్సు ఆయన స్వంతంటయ్యా - అసలు ఆయనకోసం యింతమంది ప్రయాణీకులకు ఆలస్యం ఎందుకవాలి?" పెళ్ళికొడుకు తండ్రి అన్నాడు

"అవును మేమంతా ఎందుకు ఆగాలి. పోనీ!" అవతలి సీట్లోని అందమైన అమ్మాయి వంపులను చూస్తూనే ఉన్నాడు కాబోయే పెళ్ళికొడుకు.

"ఉష్ !" అంటూ ఒక వేడి నిట్టూర్పుని విసుగ్గా విదిలాడు ముందు సీట్లోని విద్యార్థి - వేడికథను చదువుతూ

యింకో పావుగంట గడిచింది.

"ఏం బాబూ-మనం యివాళ బయల్దేరలామా అసలు" చదివేసిన తెలుగు పేపరును మడిచేసి అన్నాడు లాల్చీ వేసుకున్న ఆయన

"ఇంటి దగ్గర బయల్దేరే ముందు పిల్లి ఎదురవగానే అనుకున్నాను ఇవాళ ఏదో అశుభం జరుగుతుంది అని వర్షం వచ్చిం తర్వాత పెళ్ళి చూపు లెలాగో అర్థం కావటం లేదు. పోనీ నాయనా కాలాతీతమవుతున్నది!" పెళ్ళికొడుకు తండ్రి.

"ఏమిటయ్యా మరీ యింత ఆలస్యమయితే ఎలా" అని అంటున్న కాబోయే పెళ్ళి కొడుకు, ఆ అందమైన అమ్మాయి పమిట సర్దుకోవటం చూసి, మాటలాపేసి అటే చూస్తున్నాడు.

మధ్య పేజీలో అర్ధ నగ్నంగా వున్న సినిమా తార బొమ్మ ప్రక్కనే ఆవిడ తన వివాహం గురించి యిచ్చిన పవిత్ర అభిప్రాయాన్ని చదువుతున్న విద్యార్థి. తల

సత్యం మందపాటి

ఎత్తి "పోనీవయ్యా!" అని అరిచాడు.

"అవును బస్సునిపోనీ-పోనీవయ్యా!" అందరూ అరుస్తున్నారు. ఆలస్యం భరించ లేక, ఎండకు పడుతున్న చమటకు తాళ లేక.

"ఎలా సార్! నాకు మాట వస్తుంది. ఆయన మా డిపో మానేజర్ గారు."

"అయితే జీప్‌లో పొమ్మనమను. అవేవీ లేకపోతే తర్వాత బస్సులో రమ్మను. అంతే కానీ మమ్మల్నందర్నీ ఆపితే ఎలా!" కోరస్‌గా అన్నారు బస్సు లోని జనం

కండక్టర్‌ని నానా మాటలూ అన్నారు.

అతనికి తప్పింది కాదు.

రెండుసార్లు గంట కొట్టాడు

ప్రక్కనే వున్న డ్రయివర్ వచ్చి ఇంజన్ స్టార్టు చేశాడు

బస్సు పెద్ద శబ్దం చేస్తున్నది.

కానీ కదలలేదు

అయిదు నిమిషాలయింది.

"పోనీవయ్యామళ్ళీ ఆగావేం!"నాలుగు కంఠాలు అన్నాయి ఒకేసారి

"ఆయన రావాలి సార్!" ఈసారి డ్రయివర్ అన్నాడు

"ఆయన ఎవరయ్యా మధ్యలో. నీకు ఆఫీసరయితే మాకేం కాదు మర్యాదగా బస్సుని కదుపు" అరిచాడు విద్యార్థి, చేతి లోని పుస్తకాన్ని ప్రక్కనపెట్టి

"కొంచెం ఆగండి సార్" కండక్టర్ అన్నాడు.

"ఏమిటి ఆగేది. అయిదు నిముషాల్లో బస్సు కదలకపోతే రిపోర్టు యిస్తాం" అన్నాడు తెలుగు పేపరు ఆయన.

కండక్టర్ చిన్నగా నవ్వాడు "రిపోర్టు డి.యం. గారికే యివ్వండి సార్!" అన్నాడు.

"ఏం నవ్వులాటగా వుందా. అయిదు నిముషాల్లో బస్సు కదలక పోతే, అద్దాలు పగల కొడతాం, టైర్లు పంచర్ చేస్తాం— అసలు బస్సునే తగల బెడతాం!" విద్యార్థి నాయకుడికి సపోర్టు యిచ్చారు అందరూ

"పోనీ"గదిమాడు పెళ్ళికొడుకు తండ్రి.

"ఆయన ఆలస్యానికి బస్సేం చేసింది సార్!"

"బస్సునే కాదు ఆయన్నుకూడా ఒక పట్టు పడతాం. రానీ చూద్దాం. మమ్మల్నం దర్నీ తన ఒక్కడికోసం కాచుకూర్చో నేలా చేస్తాడా "

"పైకి రిపోర్టు యిద్దాం గురూ ఆయన మీద. పెద్దాళ్ళ బ్రతుకులన్నీ బయట పడతాయి!"

"అంతే - అంతే."

"ఉండండి సార్ - ఆయన వస్తున్నారు."

"రానీవయ్యా- ఆయన్ని నుంచోపెట్టి నాలుగూ దులిపేద్దాం."

"అవును రానీండి గురూగారూ- మనిషిని పట్టుకుని నానా చీవాట్లూ వేద్దాం!" విద్యార్థి ఆవేశంగా అన్నాడు.

సన్నగా బక్కపలచగా వున్న ఒక వ్యక్తి అక్కడికి వచ్చాడు.

కండక్టర్ ఆయన్నిచూసి "నమస్తే సార్!" అన్నాడు.

ఆయన తలవూపి, బస్సు ఎక్కాడు.

వున్నారు. భార్యా భర్తలు. చిలకా గోరింకల్లా వున్నారు. ఆమె ఒళ్ళో అందాలొలికిస్తున్న బొమ్మలా - పిల్లాడు ముద్దుగా వున్నాడు. వాళ్ళిద్దరూ సన్న సన్నగా మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్యలో నవ్వుకుంటున్నారు. వాళ్ళిద్దర్నీ చూస్తుంటే తనకు ముచ్చటేసింది.

దంపతులు అన్యోన్యంగా వుండాలి. ఆదర్శప్రాయులుగా మెలగాలి. అందుకు యిరువురి హృదయాలు ఏకం కావాలి. కల్మషంలేని మనస్సులు అయస్కాంతాల్లా ఆకర్షించుకుని ఒకటయిపోతాయి.

వాళ్ళిద్దర్నీ మనస్సులోనే అభినందించాడు.

రవి ఒకసారి బయటకు తొంగి చూసాడు. డిపో ప్రయాణీకులతో సందడిగా వుంది.

కొద్ది సేపట్లో బస్సు కదిలింది.

"చలిగాలి తగులుతుంది. బాబుకు స్వెట్టరు వేయి" - పిల్లాడ్ని ఆమె ఒడిలోంచి తన చేతుల్లోకి తీసుకున్నాడతను.

ఆమె సంచిలోంచి స్వెట్టరు తీసింది. బాబుకు తొడిగి, తన ఒడి లోనికి తీసుకుంది బుగ్గలాడిస్తూ వాడి మొహంలోకి చూసి నవ్వింది.

వాడూ నవ్వాడు.

వాడి బోసి నవ్వులో ముత్యాల వాన కురుస్తుంది.

ఆమె మాతృ హృదయం పరవశించింది. అతని కన్నుల్లో గర్వం తొంగి చూసింది.

నిజమే! భార్యా భర్తలకు తృప్తి నిచ్చేది, అనుబంధాన్ని పదిల పరిచేది - సంతానమే!

ఆ ముగ్గుర్ని అలా చూస్తూ వున్న రవి మస్తిష్కంలో వర్మ మెదిలాడు.

"సంతానం లేకపోతే భార్యాభర్తల మధ్య పొత్తు పొసగదు. బ్రతుకు కృత్రిమమైన బాటల్లో నడుస్తూ జీవితం నరక ప్రాయ మవుతుంది. పటిష్టమయిన వివాహ బంధానికి ఆధారం పిల్లలు. ఆ పిల్లల వలనే స్త్రీ జీవితానికి సార్థకత."

ఈ మాటలు రెండు నెలల క్రితం వర్మ రవితో అన్నాడు.

* * *

వర్మ మెడికల్ రిప్రజెంటేటివ్. వృత్తిరీత్యా ఒక వూరూ ఒక వాడంటూ లేకుండా అన్ని వూర్లూ తిరిగేస్తూ, అన్ని రుచులకు అలవాటు పడ్డాడు. అంతగా కలవాడు కాక పోయినా జీవితాన్ని జల్సాగా గడిపేందుకు కొద్దో గొప్పో వున్నవాడు. తల్లీదండ్రులకు ఒక్కడే కొడుకు. "వైన్" లేక పోయినా వుండ గలడు, కానీ "వుమెన్" లేకుండా తనకు రోజులు గడిచేవి కావు. యవ్వనాన్నీ హుషారుగా ఖర్చు చేస్తూ జాలీగా బ్రతికేస్తున్న వర్మను వీలైనప్పుడల్లా రవి మెడికల్ చెకప్ చేసి మందులు, సలహాలు యిస్తూ వుండేవాడు. చిల్లర తిరుగుళ్లు మానేసి పెళ్ళి చేసుకుని బుద్ధిగా వుండమని చాలాసార్లు చెప్పి చూశాడు.

వర్మ నవ్వి వూరుకునేవాడు.

కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు.

మనుష్యులలో మార్పును తెస్తుంది.

కాకపోతే! వర్మ విషయంలో ఆ మార్పు తల్లి దండ్రుల వత్తిడి వలన

వచ్చింది. ఆ వత్తిడి వలనే అతను పెళ్ళికి వప్పుకోక తప్పలేదు.

పెళ్ళంటే ఎగిరి గంతేయాల్సిన రోజుల్లో వర్మ దిగులుపడి వుండటం రవికి చిత్రంగా వుంది. కారణ మేమిటో చెప్పమని నిగ్గతీసి అడిగాడు.

వర్మ నేల చూపులు చూస్తూ, నాకీ పెళ్ళి యిష్టం లేదన్నాడు,

"ఏ! అమ్మాయి నచ్చలేదా!"

"అబ్బే! అదేం లేదు. అమ్మాయి బాగుంటుంది. నలగని మల్లె పువ్వులా, వెన్నెల పోత పోసి చెక్కిన సజీవ శిల్పంలా వుంది."

"మరింకేం?"

"రవీ! నా గురించి అంతా నీకు తెలుసు. నేను చెడు తిరుగుళ్ళకు అలవాటుపడి అందిన చోటల్లా ఆనందాన్ని అనుభవిస్తూ, యవ్వనాన్ని పంచుకుంటూ వచ్చాను. నా వలన ఆమె సుఖ పడుతుందనే ఆశ నాకు లేదు. ప్రతి స్త్రీ తన చల్లని ఒడిలో పచ్చని పాపాయికి జీవితాన్ని పంచి యిస్తూ ఎనలేని అనుభూతిని పొందుతుంది. కానీ నన్ను చేసుకుని ఆమె తల్లి కాగలదా?"

నిరాశగా నిట్టూర్చాడు.

రవి కనుబొమలు ముడిపడ్డాయి. వర్మ కళ్ళల్లోకి సూటిగా చూసాడు. తను చూడ లేక, కళ్ళు త్రిప్పేసుకుని, తల వంచుకున్నాడు.

"నీకా అనుమానం ఎందుకొచ్చింది?" అడిగాడు రవి.


"నాలాగే చెడు తిరుగుళ్ళకు అలవాటు పడి జీవితంలో ఓడిపోయిన వాళ్ళని, నమ్ముకున్న వారిని నట్టేట ముంచిన ప్రబుద్ధులను చాలా మందిని చూశాను. సంతానం లేని స్త్రీ జీవితం తృప్తిగా వుండదు పిల్లలు లేని భార్యభర్తల మధ్య పొత్తు పొసగదు.' బ్రతుకు కృత్రిమ బాటల్లో నడుస్తూ జీవితం నరక ప్రాయ మవుతుంది. పటిష్టమయిన వివాహ బంధానికి ఆధారం పిల్లలు. ఆ పిల్లలవలనే స్త్రీ జీవితానికి సార్ధకత."

ఆవేశంగా జుట్టును పీక్కుంటున్న వర్మను చూసి రవీంద్ర బిగ్గరగా నవ్వి, "ఒరేయ్! ఫూల్! వయస్సులో తిరిగినంత మాత్రాన పిల్లలు పుట్టరని ఎవర్రా చెప్పింది నీకు? నీకా— భయం వద్దు. డోంట్ వర్రీ! వైద్యశాస్త్రం మన వూహాలకు అందని పరిధుల మేరా ఎదిగింది. నీవేదో వూహించుకుని బంగారంలాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. నీకు పిల్లలు పుడతారనే నమ్మకం నాకుంది. సర్టిఫై చేస్తున్నాను. జరిగినదంతా మర్చిపోయి ముందు జరగాల్సింది ఆలోచించు. జీవితం ఓ రంగుల కల ఇంతవరకు నీది తాడూ— బొంగరము లేని జీవితం. ఇకముందు అన్నీ సమకూరబోతున్నాయి. క్రమబద్ధ మయిన జీవితం ఏర్పడబోతుంది. నీవు కుదురుగా వుండి, నిన్ను నమ్ముకుని వచ్చిన ఆ అమ్మాయికి నిజాయితీ తోడుగా నిలచి జీవితాన్ని నందనవనంగా మార్చుకో లే! హుషారుగా వుండు."

భుజం తట్టాడు రవీంద్ర.

* * *

పెళ్ళి పందిట్లో క్షణక్షణానికి సందడి పెరిగిపోతుంది. ఒక ప్రక్క మంగళ



వాయిద్యాలు, మరో ప్రక్క ఆడ పెళ్ళి వారి హడావుడి. చిన్న పిల్లల ఏడ్పులు. పెద్దవాళ్ళ అరుపులు. చీరల గరగరలు. బెల్‌బాటమ్స్ నిగనిగలు. వేడి చూపుల తళతళలు. కొంటె చూపుల మిలమిలలు.

—అంతా ఎవరి పనుల్లో వారున్నారు.

చాలాసేపట్నుంచి ఒకతను హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నాడు. వయస్సు నలభై పైగా వుంటుంది. అతన్ని ఎక్కడో చూసినట్లనిపిస్తుంది రవికి. కానీ, ఎక్కడ చూసిందీ గుర్తుకు రావటం లేదు. అయినా ఆలోచిస్తున్నాడు.

వర్మ పెళ్ళి పీటలపై కూర్చుని వున్నాడు. హుందాగా గంభీరంగా వున్నాడు. పైపంచె జారిపోతూ వుంటే ప్రక్కనే ఎవరో సర్దుతున్నారు.

పురోహితుడు మంత్రాలు వల్లిస్తున్నాడు.

మంగళ వాయిద్యాలు మారు మ్రోగుతున్నాయి.

రవి ఆలోచనల్నుండి తేరుకోవటం లేదు. అతన్ని తనెక్కడ చూసిందీ గుర్తుకు రావటం లేదు.

"ఒరేయ్! మనవాడు మంచి లక్కీ ఫెలో. అందమయిన కుందనపు బొమ్మ దొరికింది" చెవిలో గొణిగాడు మిత్రుడు శశి.

ఆలోచనల్నుండి తేరుకుని అటు చూశాడు. పెళ్ళికూతుర్ని తీసుకొస్తున్నారు. మెల్లగా నడిపించుకుంటూ తీసుకుని వచ్చి, వర్మ ప్రక్కనే కూర్చోబెట్టారు. సిగ్గుతో తల వంచుకుంది. అమ్మలక్కలు ముసి ముసిగా నవ్వుకున్నారు.

ఫోటోగ్రాఫర్ ఫ్లాష్ కెమేరాను క్లిక్ మనిపించాడు. రవి ఆమెను పరీక్షగా చూసాడు.

ఒక్కసారి గుండె ఝల్లుమంది.

అతన్ని ఎక్కడ చూసిందీ యిప్పుడు గుర్తుకు వచ్చింది. అతను సుశీల తండ్రి.

* * *

సరిగ్గా రెండేళ్ళ క్రితం తనూ, తన భార్య డాక్టరు అరుణ డిస్పెన్సరీ తెరిచిన తొలి రోజుల్లో అతను హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'నా బిడ్డ ప్రాణాలు కాపాడండ'ని అరుణ చేతులు పట్టుకున్నాడు. 'మీకు ఎంత డబ్బు కావాలన్నా యిస్తాను. నా బిడ్డ నాకు దక్కేలా చేయండ'ని ప్రాధేయపడుతున్నాడు.

అంతలో

ఇద్దరు వ్యక్తులు ఓ అమ్మాయిని ఎత్తుకుని తీసుకు వచ్చారు. కోమాలో వుంది. వళ్ళు నల్లబడిపోతోంది.

వెంటనే అరుణ ఆమెను ఆపరేషన్ థియేటర్లోకి తీసుకు వెళ్ళింది.

అతను జరిగినదంతా తనకు వివరంగా చెప్పాడు. ఆమె అవివాహిత. పేరు సుశీల. యవ్వనపు తొందరలో తప్పటడుగు వేసింది. అతి గారాబంగా పెంచిన తండ్రికీ విషయం తెలిస్తే మండిపడతాడని తల్లి చాటుగా నాటు మందు తినిపించింది. కడుపులో నొప్పిగా వుంటే— ఆ బాధ భరించలేక తల్లికి చెప్పుకుందామనుకుని మేడమీద నుంచి వస్తూ కాలుజారి మెట్లమీదనుండి దొర్లిపడింది. గర్భాశయానికి బలమైన గాయం తగిలింది.

అరుణ మృత్యువుతో పోరాడి ఆమెకు ప్రాణదానం చేసింది. కానీ, గర్భసంచి తీసివేయక తప్పలేదు.

* * *

శాశ్వతంగా మాతృత్వాన్నికోల్పోయిన సుశీల యిప్పుడు సురేఖగా వర్మ ప్రక్కన పెళ్ళికుమార్తెగా కూర్చుని వుంది.

మంత్రాలు, మంగళవాయిద్యాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి.

మంగళ సూత్రధారణ జరుగుతుంది.

అక్షింతల వాన కురుస్తుంది. అంతా ఆశీర్వదిస్తున్నారు.

రవి చేతిలోని అక్షింతలు తన్ను వెక్కిరిస్తున్నాయి. మనస్సు అస్తవ్యస్తంగా పడి వుంది. ఆలోచనల్తో బుర్ర వేడెక్కిపోతుంది. వర్మ మాటలు పదేపదే చెవుల్లో గింగురమంటున్నాయి.

పిల్లలవలనే స్త్రీ జీవితానికి సార్ధకత సార్ధకత.

సార్ధకత సార్ధకత.

పటిష్టమైన వివాహబంధానికి ఆధారం.

పిల్లలు పిల్లలు పిల్లలు.

భార్యాభర్తలకు తృప్తి నిచ్చేది. అనుబంధాన్ని పదిలపరిచేది— సంతానమే! .. సంతానమే! సంతానమే!

రవికి తల తిరుగుతుంది. మనస్సెవరో నలిపేస్తున్నట్లనిపిస్తుంది. ఎలుగెత్తి అరవాలనిపిస్తుంది. ఈ పెళ్ళి ఆపుచేయాలనిపిస్తుంది.

కానీ, గొంతు పెగలటం లేదు.

వధూవరులు దండలు మార్చుకున్నారు. ఒకరిమీద ఒకరు తలంబ్రాలు పోసుకుంటున్నారు.

రవి నిశ్చేష్టుడయి చూస్తూ వున్నాడు.

పెళ్ళి జరిగిపోయింది!!!??? ★

కదలిపోయిన వెన్నెల


ఆ రాత్రి వెన్నెల నీలవేణి నవ్వులా వుంది.

సెవెన్ హిల్స్ హోటల్లో భోజనంచేసి నా గదికి వచ్చేసరికి ఎనిమిది గంటలు దాటుతోంది. పాంటు, షర్టు విప్పి హాంగరుకు తగిలించి లాల్చీ, పైజామా వేసుకున్నాను. కిటికీ తలుపులను మూసి లైటార్పి, గదికి తాళంపెట్టి పక్కబట్టలు, సిగరెట్ పాక్, అగ్గిపెట్టె తీసికొని డాబా మీదకు వెళ్ళాను. డాబామీది వెన్నెల పిండారబోసినట్లుగా వుంది. వేసవికాలం కావటంచేత పక్కింటి డాక్టరుగారి ఇద్దరు కూతుళ్ళు, వారి చిన్నతమ్ముడు అప్పటికే వారి డాబామీదకు వచ్చి పక్కలు పరచుకొని కూర్చుని సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేనూ పక్కపరచుకొని వెల్లికింతలా పడుకున్నాను. పాకెట్లోనుంచి సిగరెట్ తీసి వెలిగించాను. గట్టిగా దమ్ముపీల్చి పొగ బయటకు వదులుతూ ఆకాశంకేసి చూశాను. నలుపు-నీలిరంగుల కలయికలో వుంది. ఒత్తుగా వున్నాయి చుక్కలు. అల్యూమినియం రేకు బిళ్ళలా వున్నాడు చంద్రుడు.

ఆ డాబామీద పడుకునేది నేనొక్కడినే. మా ఇంటావిడవున్నా ఆమె క్రిందే పడుకుంటుంది. ఆమెకు ఎవ్వరూ లేరు. పెళ్ళయిన పదేళ్ళకే భర్త పోయాడుట. ఆ తర్వాత చేతికి అంది వచ్చిన కొడుకూ ఏదో ప్రమాదంలో పోయాడుట. ఆమెకు నేనంటే ఎంతో ప్రేమ. నేనూ ఆమె కొడుకులా వుంటానట.

డాబా క్రిందగావున్న పారిజాతం చెట్టు పూలవాసన గాలివీచినప్పుడల్లా పైకివచ్చి మనసుకు హాయిని కలిగిస్తోంది. డాబా మీదకు ఒరిగి ముద్దు పెట్టుకుంటున్నట్లున్న కొబ్బరిచెట్టు- కొబ్బరి ఆకులమీద పడుతున్న వెన్నెల క్రిందికి జారిపోతోంది. ఆ



ప్రతాప రవిశంకర్

దృశ్యాన్నే చూస్తూ సిగరెట్టు కాలుస్తున్న నాకు ఆ క్షణంలో నీలవేణి మదిలో మెదిలింది.

నీలవేణికి ఇలాంటి వెన్నెల రాత్రులంటే ఎంతో ఇష్టం. నీలవేణికి ఇష్టం కాబట్టి. నాక్కూడా ఇలా డాబామీద వెన్నెల్లో పడుకొని చంద్రుడికేసి, చుక్కల కేసి చూడటం మరీ ఇష్టమే. అదేమిటో కాని నేను, నీలవేణి ఎప్పుడు కలుసుకున్నా మా డాబామీదే కలుసుకునే వాళ్ళం. వెన్నెలలో ఒకరి పక్కన ఒకరం కూర్చుని ఏవో తీయని మాటలు మాట్లాడుకునేవాళ్ళం. ఎన్నిమాటలు మాట్లాడుకున్నా ఇంకా ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలని, ఎన్ని వూసులో చెప్పుకోవాలని అనిపించేది. ఎంతసేపు మాట్లాడుకున్నా ఇద్దరికీ తనివి తీరేది కాదు, తృప్తి వుండేది కాదు.

నీలవేణి, నేను అంతగా కలసిపోయాము. ఒకరినొకరం అంత గాఢంగా ప్రేమించుకున్నాము. ఎవ్వరూ మమ్మల్ని విడదీయలేనంతగా పాలు, నీరులా కలసిపోయాము. నీలవేణి ఎవరో కాదు. చిన్నతనం నించి నాతో కలసి తిరిగిన నా స్నేహితురాలు. వయసు వచ్చేవరకూ పెరిగిన మా స్నేహబంధం ఆ తర్వాత ప్రేమబంధంగా మారింది. నీలవేణి, నేను కలసి తిరగటం మా ఇద్దరి పెద్దలకూ అంగీకారమే. పైగా నీలవేణి తండ్రి, మా నాన్న మంచి స్నేహితులు. మా ఇద్దరి పెద్దలలోనూ అటువంటి అభిప్రాయం పెనవేసుకుపోవటంతో ఎవ్వరూ మా ప్రణయానికి అడ్డుపడలేదు. ఆ విధంగా సాగిపోయింది నీలవేణితో నా ప్రణయ జీవితం.

వెన్నెల రాత్రులలో రోజూ మా ఇంటికి వచ్చేది నీలవేణి. చదువుకోటానికి పుస్తకాలుకూడా తీసుకొచ్చేది. కాని చదివేది కాదు. నా భోజనం పూర్తి కాగానే ఇద్దరం డాబామీదకు వెళ్ళి కూర్చునేవాళ్ళం. వెన్నెలలో కూర్చుని ఏవో కబుర్లు చెబుతూ నవ్వుతుండేది నీలవేణి. ఆమె నవ్వును చూస్తూ నన్ను నేనే మరచిపోయేవాడిని. ఆ నవ్వుకోసమే ఆమెను పదే పదే నవ్వించేవాడిని. నీలవేణి ఎంతో అందంగా, నిర్మలంగా నవ్వుతుంది. వెన్నెలలో ఆమె పలువరుస ముత్యాల్లా మెరిసేది. ఆమె ముఖం మరింత అందంగా వుండేది.

నీలవేణి నవ్వును జీవితాంతం చూద్దామనుకున్నాను. ఆమెతోనే నా బ్రతుకు ముడిపడిందనుకున్నాను. ఇప్పుడు అవన్నీ నిజంగా కలలు, వూహలు. వాటిల్లో ఒక్కటీ నిజమవలేదు. నా కలలన్నీ కల్లలైనాయి. నా వూహలన్నీ కరిగిపోయాయి. చివరికి నేను నేనుగానే మిగిలిపోయాను. నీలవేణి భర్తను కాలేకపోయాను.

నా భార్య కావాలని నీలవేణి ఎంతో తాపత్రయపడింది. నేను నీలవేణి భర్తను కావాలని పడిన ఆదుర్దాకంటే ఆమె నా భార్య కావాలని పడిన తపనే ఎక్కువ. ఆమె ఎప్పుడికైనా నా భార్య కాకపోదనే భరోసా నాకుండేది. కాని తను నన్ను భర్తగా పొందలేదేమోననే భయం నీలవేణిని అనుక్షణం వెంటాడుతుండేది.


ఆమె అలా భయపడటానికి కారణం లేకపోలేదు. నీలవేణికి ఓ మొగుడుపోయిన

ప్రగతి పథంలో మన దేశం

ఎగుమతులు త్వరితగతిని పెరిగాయి

భారతీయ ఎగుమతులు రు 3 300 కోట్ల స్థాయిని అందుకున్నాయి పదేండ్ల క్రితం ఎగుమతులు రు 805 కోట్ల మేరకు మాత్రమే జరిగేవి

సరుకు నాణ్యత పెరగటంతో విదేశాల్లో భారతీయ సరుకుల గురించి ఇంకా మంచి అభిప్రాయం ఏర్పడింది నిరుడు ఇంజనీరింగ్ సరుకుల ఎగుమతుల వలన రు 353 కోట్లు ఆర్జించారు… ఇది ఒక రికార్డు



దృఢ సంకల్పంతో కష్టించి పనిచేస్తే నిలబడ గలుగుతాం

davp 75/499

మినీ కథ:

ఎలా?

మా ఆఫీస్ కొలీగ్ బాలకృష్ణ ఎప్పుడూ ఇటువంటి విజ్ఞానం యిచ్చే పుస్తకాలే చదువుతుంటాడు. మనశ్శాంతి సాధించడం ఎలా? . మోక్ష సాధనం ఎలా? . కోపాన్ని నిగ్రహించుకోవడం ఎలా? ఇతరులను మంచి చేసుకోవడం ఎలా? ఇలాంటి "ఎలా? " పుస్తకాలు అతను కోకొల్లలుగా అలా అలా చదివాడు. ఇంకా సైకాలజీకి సంబంధించినవి, భగవద్గీత, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించే పుస్తకాలు ఎప్పుడూ చదువుతుంటాడు.

"ఈ పుస్తకం చాలాబావుంది. ఇందులో మంచి మంచి విషయాలు చాలా ఉన్నాయి. చదువుతారా?" అంటూ ఓ పుస్తకం ఇచ్చాడు నాకు ఒకసారి. "కోపం రాకుండా చూసుకోవడం ఎలా?"

"అబ్బే ఈ పుస్తకాలు కేవలం చదవడం వల్ల లాభం ఏముందీ? ఈ పుస్తకం చదివి ఇంకో పుస్తకం చదవడం మొదలుబెట్టగానే ఇందులోని విషయాలన్నీ మర్చిపోతాం అందుచేత వీటిని కేవలం చదవడమేకాక ఆచరణలోకూడా పెట్టాలి" అన్నాను నేను.

అతను నా మాటలను తీవ్రంగా ఖండించాడు. అటువంటి పుస్తకాలు చదవడంవల్ల వాటి ప్రభావం ఊహించని విధంగా మన మనసు మీద పడుతుందనీ అందుచేత ఆ పుస్తకాలు ఎప్పుడూ చదవాలనీ అన్నాడు.

నేనేమో కేవలం మంచి పుస్తకాలు చదవడం వల్ల మనిషి మారిపోడనీ, పుస్తకాలు చదవడం పది శాతం అయితే సాధన తొంభై శాతం ఉండాలనీ అన్నాను.

మా యిద్దరి మధ్యా తీవ్రమయిన వాగ్యుద్ధం నడిచింది. సెక్షనులోని అన్ని తలలూ మావైపు తిరిగాయి.

ఉన్నట్లుండి బాలకృష్ణ రయ్యిమని పైకి లేచిపోయాడు.

"అయితే నేనేమో తెలివి తక్కువ దద్దమ్మలా ఈ పనికిమాలిన పుస్తకాలు చదువుతున్నానని మీ అభిప్రాయమా? " అంటూ మిర్రి మిర్రి చూశాడు.

నేనేమో అతని మూడ్ని పాడు చేసినందుకు క్షమాపణలు చెప్పుకుని వచ్చి నా సీట్లో కూలబడ్డాను.

ట్రేలోని ఫైల్సు ముందేసుకుంటూ ఒకసారి బాలకృష్ణ వైపు చూశాను.

అతను కాలాన్ని దుర్వినియోగం చెయ్యకుండా "కోపం రాకుండా చూసుకోవడం ఎలా?"ని చదువుతున్నాడు— ధుమ ధుమ లాడుతున్న ముఖంతో.

—మల్లిక్



మేనత్త వుండేది. ఆమె జబ్బు మనిషి. ఎప్పుడూ మంచంలోనే వుండేది. ఆమెకు ఒక్కడే ఒక్క కొడుకు. సుందరరావు. సుందరరావు తల్లి తను అనుక్షణం చావుకు దగ్గరపడుతుందని తెలియగానే ఆమెలో తన కొడుకు పెళ్ళి చూసి చని పోవాలనే కోరిక బలంగా కలిగింది. ఆమెకు మేనరికాలంటే ఎంతో ఇష్టం. అందుకే తన తమ్ముడి కూతురైన నీలవే ణంటే ఆమెకు చెప్పలేని ప్రేమ. ప్రతి వేసవికాలపు సెలవుల్లో నీలవేణిని తన దగ్గరకు పిలిపించుకుని, కొన్నాళ్ళు తన దగ్గర వుంచుకొని సుందరరావుని చేసుకో మని చిలక్కి చెప్పినట్టు చెప్పేది. నీలవేణి మాట్లాడేది కాదు. అప్పుడే తన నిర్ణయాన్ని ఆమెకు చెప్పి పెద్దదయిన ఆమె మనసును నొప్పించడం ఇష్టంలేక మౌనంగా వుండేది. తన మనసులో వున్న కోరికను తన తమ్ముడైన నీలవేణి తండ్రితో చెప్పింది ఆమె. నీలవేణిని తన కోడల్ని చెయ్యమన్నది. ఆయన తన కూతుర్ని సుందరరావుకు ఇవ్వటానికి సుతరామూ ఇష్టపడలేదు. సుందరరావు ఏమంత మంచి వాడు కాదన్న సంగతి ఆయనకు తెలుసు. అందుకే నీలవేణి నా భార్యవుతుందను కున్నాను.

మనం అనుకున్నవి అనుకున్నట్లు జరి గితే అంతకంటే కావలసింది ఏముంది? నేననుకున్నట్లు నీలవేణి నా భార్యకాలేదు. తన అంతిమ క్షణాల్లో తమ్ముడిని పిలిపించి కంట తడిపెట్టి తన కోరిక తీర్చమన్నది సుందరరావు తల్లి, ఆయన ఒప్పుకోలేదు. ఆమెవల్ల అంతో ఇంతో ఉపకారం పొందిన బంధువులు ఆమె కోరిక తీర్చ మని ఆయనను పోరారు. పెళ్ళయితే సుందరరావు మారతాడన్నారు. నీలవేణే

సుందరరావుని మంచి దారిలో పెడుతుందని అన్నారు. ఇంకా ఎన్నో మాటలు చెప్పి ఆయనను బలవంత పెట్టారు. చివరికి ఆయన పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా అయింది. బంధువుల ఆగ్రహానికి గురి కావటం ఇష్టంలేక, తన సొంత అక్కయ్య కన్నీళ్ళు చూడలేక అయిష్టంగా తన అక్కయ్య కోరిక తీర్చాడు. తండ్రి మాటకు ఎదురు చెప్పలేని నీలవేణి పరిస్థితిని గ్రహించి కుమిలి కుమిలి ఏడుస్తూనే సుందరరావు భార్య అయింది. పెళ్ళయిన మరురోజు సుందరరావు తల్లి, నీలవేణిని తన కోడలు చేసుకున్నాననే తృప్తికొద్దీ, నన్నూ- నీలవేణినీ విడదీసిన పాపాన్ని మూట కట్టుకొని నరకానికి పోయింది.

చివరకు నాకూ నరకమే మిగిలింది. అసలు ఈ సమస్య రాకముందే నీలవేణిని పెళ్ళి చేసుకుని వుంటే బావుండే దనిపించింది. అప్పటికీ తనని చేసుకోమని నీలవేణి నన్ను ఎన్నోసార్లు ఒత్తిడి చేసింది. తన మేనత్త ఏదో ఒకరోజు ఇలాంటి పరిస్థితి కల్పిస్తుందని నీలవేణి మొదట్నించీ అనుమానిస్తూనే వుంది. కాని నేనే ఆమె మాటలను లెక్కచెయ్యలేదు. డిగ్రీ చేతికి రాగానే, ఎక్కడైనా ఉద్యోగం దొరకగానే చేసుకుంటా నన్నాను. డిగ్రీ చేతికొచ్చింది. పురుష లక్షణంగా ఉద్యోగం కూడా వచ్చింది. కాని ఏం లాభం? అప్పటికే నీలవేణి కాపురానికి వెళ్ళిపోయింది.

నీలవేణి కాపురానికి వెళ్ళబోయేముందు మే మిద్దరం మా డాబామీదే కలుసుకున్నాము. మేం కలుసుకున్న రోజు వెన్నెల లేదు. చీకటి. ఒకరి ముఖా లొకరికి సరిగా కనిపించడం లేదు.

నిజానికి ఆమె తప్పు ఎంతమాత్రమూ లేకపోయినా, నా భార్య రాకుండా పోయినందుకు నీలవేణిమీద నాకు కసిగా వుంది. బహుశా నీలవేణికి కూడా నేను తన భర్తను కాలేక పోయినందుకు నామీద కసిగా వుండవచ్చు. నాలాగే నీలవేణి కూ్కడా మా ఇద్దరినీ విడదీసినందుకు సుందరరావుకు ఎవరిమీదా కసిగా లేదేమో. అవును. ఎందుకుంటుంది? బంగారుబొమ్మ లాంటి నీలవేణి తన భార్య అయింది కదూ?

మాట్లాడకుండా నా దగ్గరగా కూర్చుంది నీలవేణి. ఒకవేళ మితిమీరిన దుఃఖం మాటలను పెగలనీయటం లేదేమో!గుండె పగిలే ఆవేదన నీలవేణి అంకిళ్ళనునొక్కివేసి వుండవచ్చును.

ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోయాను. చివరికి నేనే "నీలవేణీ" అంటూ ఏదో మాట్లాడబోయాను. తను మాట్లాడకపోగా నన్నుకూడా మాట్లాడనివ్వ లేదు నీలవేణి.

"నువ్వేం చెప్పొద్దు సారధీ. ఇక ఎన్ని మాటలు మాట్లాడుకున్నా మరింత దుఃఖం పెరగటం తప్పితే అందువల్ల ఉపయోగం లేదు. నువ్వెంత బాధపడుతున్నావో నాకు తెలుసు. నేనెంత బాధపడుతున్నానో నీకు తెలుసు. ఎవరి బాధ వారి గుండెలను పిండి వేస్తుంటే ఒకరి నొకరు ఓదార్చుకోడంలో అర్థం లేదు. జరిగిందేదో జరిగింది. నేను వెళ్ళిపోతున్నాను. నీకు దూరమైనానని నన్ను మరచిపోవటానికి ప్రయత్నించకు సారధీ. నా తలపులు నీకు బాధ కలిగిస్తున్నా నన్ను మరచిపోవటానికి ప్రయత్నిస్తే అది మన ప్రేమకే కళంకం.నన్ను



'నా పేరే భగవాన్'లో కీలకపాత్రధారి సత్యనారాయణ రెండురకాల వేషాల మధ్య నాయకా నాయికలు రామకృష్ణ, మంజుల.

మరచిపోవు కదూ" అంటూ వడి వడిగా వెళ్ళిపోయింది.

నీలవేణి నా గుండెల మీదుగా నడచి వెళ్ళినట్టనిపించింది. ఆవేశంగా పెదవి కొరుక్కున్నాను. అంతకుమించి ఆ క్షణంలో ఏమీ చెయ్యలేకపోయాను.

ఆ తర్వాత నీలవేణి ఎడబాటు నాకు తీరని వ్యథను కలిగించింది. ఆమె తలపులు నన్ను కొన్నాళ్ళవరకు వెంటాడాయి. ఇన్నాళ్ళూ నా ఇంటి దీపమనుకున్న నీలవేణి మరో ఇంటి ఇల్లాలయిందని గుర్తు కొచ్చినప్పుడల్లా నా గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్టనిపించేది. క్రమంగా నీలవేణీ నేనూ విడిపోయామనే బాధను మరచిపోతూ. మేమిద్దరం కలుసుకున్నప్పటి తీయని అనుభూతులను గుర్తు తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

కాపురానికి వెళ్ళిన ఆరునెల్ల తర్వాత నీలవేణి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. తన భర్త తాగుబోతు అనీ, అతనికి చాలా మంది స్త్రీలతో సంబంధం వుందనీ, తాగి వచ్చి రోజూ తనని చావ కొడుతున్నాడనీ, అతనితో కాపురం చెయ్యటం దుర్భరంగా వుంది సారధీ అని వ్రాసింది. ఆ ఉత్తరం చదివి ఎంతో బాధపడ్డాను. కుందనపు బొమ్మలాంటి నీలవేణిని అన్ని కష్టాలు పెడుతున్నాడని తెలియగానే సుందరరావు మీద అంతులేని ఆగ్రహం కలిగింది. కాని ఏం చెయ్యగలను? బాధపడటం తప్పించి మరేమీ చెయ్యలేకపోయాను. నీలవేణి ఉత్తరానికి జవాబు వ్రాయలేదు. ఆ తర్వాత నీలవేణినించి ఉత్తరం అందుకోలేదు.

ఇప్పటికి నీలవేణీ, నేనూ విడిపోయి నాలుగేండ్లయింది.

నీలవేణి ఆలోచనలతో మునిగి తేలుతున్న నేను "సారధీ సారధీ" అని క్రిందనించి ఎవరో పిలవటంతో ఆలోచనల నించి బయటపడ్డాను.

పదిగంట లవుతుందనుకుంటాను. పక్క డాబామీదకు చూశాను. డాక్టరుగారి

పిల్లలు నిద్రపోతున్నారు.

ఇంత రాత్రివేళ నాకోసం ఎవరు వచ్చారో అర్ధంకాలేదు. ఆశ్చర్యంతో క్రిందికి వెళ్ళాను. గేటుతీసి బయటకు వెళ్ళేసరికి రోడ్డుమీద వేణుగోపాల్ నిల్చుని వున్నాడు.

"నువ్వా!" అన్నాను ఆశ్చర్యంగా.

వేణుగోపాల్ మాట్లాడలేదు. అతని చేతిలో సిగరెట్ ఎర్రగా వెలుగుతోంది.

"ఇంత రాత్రివేళ వచ్చావేం? ఏమైనా పనుండి వచ్చావా?" అడిగాను.

"నీతో ఒక మాట చెబుదామని వచ్చాను" అన్నాడతను దమ్ము పీల్చి.

"ఏమిటి?" కుతూహలంగా అడిగాను.

"నీలవేణి ఈ ఊళ్ళోనే వుంది" కొంచెం చిన్నగా అన్నాడు వేణుగోపాల్.

"నీలవేణి ఈ ఊళ్ళో వుందా!!" నాలో నేనే అనుకుంటున్నట్టు అన్నాను. చాలా ఆశ్చర్యం కలిగింది. నీలవేణి ఈ ఊళ్ళో ఎందుకు వుంటుంది? ఒకవేళ సుందరరావుకు ట్రాన్స్ఫరయిందేమో. లేక ఎవరైనా బంధువులింటికి వచ్చిందేమో. అప్పటివరకు నీలవేణి గురించి ఆలోచించిన నాకు వేణుగోపాల్ ఆమె ఆ వూళ్ళోనే వుందని చెప్పగానే ఒక్కసారి ఆమెను చూడాలనే ఆత్రుత నాలో కలిగింది.

"ఎక్కడుందో నీకు తెలుసా?" అడిగాను.

"ఆఁ, వస్తే చూపించగలను."

"వెడదాం పద" అంటూ ముందుకు కదిలాను. లాల్చీ, పైజమాతోనే వేణుగోపాల్ వెనుక బయల్దేరాను. ఎన్నాళ్ళనించో నాలో అణగివున్న నీలవేణిని చూడాలనే కోరిక ఆమె ఆ వూళ్ళోనే వుందని తెలియగానే మరింత చెలరేగింది. ఆ నిముషంలో నీలవేణిని కలుసుకోడం మంచిదో, కాదో కూడా నేను ఆలోచించలేకపోయాను.

తను మరో సిగరెట్ వెలిగించుకుని, సిగరెట్, లైటర్‌ను నాకు అందించాడు వేణుగోపాల్. సిగరెట్ వెలిగించుకుని ఆ రెంటినీ అతనికి ఇచ్చాను. వేణుగోపాల్ నాకు మంచి స్నేహితుడు. అంతే కాదు. అతను బంధువు కూడా అవుతాడు. నీలవేణికీ, నాకూ వున్న సంబంధం అతనికి తెలుసు. నీలవేణి కూడా అతనికి తెలుసు. నీలవేణి కూడా అతనికి బాగా తెలుసు. ఆమెతో అతనికి కొంత పరిచయం కూడా వుంది.

కొంత దూరం నడచిన తర్వాత "సుందరరావు ఏక్సిడెంటులో పోయాడుట" చిన్నగా అన్నాడు వేణుగోపాల్. పిడుగు పడ్డట్లనిపించింది. నమ్మలేనట్లుగా అతనికేసి చూశాను. మౌనంగా ముందుకు నడుస్తున్నాడు.

సుందరరావు పోయాడా! నా నీలవేణి విధవ అయిందా? ఊహించుకుంటే భయమేసింది. సుందరరావు పోయాడనే వార్తకంటే నీలవేణి విధవయిందనే విషయం నాకు ఎక్కువ బాధను కలిగించింది. ఇటువంటి దుర్వార్త వినవల్సొస్తుందని కలలో కూడా అనుకోలేదు.

'ఎంత ఘోరం జరిగింది నీలవేణీ' మనసులో అనుకున్నాను.

నడుస్తున్నవాడల్లా ఒక ఇంటిముందు

ఆగాడు వేణుగోపాల్. నేనూ ఆగాను. ఆ ఇంటిని చూపించి "గుడ్‌నైట్" చెప్పి వెళ్ళిపోయాడతను.

ఇనుపగేటు నెట్టుకుని లోపలకు వెళ్లాను. లోపలకు వెడుతుంటే నా అడుగులు తడబడ్డాయి. తలుపులమీద చేతులువేసి చిన్నగా నెట్టాను. దగ్గరకు వేసి వున్నాయేమో తెరుచుకున్నాయి.

మెల్లగా లోపలకు అడుగుపెట్టాను. నాలుగేళ్ళ తర్వాత నీలవేణిని ఈ స్థితిలో చూడబోతున్నందుకు గుండె వేగంగా కొట్టుకుంది.

ఆ గదిలో జీరోవాట్లు బల్బు వెలుగుతోంది. నీలవేణి బ్రతుకులాగే గుడ్డిగా వుంది వెలుతురు. ఆ గదిలో వస్తువులన్నీ మసకమసగ్గా కనపడుతున్నాయి.

నా అడుగుల సవ్వడివిని గోడవైపు తిరిగి మంచం మీద కూర్చున్న నీలవేణి నావైపు తిరిగింది. ఆమె రూపును చూసి విస్తుబోయాను. అప్పటి నీలవేణికీ, ఇప్పుడు చూస్తున్న నీలవేణికీ ఎంతో భేదం కనిపించింది. చిక్కి సగమయింది. కళ్ళు లోతుకు పోయాయి. ముఖంలో జీవం లేదు. నుదుట కుంకుమలేని నీలవేణి ముఖం చంద్రుడు లేని ఆకాశంలా వుంది.

"నువ్వా" అన్నది నీలవేణి. అలా

అనటంలో చాలా రోజుల తర్వాత నన్ను చూశాననే సంతోషంలేదు. అవును. ఎట్లా వుంటుంది? భర్తపోయి పుట్టెడు దుఃఖంలో వుంది కదూ.

"కూర్చో" అన్నది.

ఆమెకు ఎదురుగా వున్న పేముకుర్చీలో కూర్చున్నాను.

తలను మోకాళ్ళమీద ఆనించుకుని ఏడుస్తోంది నీలవేణి. దుఃఖంతో ఆమె గుండెలు ఎగిరిపడుతున్నాయి.

ఆ గదిలో ఆమె ఏడుపు శబ్దం తప్పించి మరేమీ వినిపించటం లేదు. గుండెలు పగిలే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోయాను. నీలవేణి దుఃఖాన్ని చూడలేక పోయాను.

"ఏడవకు వేణీ. ఒక్కొక్కప్పుడు మనం అనుకోనివి ఎన్నో జరుగుతూ వుంటాయి. అటువంటివి జరిగినప్పుడు తట్టుకొని నిలబడగలిగితేనే మనం మనుషులం" అంటూ ఓదార్చబోయాను.

కాని నీలవేణి నన్ను ఓదార్చ నివ్వ లేదు.

"నీకు తెలుసు సారథీ నా బాధ మరచిపోయేది కాదని. నువ్వు చెబుతున్న వన్నీ ఓదార్పు మాటలనీ నీకు తెలుసు. వాటివల్ల నా దుఃఖం తీరదని నీకు తెలీదూ? ఎందుకూ వృథాప్రయత్నం చేస్తావ్? నన్నిలాగే కుమిలిపోనీ" ఏడుస్తూనే అన్నది నీలవేణి.

నీలవేణి తత్వం రవంత కూడా మార లేదు. మేమిద్దరం విడిపోయే రోజు కూడా ఇంతే. నన్ను ఓదార్చ నివ్వలేదు.

"ఇటువంటి పరిస్థితుల్లో నిన్ను కలుసుకోవాల్సొస్తుందనుకోలేదు" చిన్నగా అన్నాను.

"ఏదో ఒకరోజు నా బ్రతుకు ఇలా అవుతుందని నాకు తెలుసు సారథీ. కాని నువ్వు నన్ను కలుసుకుంటావనుకోలేదు. ఇంతకీ నేనిక్కడ వున్నట్టు ఎవరు చెప్పారు? ఆ వేణుగోపాలేనా?" తలెత్త కుండానే అడిగింది.

"అవును" అన్నాను.


"పెళ్ళి చేసుకున్నావా?" తలెత్తి నాకేసి చూస్తూ అడిగింది.

"లేదు. నువ్విలా ఒంటరిదానివవుతా వని నాకు అనిపించకపోయినా ఎందుకో నేను పెళ్ళిచేసుకోలేదు వేణీ."

"అంటే" నా మాటలు అర్థంకానట్టు నా ముఖంలోకి చూస్తూ అడిగింది.

"అదే వేణీ . మనిద్దరం చివరిసారిగా కలుసుకొన్న రాత్రి నువ్వన్న మాటలు గుర్తున్నాయా నన్ను మరచిపోవటానికి ప్రయత్నించకు సారథీ నా తలపులు నీకు బాధ కలిగిస్తున్నా నన్ను మరచి పోవటానికి ప్రయత్నిస్తే అది మనప్రేమకే కళంకం అన్నావు. నువ్వన్న మాటమీదే నిల్చున్నాను. నీ తలపులతో బ్రతుకు గడుపుతున్నాను. నువ్వు నన్ను, నేను నిన్ను ఎంత గాఢంగా ప్రేమించుకున్నామో నీకు తెలుసు. అందుకే జీవితంలో ఒక సారి పొందలేనిది ఇప్పుడు పొందాలని ఆశపడుతున్నాను. నీకు అభ్యంతరమా?" అడిగి నీలవేణి ముఖంలోకి చూశాను.

రెండు నిముషాలవరకు ఆమె మాట్లాడ లేదు. తర్వాత "క్షమించు సారథీ . కాదంటున్నందుకు సుందరం బావకు అన్యాయం చెయ్యలేను. బావ దుర్మార్గుడే కావచ్చు తాగుబోతు కావచ్చు .



పరాయి స్త్రీలతో తిరిగే మనిషే కావచ్చు. ఏమైనా ఆయనతో నాలుగేళ్ళు కాపురం చేశాను. ఏదో జరిగిపోయింది. అంతే. మళ్ళీ పెళ్ళి చేసుకోను. మళ్ళీ పెళ్ళి మాట తలపెట్టి మన ప్రేమపవిత్రతను అపవిత్రం చెయ్యకు సారథీ క్షమించు. బావకు అన్యాయం చెయ్యలేను" మరోసారి అన్నది నీలవేణి ఏడుస్తూ.

ఆమె మాటలు విని నిర్ఘాంతపోయాను. నేను ఎంతో గాఢంగా ప్రేమించి, ఎంతో అర్థం చేసుకున్నాననుకున్న నీలవేణేనా ఈ మాటలు మాట్లాడింది! ఆమె సంతోషంగా అంగీకరిస్తుందనుకున్నాను.

భర్తపోయిన నీలవేణిని, పెళ్ళికాని నేను చేసుకోటానికి సిద్ధపడినా, నన్ను చేసుకునేందుకు ఆమె సిద్ధంగా లేదు. నీలవేణి అంత ఖచ్చితంగా చెప్పిన తర్వాత అక్కడ ఒక్కక్షణం కూడా నిలువ బుద్ధి కాలేదు. నీలవేణిని ఎంతో అర్థం చేసు దానికంటే ఎక్కువగా ఎదిగిపోయింది. అవును. నీలవేణి మాటల్లో తప్పులేదు. నాలుగేళ్ళ ఇల్లాలి జీవితంలో ఇరవైయేళ్ళ నరకం అనుభవించింది. అంత నరకం అనుభవించిన ఏ ఆడదీ మళ్ళీ పెళ్ళిచేసుకోవాలనుకోలేదు. నీలవేణీ అంతే.

"వెడుతున్నాను వేణీ" అంటూ ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండా వెనక్కి తిరిగాను. నేను వెళ్ళిపోతూండగా నీలవేణి పలికిన మాటలు నాకు వినిపించాయి.

"నీ మాట కాదన్నానని నామీద కోపం తెచ్చుకొని నన్ను మరచిపోకు సారథీ నన్ను మరచిపోవటానికి ప్రయత్నిస్తే మన ప్రేమకే కళంకం."

'నిన్నెలా మరువగలను నీలవేణీ సుందరరావు భార్యగా నువ్వెప్పుడూ నాకు గుర్తుంటావు. నిన్ను మరువలేను' అనుకుంటూ బయటకు వచ్చాను. నేను రోడ్డు మీదకు వచ్చేసరికి వెన్నెలలేదు. నా

మిస్టర్ సంపత్ ఎం.ఏ

మాదిరెడ్డి సులోచన

జరిగిన కథ

ఆదర్శాలకూ, అవసరాలకూ జరుగుతున్న పోరాటంలో అవసరాలదే పైచేయి అని భావించక తప్పని పరిస్థితులలో చిక్కుకున్నాడు సంపత్ కుమార్. ప్రేమించిన సునీతి అపార్థం చేసుకుంది. సునీతి తండ్రి శివరాజు గారి బాకీ వెంటనే కట్టవలసి వచ్చింది. తల్లి అనారోగ్యం ఆందోళన కలిగిస్తూంది. న్యాయమార్గాన సంపాదన కోసం ప్రయత్నించి పరాజితుడవుతున్నాడు సంపత్. శివరాజు గారు పక్షవాతంతో మంచాన పడ్డారు. ఆయన కుటుంబం హఠాత్తుగా సంక్షోభానికి లోనైంది. అవసరాలకు లొంగాడు సంపత్. 'మేల్ ప్రాస్టిట్యూట్'గా తయారయేందుకూడా సిద్ధమై అస్తానా దగ్గర ఉద్యోగానికి చేరాడు. ఒకరోజు చాలామంది హైసొసైటీ యువతుల కోర్కె తీర్చేందుకు వారిముందు నగ్నంగా నిలబడేందుకు సిద్ధమయ్యాడు. ఆ దుస్థితినుండి సీత కాపాడింది. సంపత్ తల్లి మరణించింది. సీత అండగా నిలిచిందతనికి. సునీతికీ సంపత్ కూ మధ్య దూరం పెరిగిపోతోంది. తన మాట కాదన్నందుకు అస్తానా సంపత్ ను బెదిరించాడు. సీత సహకారంతో పెద్ద బిజినెస్ మాన్ అయ్యాడు సంపత్. సీత భర్త గుప్తాకు కంటగింపుగా వుంది సంపత్ ను చూస్తే. సునీతి కుటుంబం ఆర్థికంగా అస్తవ్యస్తమైన స్థితిలో పడింది.

24

సంపత్ బుర్ర వేడెక్కిపోయింది. ప్రతి సారీ సరుకు వచ్చాక, ఓడ దొరక్కపోతే గోడౌన్ చార్జెస్ కట్టడానికే సరిపోదు తన సంపాదన. అది కాక మాట విలువ పోతుంది. కొద్దికాలంలో 'సంపత్ ఎక్స్‌పోర్ట్'కు మంచి పేరు వచ్చింది. పేరు రావటం గొప్ప కాదు. అది వచ్చాక నిలుపుకోవటం తల నొప్పి. బాధ్యతాయుతమైన పని. మెల్లగా రవిశంకర్ మ్యూజిక్

వేశాడు. బట్టలు మార్చుకుని క్రిందికి వచ్చాడు. డాలీ, టిల్లూ వచ్చి అతన్ని వాటేసుకున్నారు.

"అంకుల్! యెక్కడికి వెళ్లావ్!"

"పని ఉండి వైజాగ్ వెళ్లాను. పదండి ఆడుకుందాము" పిల్లలను తీసుకుని బయటికు వచ్చాడు. బాల్ తీసుకుని ఆట ప్రారంభించాడు. సీత యెప్పుడు వచ్చిందో చప్పట్లు కొట్టేసరికి ముగ్గురు అటు తిరిగారు. నవ్వుతూ నిల్చుంది. డ్రైవర్ కారులోని సరుకులు బీబీకి అందిస్తున్నాడు.

"బజారంతా కొన్నట్టున్నావే?" బాల్ పడేసి, చమట ఒత్తుకుంటూ వచ్చాడు.

"నా కొనుగోలు సంగతేమోగాని, నువ్వు మాత్రం ఒక మంచి భర్తవి, ఒక మంచి తండ్రివి అవుతావు సంపత్" అన్నది ఆరాధనాపూర్వకంగా చూస్తూ.

"ఆ ముక్కలేవో టైప్‌చేసి ఇవ్వరాదూ! హాయిగా సర్టిఫికెటు అనుకుని దాచుకుంటాను" అన్నాడు నవ్వుతూ. అతనలా యెప్పుడోగాని నవ్వడు. అలా నవ్వినప్పుడు ఆహ్లాదంగా ఉంటుందామెకు. అతన్ని చూచినప్పుడు ఆత్మీయుడుగా, మంచి స్నేహితుడిని చూచిన సంతృప్తి కలుగుతుంది. ఈ మధ్య మానసికంగా ఆమె చాలా యెదిగిపోయింది. శారీరక వాంఛలే జీవితము కాదు. ఏదో అతీతమైన బంధం ఉందని భావిస్తుంది. అందుకే స్వచ్ఛంగా, నిర్మలంగా మాట్లాడగలుగుతుంది.

ఇద్దరూ లాన్‌లో కూర్చున్నారు.

"డాలీ! బీబీని కాఫీ తెమ్మని చెప్పు" అన్నది. డాలీ వెళ్ళిపోయింది.

"వైజాగ్ విశేషాలేమిటి?"

"మనమో ఓడ కొనాలి సీతా! లేదా ఈ బిజినెస్ మానెయ్యాలి. కమిషన్ ఏజెంట్స్ ఆడే నాటకాలతో తల బ్రద్దలవుతుంది. మాకు ఎక్కువ డబ్బు కావాలని ప్లైన్‌గా అడగవచ్చుకదా, అలా అడగరు. అడ్డదార్లు త్రొక్కటం నాకు రాదు."

"ఓడ స్వంతదా?"

"అంతే. లేకపోతే కష్టము."

"సంపత్ ఓడ అంటే సీత అనుకున్నావా ఏం? అంత చవగ్గా దొరకటానికి?" వెటకారం చేస్తూ వచ్చి కూర్చున్నాడు గుప్త.

"మిస్టర్ గుప్తా! మీరు మరోసారి సీత విలువ కట్టాలని చూడకండి. ఓడ యెంత ఖరీదయినా కొంటాను. కొని తీరుతాను" సూటిగా చూస్తూ సవాలు చేసినట్టు అన్నాడు.

"బొమ్మ ఓడ కొంటావా?"

"బొమ్మల సంగతులు మీకు బాగా తెలుసు. మనుష్యుల్ని బొమ్మలుగా చేయటం మీకు తెలుసు. నాకు తెలిసిందల్లా బొమ్మలను సజీవంగా మార్చటం" సంపత్ ఆవేశంగా అన్నాడు. తను అనష్టుడని తెలిసి కూడా సీతను అన్యాయం చేసిన గుప్త అంటే అతనికి ఏ కోశానా సానుభూతి, గౌరవము లేవు.

"డబ్బు యెలా తెస్తావు?"

"బ్యాంకీలు దోపిడీ చేస్తాను. నోట్లు అచ్చు వేస్తాను."

గుప్త కలవరపడి లేచి పోయాడు. బీబీ కాఫీ తెచ్చింది.

"భయ్యా! కాఫీ త్రాగి వెళ్ళు" అన్నది సీత.

"ఊఁ " వెనక్కు తిరిగి వచ్చాడు. 'ఈ సీత ముఖంలో ఏదో ఆకర్షణ, అయస్కాంతంలాంటి శక్తి ఉంది. మనుషుల్ని ఆజ్ఞాపించగల స్తోమత ఉన్నది' అనుకున్నాడు. ముగ్గురూ మౌనంగా టీ త్రాగారు.

"డాడీ! రేపు మా బడిలో ఫేట్. మీరు రావాలి" డాలి వచ్చి గుప్త మీద పడింది.

"ఓ రేపటి సంగతి ఇప్పుడెందుకు?" విసుగ్గా చూచాడు.

"భయ్యా!" సీత తీక్షణంగా చూచింది,

"డాలీ డియర్! అలాగే వెడదాం "

ఆ పరిస్థితి యెంత కృత్రిమంగా ఉందో ఊహించుకుని, అది భరించలేనట్టు లేచాడు సంపత్.

"యెక్కడికి?"

"బాబుని చూచి వస్తాను" చర చర, కారు వరకు వెళ్ళాడు. మళ్ళీ ఏమనుకున్నాడో లోపలికి వెళ్ళి స్కూటర్ తాళం చెవులు తీసుకుని వచ్చాడు. స్కూటర్ యెక్కి నర్సింగ్ హోమ్ వైపు వెళ్లాడు. బాబు లేచి తిరుగుతున్నాడు.

"వచ్చావా సంపత్! నీ కోసము చూస్తున్నాను" ఆనందంగా ముందుకు వచ్చాడు.

"ఇప్పుడెలా ఉందిరా?"

"కులాసాగా ఉంది. సుశీలమ్మ ఇల్లు మారింది, నీతో చెప్పమంది."

"నువ్వు త్వరగా కోలుకోవాలిరా. నాకు నమ్మకమయిన మనిషి కావాలి."

"నీ ఋణం "

"వెధవా! నాల్గు తన్ని మూడు కొసరు వెయ్యాలి. మొనగాడు ఋణం తీర్చుకుంటాడట. ఋణం "

"పోనీలేరా! నాన్న యెలా ఉన్నాడో."

"నాన్న! నీ దృష్టిలో నో సెక్స్, నో రిలేషన్ "

బాబు చటుక్కున సంపత్ నోరు మూశాడు. సంపత్ చేయి తొలగించి వేశాడు.

"ఏమిటి, ఇంకా నీ అలవాటు మారలేదురా. యెప్పుడు డిస్చార్జి చేస్తామన్నారు?"

"నేను బాగానే ఉన్నాను. డాక్టరు మరో వారం రోజు లుండమంటున్నాడు."

"డాక్టరు చెప్పింది విను. నువ్వు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి" బిల్లు చెల్లించమని డబ్బిచ్చాడు.

"ఇంటికి వచ్చేస్తావా?"


"నువ్వు వేరుగా వుంటే వచ్చేవాడిని రా. ఆ సీతమ్మతో నేను యెందుకు? సుశీలమ్మకు చెప్పాను ఒక గది చూడమని. వాళ్ళ పోర్షన్‌లోనే ఇస్తానందిలే."

"గుడ్ నీకు యెక్కడ అనువయితే అక్కడ ఉండు" అని బయటికి వచ్చాడు. సుశీలమ్మ అడ్రసు వంక చూచి ఉలిక్కిబడ్డాడు. ఆదర్శనగర్‌లో ఉంటుంది. తను ఒకప్పుడు ఆలయములా భావించి రోజూ వెళ్ళేవాడు. వెళ్లాలా, వద్దా అని ఆలోచించాడు. ఒకప్పుడు తన కోసం కళ్ళు

కాంతులీనుతుండగా చూచే సునీతి తనను అసహ్యాందుకొంటే భరించలేడు. స్కూటర్ ఇంటివైపు తిప్పాడు. మాట్లాడకపోతేమానే కంటి చూపయినా దక్కుతుంది అనుకున్నాడు. మళ్ళీ స్కూటర్ తిప్పాడు. శివరాజుగారింటి ముందే, నర్సింగ్ హోమ్ యజమాని ఇల్లుంది. దాంట్లో అవుట్ హౌస్‌లో ఉంటుంది సుశీలమ్మ. మూడు గదులున్నాయి. రెండు తమకు, ఒకటి బాబుకు కేటాయించామని చెప్పింది. ఆ పరిసరాలలో సుశీలమ్మ లాంటిది ఇంటద్దె ఇచ్చుకోవటం యజ్ఞమే. కాని, తన చంటిపాపను చూచుకోవాలనే షరతుపై ఇల్లిచ్చారు. ఈ కాలంలో పని వారితో వేగటము నానాఅవస్థ అవుతుంది. వారిని పరామర్శించి బయటికి వచ్చాడు. అతని ఊహ నిజమైంది. సునీతి చేతిలో బస్తా సంచి పట్టుకుని బయటికి వచ్చింది. 'ఏదయినా కొనడానికి వెడుతుందేమో' అనుకున్నాడు. ఆమె బయటికి వచ్చి గేటు వేసింది. ఆమె కట్టిన మైసూర్ క్రేపుచీర చూచాడు. 'గొప్ప చాటుకోవాలని కాబోలు బజారుకు వెళ్ళినా ఖారీ చీరలు కట్టటం' అనుకోబోయాడు. ఇంగితము మేలుకుంది. ఆమె మామూలు చీరలు కూడా కొనలేని స్థితిలో అవి కట్టుకుందేమో! ఆమె స్థితి ఊహించగానే అతని హృదయము ఆర్ద్రిమయింది. ఒకప్పటి వైభవము గుర్తుకు వచ్చింది.

"సునీత!" అతనీ పిలుపులో ఆప్యాయత ఉట్టిపడింది.

"ఎవరు?" తిరిగి చూచింది. ఆమె చూపులు భావ శూన్యంగా ఉన్నాయి.



"గుర్తించ లేదా సునీ ."

"నా పేరు మిస్ సునీతి. మీలాంటి వారు చేసిన గాయాలు మాని, మరచి పోవటం సాధ్యమా, మిస్టర్ సంపత్ .. ఓ ఎం.ఏ కూడా కాబోలు." ఆమె మాట

లలో వెటకారం సాచురేటెడ్ పాయింట్‌కు మించి పోయింది.

"నేను చెప్పింది సావకాశంగా వింటావా?"

"మీ స్నేహితుడు చెప్పాడు. అంతకంటే విలువయిన మాటలేం చెబుతావ్? అప్పుడే సీత మోజు చప్పబడిందా?... రోడ్డుమీద వాదం యెందుకు?" రెండడుగులు ముందుకు వేసింది. ఆమె మాటల్లో ముందున్న పదును లేదు. కళ్ళు నీటితో నిండాయి. ఆమెను దగ్గరగా తీసుకుని కళ్ళు ఒత్తాలనుకున్నాడు. అప్పటికే ఆమె చాలా దూరం వెళ్ళిపోయింది. బలవంతంగా స్కూటర్ పైన కూర్చుండబెట్టుకుని, యెవరూ లేని దూర తీరాలకు తీసుకుపోయి తన మనోవేదన వెల్లడించుకోవాలనుకున్నాడు. అతను, ఏదీ చేయలేనేమో అన్న నిరాశతో క్షణం కృంగిపోయాడు. అతని కళ్ళ ముందు చిరునవ్వుతో కదిలే కార్మికులు కదిలారు.

'ఓహ్! ఈ జగము ప్రేమమయమే కాదు. త్యాగమయము కూడాను.' అతని అంతరాత్మ హెచ్చరించింది.

'ఉత్తమ పురుషుడికి స్వ పరభేదం ఉండదు.' అన్న తల్లి మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఇంకా వెళ్ళలేదా సంపత్?" సుశీలమ్మ గేటు వేయడానికి వచ్చింది. ఆమె పరిస్థితి గ్రహించింది.

"పాపం! తిండికి కూడా కటకటలాడిపోతున్నారు. ఆ పిల్ల రెండు, మూడు ట్యూషన్లు చెపుతున్నట్లుంది."

"వదినా! మన పిల్లలకు ట్యూషన్లు చెప్పించు. వంద రూపాయలు అయినా ఫరవాలేదు."


"నేనిస్తాను కాని ఆ అమ్మాయి పుచ్చుకుంటుందా. భలే అభిమానముగల పిల్ల."

"ఏదో విధంగా సాయం చెయ్యి వదినా." స్కూటర్ స్టార్ట్ చేశాడు. అతని గుండె నెవరో గట్టిగా పిండినట్లు అనుభూతి చెందాడు. ఆలోచనలు వెనక్కునెట్టి కర్తవ్యం ఆలోచించ బోయాడు. అందమైన సునీతి. ముఖం చిక్కి మరింత అందంగా తయారయింది. ఆ ముఖమే అతని కళ్ళముందు నాట్యం చేస్తోంది. యెవరో అరచినట్టయి తల విదిలించాడు. పరిస్థితి అర్థం చేసుకుని సడన్ బ్రేక్ వేశాడు. బషీర్ బాగ్ చౌరస్తా దగ్గర రోబోట్ రెడ్ లైటు చూపింది. అతను తన ఆలోచనలలో ఉండి అలాగే ముందుకు సాగేడు. ఒక్క నిముషమయితే కారుకు గుద్దుకునేవాడే.

"క్యాభయి ఘర్ మే బోల్కర్ ఆయే?" ఓ ముస్లిమ్ దిగి అడిగాడు.

"ఓ అయామ్ సారీ." స్కూటర్ వెనక్కు జరిపాడు.

"పోజ్ దేఖా, మజ్నూకి తరహా ." అతను వెళ్ళి కారెక్కాడు. తన పరిస్థితి వారికేం తెలుసు?నవ్వుకున్నాడు. తనింతగా చలిస్తున్నాడేం? తన జీవితం తనది. సునీతితో విడదీసుకోలేనంతగా ముడిపడిందా! యెలాగో ఇల్లు చేరాడు. అసలే మనసు బాగా లేదు. రాగానే బీబీ పోస్టు అందించింది. యు.కె. నుండి ఉత్తరముంది. తమకు అందవలసిన సరుకు సమయానికి అందకపోతే మరో కంపెనీతో మాట్లాడుకుంటామని వ్రాశారు. అతని రక్తం సల సల కాగింది. చాలా పౌరు



షంగా ఇకమీదట అలాంటి పొరపాట్లు జరగవని రాశాడు. అది మర్నాడే పోతుందని తెలిసినా, అది బాక్సులో పడ వేయించాకే అతను ఊపిరి పీల్చుకున్నాడు. ఒక విధమైన సంతృప్తితో కూర్చుని పేపర్ తీశాడు. ఫోన్ మ్రోగింది. "హల్లో.... వైజాగ్ నుండి ట్రంక్ కాలా? సంపత్ నే. హల్లో ఏమిటి రాములూ? ఆఁ . మళ్ళీ ఓడ దొరకటం కష్టమా! నో,నో....సరుకు అనుకున్న సమయానికి వెళ్ళి తీరాలి యెంత డబ్బయినా సరే... మీరేం సంకోచించవద్దు...అలాగే. రెండు రోజుల్లో వస్తాను. ఓడ మాత్రం బయలుదేరాలి అంతే...." ఫోన్ పెట్టాడు. అతని మస్తిష్కములో ఆలోచనలు అల్లిబిల్లిగా అల్లుకుంటున్నాయి.

"యెప్పుడొచ్చావు మహాశయా! లేడీస్ క్లబ్బు వారు నాటకం ఆడతారట. నేను వెడుతున్నాను." సీత తలలో, పువ్వులు తురుముకుంటూ వచ్చింది.

"సీతా! మనమే ఓ నాటకం ఆడాలి. లాభం లేదు." పిడికిలి బిగించి, రెండో చేతిలో కొట్టాడు.

"మతి పోయిందా ఏం?" అతన్ని ఆశ్చర్యంగా చూచింది.

"మతి పోవటమా! లేదు బాగా యాక్టివ్‌గా ఉంది. నువ్వు త్వరగా రా."

"నాటకం అంత ముఖ్యమేం కాదు. అసలు విషయమేమిటో చెప్పు" అన్నది.

"నేను మొదట స్నానము చేసి, వేడి కాఫీ తాగాలి. అప్పుడే చెప్పగలను" అతను, బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు. సీత నెమ్మదిగా క్రిందికి దిగింది.

25

మద్రాసులో అధునాతనమైన హోటల్లో ఏర్ కండిషన్డ్ గదిలో తన బల్లముందు కూర్చుని చిన్నగా నవ్వుకున్నాడు సంపత్. తన ప్రణాళికకు ఏ విధమైన భంగం కలుగ కుండా, బొంబాయిలో వైజాకులో నాటకం ముగిసింది. మద్రాసులో ముగిస్తే తన అంచనాకు సరిపడే డబ్బు వస్తుంది. అతను చూపుడు వేలుతో గడ్డం రాసుకుం టుండగా టెలిఫోన్ మ్రోగింది. ఒక్క నిముషం మాట్లాడి ఫోన్ పెట్టేశాడు. ఒక్కసారి లేచి తన సూటు వంక చూసు కున్నాడు. నేవీ బ్లూ చెక్స్ ఉన్న సూటు, దానికి తగిన టై కట్టుకున్నాడు. సూటు బ్రష్‌చేసి, క్రాపు సవరించుకుని ఠీవిగా కూర్చున్నాడు. కాలింగ్ బెల్ మీద పెట్టింది. "కమిన్!" అన్నాడు లేవకుండానే, నల్గురు వ్యక్తులు ఖరీదయిన దుస్తుల్లో ఉన్నవారు ఠీవిగా నడిచి వచ్చారు.

"హల్లో...." అందరితో కరచాలనం చేశాడు. "కూర్చోండి" కుర్చీలు చూపాడు. సంభాషణ ఆంగ్లములోనే జరిగింది.

"మీ ప్రణాళిక, మీ కార్యదర్శి వివ రించారు. కోట్లతో వ్యాపారం! నాకు తలుచుకుంటే భయంగా ఉంది" ఒకతను అన్నాడు. అతని పేరు అశోక్ కుమార్ జైన్!

"మిస్టర్ జైన్! అంత పిరికిగా వ్యాపా రంలో దిగటం కూడా మంచిది కాదు. మీరిక వెళ్ళవచ్చు "

"అదికాదు మిస్టర్ సంపత్! ఓడ నిర్మాణానికి కోట్లు ఖర్చు అవుతుందా అని ఆశ్చర్యపోతున్నాను."

"ఇది కార్గో మాత్రమే. మనం కొనేవి సెకండ్ హేండు ఓడలు. వాటిని పునర్నిర్మి స్తున్నాయి. క్రొత్తవే అయితే బడ్జెట్ ఇంకా పెరుగుతుంది."

"మైగాడ్!" రూపేష్ కుమార్ అరి చాడు.

"మీరేం కంగారు పడకండి రూపేష్ గారూ. నాకు మామూలు పార్టనర్స్ అయితే ఆంధ్రదేశంలోనే దొరుకుతారు. గుండెబలం కలవాడు కావాలి. డబ్బున్న ప్రతివాడు సమర్థుడు కాడు. అసమర్థులతో చేయి కలిపి అథాను పాలు కావటం నా కిష్టం లేదు " అంటుండగానే చెట్టియార్ అడ్డు వచ్చాడు. అతని చెవులకు తళ తళ మెరిసే వజ్రాల అంటుళ్ళున్నాయి. నాల్గు వేళ్ళకు వజ్రపు టుంగరాలున్నాయి. బంగారు చైన్‌తో గడియారం, తెల్లని లుంగీ, షర్టులు ఉన్న అతని నల్లని శరీరం మరింత నల్లగా కనిపిస్తుంది.

"ఎవరి భయాలు వాళ్ళకుంటాయి, అదటుంచు. నా వాటా పదిహేను లక్షలు." అతని మాట పూర్తికానే లేదు కాలింగ్ బెల్ మ్రోగింది.

"కమిన్!"

సీత వచ్చింది. అధునాతనమైన దుస్తుల్లో దివినుండి భువికి వచ్చిన దేవ కన్యలా ఉందామె. అందరి కళ్ళు ఆమె మీదే నిలిచిపోయాయి. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో నుండి ఆమె భుజాలు అందంగా కనిపి స్తున్నాయి.

"సార్ యు. కె. నుండి ట్రంక్ కాల్. యు. కె. బిజినెస్ అసోసియేషన్ ప్రెసిడెంటుగారు మూడు రోజులనుండి ప్రయత్నిస్తున్నారట. కనెక్షన్ ఇవ్వనా!" వినయంగా అడిగింది.



'స్త్రీ గౌరవం'లో రంగనాథ్, జయమాలిని, శారద.

"ష్యూర్ " అతని మాట పూర్తి కాగానే కనెక్షన్ వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ సర్.... సంపత్ షిప్పింగ్ ఏజెన్సీ గురించి విన్నారా . థాంక్స్ ఎలాట్.. మిలియన్ పౌండ్స్ పెట్టటానికి మీరు తయారా మీరు పెట్టరని కాదు. భారతీయులతోనే నా ప్రయత్నం కొనసాగిద్దామని ... ఏమయినా మరొక్కసారి ఆలోచించాలి." అన్నాడు.

ఒక అరవ ఆసామికి ఆంగ్లం అర్థం కాక జైన్ వంక చూచాడు. నీ భాష నాకు రాదని సైగచేశాడు జైన్. చెట్టియార్ విడమరిచి చెప్పాడు.

"లండన్ మీన్స్ యు. కె. బిజినెస్ అసోసియేషన్ తలదూరిస్తే ఇంకేం ఉంది?" జైన్ గొణుక్కున్నాడు. ప్రతి వాడికి డబ్బుంది. దాన్ని రెట్టింపు చేయాలన్న ఆదుర్దా స్పష్టంగా కనబడుతుంది. సంపత్ పెదవులమీద చిన్నగా, సన్నని నవ్వు నాట్యమాడింది. జైన్ ఏదో మాట్లాడాలని ముందుకు వంగాడు.

"సర్ ఎక్స్‌క్యూజ్ మి " బాబు వచ్చాడు.

"హాయ్ బాబూ! ఏం కావాలి?"

"సర్ నిర్లా కంపని నుండి ఏజెంటు వచ్చాడు పంపమంటారా?" వినయంగా అడిగాడు.

"సాయంత్రం రమ్మన కూడదూ!" విసుగ్గా వెనక్కు జారబడ్డాడు.

"ఆ మాట చెప్పాను సార్. అతను మొండివాడు. ఒక్క అయిదు నిముషాలు మీతో మాట్లాడాలని యెంతో ప్రాధేయ పడుతున్నాడు."

"పంపించు " లేచి, ఠీవిగా కూర్చున్నాడు. అందరి ముఖాల్లో ఆదుర్దా స్పష్టంగా కనిపించింది. నిర్లా కంపనీ భారతదేశంలో ఉన్న ధనవంతులలో ఒకరిది. అతనికి,ఈ షిప్పింగ్ ఏజెన్సీతో ఏం పని? ఇతను నౌకా నిర్మాణం సాగిస్తున్నాడని తెలుసా? ఆలోచనలో మునిగి పోయారు. ఓ నడి వయసు ఆసామి వచ్చాడు.

"మార్నింగ్ మిస్టర్ సంపత్..." చెయ్యి చాపాడు. సంపత్ చేయి కలిపాడు.

"మార్నింగ్...." ఇద్దరూ కూర్చు న్నారు. అతను చుట్టూ కలయచూచాడు.

"మీరు చాలా బిజీగా ఉన్నట్టున్నారు. ఒకే ఒక మాట చెబుదామని మా కంపనీ తరఫున వచ్చాను. మీరు పెట్టిన షరతు లన్నీ మాకు అంగీకారమే. ఓ యాభై లక్షలు మా తరఫున వేసుకొమ్మని చెప్ప డానికి వచ్చాను."

"మీ సహకారానికి ధన్యవాదాలు. ఇప్పుడే ఏం చెప్పలేను."

"అలా అంటే యెలా? మా బాస్ మిమ్మల్ని బొంబాయిలో కలుసుకోవాలని ప్రయత్నిస్తే వీలు కాలేదట..."

"సారీ రేపు ఒక సారి ఫోన్ చెయ్యండి."

"ఫోన్ యెందుకు? స్వయంగా నేనే వస్తాను."

వినయంగా నమస్కరించి వెళ్ళి పోయాడు అతను. మిగిలినవారి ముఖంలో ఆందోళనా, ఆరాటం గమనించి సంపత్ చిన్నగా నవ్వుకున్నాడు.

"మిస్టర్ సంపత్ నా దగ్గర యాభై లక్షలు లేవు గాని, మా వాళ్ళందరిని అడిగి అంగీకరించేలా చూస్తాను. వాది పాతిక లక్షల వాటా వేసుకోండి." జైన్ కంగా రుగా అన్నాడు.

"వివరాలన్నీ మా సెక్రెటరీకి ఇచ్చి వెళ్ళండి మిస్టర్ జైన్. మా ప్రతినిధి వచ్చి మాతో వ్యాపారము చేసే వారి పూర్వాపరాలు సేకరిస్తాడు. అప్పుడు గాని ఏ విషయము చెప్పలేను."సంపత్ జవాబు విని అతని ముఖం అప్రసన్నంగా మారింది.

"మేము స్నేహితులమే నని హామీ ఇస్తున్నాను. మమ్మల్ని నమ్మమని చెప్ప టానికి సందేహించను.మళ్ళీ కలుస్తాను." కరచాలనం చేసి జైన్ బయటకు వెళ్ళి పోయాడు.

"అరే వీడు ఓ ఎక్స్ట్రాని వివా హము చేసుకుని, దాన్ని హీరోయిన్‌ను చేయాలని, పది లక్షలు సినిమా తీయటా నికి పాడు చేశాడని విన్నాం, హార్ట్ఎటాక్ వచ్చిందన్నారు. పాతిక లక్షలు యెక్క డివి?" ఆశ్చర్యంగా కళ్ళు వెళ్ళబెట్టాడు చెట్టియార్.

"దొంగతనము చేస్తాడు మనకెందుకు? మన దేశాన్ని పట్టి పీడించే జబ్బులలో ప్రమాదకరమైన జబ్బు యెదుటి వాడిని ఏడ్పించడం! వాడి బాగోగులు చూచి మనము ఏడ్వడం!" సంపత్ కంఠం తీవ్రంగా ఉంది.

"సారీ మిస్టర్ సంపత్ . " సర్దుకుని కూర్చున్నాడు.

"చూడండి చెట్టియార్‌గారూ, యెవ రయినా మీ ముందున్న అవకాశాలు లాక్కుంటే ఏడ్చి గీ పెట్టండి. కాని అవ సరమైన దానికి, అనవసరమైన దానికి అసూయపడి, అంగలార్చి మీ శక్తిని దుర్వినియోగం చెయ్యకండి." అన్నాడు హెచ్చరింపుగా. మళ్ళీ గడియారం చూచు కున్నాడు.

"నాకు సమయము లేదు. సమావేశం రేపటికి వాయిదా వేద్దాం." అన్నాడు లేవబోతూ.

"నో. నో. అయిదు నిమిషాల్లో తేల్చి వేసుకుందాం." చెట్టియార్ కంగారు



పడినట్టు లేచాడు. అంతలో ఫోన్ గణ గణ మ్రోగింది. విసుగ్గా యెత్తాడు.

"హల్లో ఢిల్లీనుండి కాలా ఊఁ . . ఇవ్వండి హల్లో . సంపత్ హియర్ ఎవరూ ప్రయిమ్ మినిస్టర్ పి.ఏ. గారా ఆఁ . ఆఁ గుర్తుంది. పనులు తెమల్లేదు. ఆ తరువాత వచ్చి మీటవుతానని చెప్పండి. ఫార్మాలిటీస్ యెందుకు! డిన్నర్ పార్టీ అరేంజ్ చేశారా? దయచేసి నా సెక్రటరీ దగ్గర అప్పాయింట్ మెంటు తీసుకోండి కనెక్షన్ ఇస్తున్నాను." ముందున్న టెలిఫోన్ బటన్ నొక్కి ఫోన్ పెట్టేశాడు, సంపత్.

"మిస్టర్ సంపత్. మా షేర్ పది హేను లక్షలు" రూపేష్‌కుమార్ చెప్పాడు.

స్ప్రింగ్ డోర్ తోసుకుని వచ్చాడు బాబు.

"ఏమిటి?" కొంచెం విసుక్కున్నట్టుగా కనుబొమలు ముడేశాడు.

"జపాన్ ఎంబసీనుండి మిస్టర్ యోనా వచ్చారు. టైమిచ్చారట "

"ఓ ప్రక్కగదిలో కూర్చుండబెట్టు. నేను వస్తాను."

"అలాగే" అతను వెళ్ళిపోయాడు.

"క్షమించండి. నా సెక్రటరీ బయట ఉన్నది. ఆమెతో మాట్లాడితే, పార్టనర్ షిప్ డీడ్, ఫార్మాలటీస్ అన్నీ వివరిస్తుంది. నా కిప్పుడు టైం లేదు" లేచాడు సంపత్. మిగిలిన వారు కూడా లేచారు.

"సంపత్ భయి మొదట మన వారిని చూడు. విదేశీయులదేముంది, మన తెలివితేటల్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తారు." సంపత్ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు భరించలేకపోయాడు ఇందాక మాట్లాడిన రూపేష్‌కుమార్.

"సీ యూ" సంపత్ ఠీవిగా వెళ్ళి

పోయాడు. మిగిలినవారు, ముందు గదిలోకి వచ్చారు. సీతను చూచాడు. వారికి మతి పోయినట్టుంది. బంగారుబొమ్మనా - లేక గులాబీలు నలిపి చేసినా విగ్రహమా అని సందేహంగా చూచారు ఆమెవంక. వారి మైమరుపుకు నవ్వుకుంది.

"టేక్ యువర్ సీట్ బాబూ! ఏవయినా డ్రింక్స్ తెప్పించు వాట్ కెన్ ఐ డూ ఫర్ యు?" అతి మృదువుగా ప్రశ్నించింది.

"మిస్ ఒక్కమాట అడగనా?" చెట్టియార్ అడిగాడు.

"ష్యూర్ " విలాసంగా కళ్ళు తిప్పింది. అతని గుండె ఝల్లుమంది. ఆమె పెదవులు అప్పుడే విచ్చిన గులాబీ లలా ఉన్నాయి.

"ఎలాగయినా మా వాటా ఉండేలా చూడండి." బ్రతిమాలినట్టు అన్నాడు.

"మన సౌత్ ఇండియన్స్ అంటే నాకు వల్లమాలిన అభిమానం. బాస్‌కు మాత్రం అంతగా గిట్టదు." అన్నది, మెల్లగా. ఆమె పలువరుస తళుక్కుమన్నది. చెట్టి యార్ గుండె లయ తప్పింది.

"మనం, మనం ఒక్కటే మొదట మన సంగతి చూడు మిస్. మీ కష్టం ఉంచుకోను."

కండ్లతోనే అంగీకారము తెలిపింది. అతను సంతోషంగా తలాడించేడు. బాబు డ్రింక్స్ పట్టుకు వచ్చారు.

"థాంక్స్" అని సీత అందుకుని అంద రికి ఇచ్చింది. చెట్టియార్ దగ్గరగా వచ్చింది. ఒకసారి అందరిని చూచి, వినీ, వినపడ నంత మెల్లగా మాట్లాడింది.

"ఒక గంటలో డబ్బురావాలి. అప్పుడు మీది ఫిక్స్ అయినట్టు. బాస్‌కు నచ్చ చెబుతాను." అని ఆమె తన గ్లాసులోని కోకాకోలా రెండు గుటకలు వేసింది.

ఫోన్ మ్రోగింది. ఆమె వయ్యారంగా అందుకుంది. రూపేష్‌కుమార్ ఆమె కళ్ళ వంకే చూస్తున్నాడు.

"యస్. ఒక పదినిమిషాల్లో రావచ్చు. ఇప్పుడే యెలా చెప్పను నేను. వీళ్ళకు కేష్‌గాని, చెక్కుగాని ఇవ్వమంటాను. ఇరవైనాల్గు గంటల్లో లెచ్చారా సరేసరి, లేకపోతే మీరుండనే ఉన్నారు. ఇప్పుడే ధన్యవాదాలు యెందుకు ఉంటాను." ఫోన్ పెట్టేసింది.

"బాబూ! ఇక యెవరొచ్చినా లోపలికి పంపించకు. చెట్టియార్‌గారూ, మీరిక వెళ్ళవచ్చు." అతను లేచాడు. అతడిని లిఫ్ట్‌వరకు సాగనంపింది.

"నా విషయం మిస్ " చెప్ప బోయాడు.


"పదే, పదే చెప్పనవసరం లేదు. ఎక్కువ సమయం కూడా లేదు. కేష్ అందితేనే కన్‌ఫర్మ్ చేస్తాం."

"నేను వెడుతున్నది అందుకేగా." లిఫ్ట్ వచ్చింది. అతను నమస్కరించి వెళ్ళిపోయాడు. వెనుతిరిగేసరికి రూపేష్ కుమార్ నిల్చున్నాడు.

"ఓ మీరా."

"అవును మిస్. అక్కడ ఏకాంతంగా మాట్లాడే అవకాశం లేదని. మీ బాస్‌కు నార్తిండియన్స్‌పై అంతగా నమ్మకం లేదట. మనిషిని, మనిషిగానే చూడాలి. ప్రాంతీయ భేదాలు యెందుకు! మంచి వెనుకే చెడు ఉంటుంది."

సీత కిలకిల నవ్వింది.



"మీరు మంచి ఉపన్యాసకులు అవుతున్నారే? చూడు మిష్టర్ రూపేష్, ఒక్క రోజులో ఒకరి అభిప్రాయాలు మారుస్తామా! ఇప్పుడు అభిప్రాయాలతో పని లేదు. క్యాష్‌తో పని "

"నాకు సాయంత్రంవరకు సమయం ఇవ్వండి."

"రేపటివరకిస్తున్నాను చాలా... వస్తాను" చిన్నగా నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

"ఈమెను రోజా చూడటానికయినా వాటాదారులు చేరాలి." అనుకున్నాడు. అందమైన కనుదోయి, తామర తూడు లాంటి చేతులు అందంగా కదలినట్టు అనిపించింది. చిన్నగా నవ్వుకున్నాడు. ఆలోచిస్తూ లిఫ్ట్ బటన్ నొక్కాడు.

26

సంవత్సరం చూస్తూండగానే గడచిపోయింది.

"చూడు సంపత్, నేను అన్నమాట నిజమయిందా లేదా?" ఆనందంగా, చిన్న పిల్లలా గంతులు వేస్తూ వచ్చింది సీత. టీ సరంజామా సంపత్ ముందు ఉన్నది కాని, అతను ముట్టుకున్న సూచనలు కనిపించలేదు.

"ఏమిటి మళ్ళీ దేవదాసు ఫోజు పెట్టావు!" అతని యెదురుగా కూర్చుంది. అతను కళ్ళెత్తి ఆమెవంక చూచాడు. ఆ చూపుల్లో అభిమానంతో కూడిన జాలి నిండుకుని ఉంది.

"అబ్బబ్బ! నీ కళ్ళ భాష మీ ఆవిడ దగ్గర ప్రదర్శించుగాని. ఈ హడావుడిలో మరిచాను. నీకో ఫియాన్సీ ఉందట కదా!" అన్నది, రెండు కప్పుల్లోకి టీ వంచుతూ.

"ఉండేది ." అన్నాడు ముందున్న పేపర్ చేతిలోకి తీసుకుంటూ. అర్థం కానట్టు, అతన్ని దీక్షగా చూచింది.

"ఆ సంగతి వదిలేయి. 'రగడ' పేపర్ చూచావా?"

"ఓ అయ్యగారి ముఖావానికి అర్థం

తెలిసింది. 'రగడ' చదువుతూ బాధ పడుతున్నావా? మన గురించి కూడా ఏమయినా రాశారా ఏం?" అన్నది పేపర్ చేతిలోకి తీసుకుని. సంపత్ మాట్లాడక టీ కప్పు అందుకున్నాడు.

"ప్రఖ్యాత బిజనెస్ మ్యాన్ గుప్తగారి భార్య రాస క్రీడల రంగుల వర్ణన ." అని చదివి కిల కిల నవ్వింది.

"ప్రఖ్యాత వ్యాపార వేత్త లుంటారన్న మాట."

"సీతా! ప్రతీది నవ్వులాటగా తీసుకోకు. నీగురించి ఇలాంటి ప్రచారం జరిగితే నీ పిల్లల భవిష్యత్తు ఏమిటో ఆలోచించావా?" తీవ్రంగా అడిగాడు.

"సంపత్!" ఆమె ముఖం నల్లబడింది.

"నిన్ను అనుమానించి, వారు వ్రాసిందంతా నిజమని అనటం లేదు సీతా! ఈ విషవలయము నుండి నువ్వు బయట పడాలి. మనకేం తక్కువ చెప్పు! "

"మనకంటున్నావు. వ్యాపారంలో నా వాటా ఉందేమిటి?"

"పరిహాసానికి ఓ హద్దు ఉంటుంది. ఇదంతా నీదే. నా మాట ఒక్కటి వింటావా?"

"తప్పకుండా." మొదట టీ త్రాగమన్నట్టు చూచింది. ఆమె యెంత మొండిదో బాగా తెలుసు. అందుకే టీ త్రాగేశాడు.

"నువ్వూ పిల్లలు ప్రశాంతమైన వాతావరణములో ఉండాలి."

"అదే నేను ఆలోచిస్తున్నాను సంపత్. నీపై పునుండి కూడా నిశ్చింతగా ఉండాలి కదా."

"నన్నేం చెయ్యమంటావో చెప్పు."

"నీకో ఫియాన్సీ ఉండాలి కదూ?"

"ఉండేది." అన్నాడు నిర్లిప్తంగా.

"ఇప్పుడు లేదా?"

"నాకోసం లేనట్టే .."

"ఐసీ! గతం తలుచుకోవటం ఇద్దరికీ అంత మంచిది కాదు సంపత్. ఆ విషయం పోనీ. నీ దగ్గర నే నుండాలన్నా, దూరాన ఉండి రావాలన్నా కూడా సమస్యే. కాబట్టి నువ్వు వివాహం చేసుకుంటే మంచిదని నా అభిప్రాయము," అన్నది.

"వచ్చే నెలలో యు.కె. వెళ్ళాలి. ఆ తరువాత ఆలోచిద్దాం."

"వివాహం చేసుకుని హనీమూన్ ట్రిప్పు వేసుకోకూడదూ?"

"వ్యాపారానికి హనీమూన్‌కు పొత్తు కుదురలేదులే. అయినా రడీమేడ్‌గా అమ్మాయి లున్నారా?"

"యెందుకు లేరూ " ఆమె ఏదో అంటుండగానే ఫోన్ మ్రోగింది గణ గణ మంటూ.

"సంపత్ షిప్పింగ్ కంపనీ ." అవతలి వారు మాట్లాడింతా విన్నాడు. పది నిమిషాలు మాట్లాడి, ముఖం గంభీరంగా మార్చుకుని వచ్చాను. ఇప్పుడు వాళ్ళుంటుంది మదరాసులో. అందుకే సల్‌ట్రీగా ఉన్న వాతావరణము, చమటలతో మరింత వికృతంగా కనిపించింది.

"ఏమయింది సంపత్?"

"వైజాగు వెళ్లాలి.మన కార్గో షిప్పులో నల్లమందు రవాణా అవుతుందని అనుమానంగా ఉందని వార్త."

"గుప్తాగారూ, బాబేగా ఉంది."

"అదే చూడాలి. గుప్తాగారు నమ్మకంగా ఉంటారన్న హామీ లేదుగా."

అతను చరచర బయటకు వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తరువాత వైజాగ్ నుండి వచ్చిన సంపత్‌కు సీత యెదురు వచ్చింది. కూడా ఓ యువతి ఉన్నది.

''హల్లో .'' అని ఆ అమ్మాయి వంక చూచాడు. ఇదివరకు యెక్కడో చూచినట్టు అనిపించింది.

"హల్లో విస్కీ! నువ్వా?"

"చూడు సీతక్కా!"గారాలుపోయింది, ఆ అమ్మాయి.

"రావుగారి కూతురు."

"తెలుసు'' అతను బట్టలు మార్చుకుని వచ్చేసరికి ఆ అమ్మాయి ఫలహారము ప్లేటుతో వచ్చింది

"మద్రాసు యెప్పుడు వచ్చారు?"

"రాత్రి." అన్నది అనవసరంగా సిగ్గుపడుతూ. పార్టీలో చూచిన అమ్మాయికి పోలికే లేదు. సీత 'తయారీ' అనుకుని నవ్వుకున్నాడు.

"ఏమిటీ, మీలో మీరే నవ్వుకుంటున్నారు?" అ అమ్మాయి చనువుగా అడిగింది.

"కొన్ని బయటికి చెప్పలేని అనుభూతులు, యెన్ని రోజు లుంటావు మిస్ విస్కీ!"

ఆమె కళ్ళు ఆనందంతో రెప రెపలాడాయి.

"మీరు యెంత కాల ముండమంటే, అంత కాలం ఉంటాను." అన్నది బొటన వేలుతో నేలను రాస్తూ.

"అయితే ఓ నెల రోజులుండు. సీతకు కాలక్షేపము. నేను యు. కె. వెడుతున్నాను.''

ఆమె ముఖం వెల వెలబోయింది. ఏదో అనబోయే లోపలే గుప్తా వచ్చాడు. అతని ముఖం ఎఱ్ఱగా ఉంది.

"సీతా " గీర గొంతుకతో పిలిచాడు.

"ఏమిటి?" ఆదుర్దాగా వచ్చింది సీత. సంపత్ నింపాదిగా కారప్పూస తింటున్నాడు.

"నీకు నేను కావాలా అతను కావాలా తేల్చేయి." అన్నాడు కోపంగా. సీత ఇద్దరిని మార్చి, మార్చి చూచింది. ఏదో కలహంలా వుందని ఆ అమ్మాయి లేచి వెళ్ళిపోయింది.

"చెప్పు త్వరగా...." అరిచాడు గుప్తా.

(సశేషం)

మినీకథ:

థ్రిల్

శ్యాం-ఒక తరహా మనిషి!

ఒకే తరహాలో-గానుగెద్దులా బ్రతకడమంటే వొప్పని తరహా మనిషి! కొత్తదనం, ఎక్కడ, ఏ, రూపంలో ఉన్నా అనుకరించాలంటాడు. జీవితంలో ఒక విధమైన పులకింత వుండకపోతే లాభం లేదంటాడు. అందుకే కాలేజీ వెలిగించిన రోజుల్లో అనేకరకాల పువ్వుల్ని ఆడిస్తూ, పీడిస్తూ, కాలాన్నేకాక, డబ్బునీ కాల్చేస్తుంటే, శ్యాం తండ్రి మేల్కొని, కొడుకు రోగాన్ని పసిగట్టి, దానికి మందుకోసం తెగ తిరిగి పాతికవేలతో సహా తెచ్చేడు.

ఆ మందు పేరు: రాధ. ఒకానొక ఖామందుగారమ్మాయి. అందమైనదే గాని అంతగా (పట్నాల వెంట పోయి) చదువు కొన్నదేంగాదు. అందం - అలంకరణ ద్వారా బయట పడుతుందని కూడా తెలీని పిచ్చమ్మాయి. ఆడది-యింటికి వెలుగులా, భర్త మనసున అల్లుకొన్న మల్లెమాలలా ఉండాలని ఉవ్విళ్లూరుతుంది.

'ఒక తరహా' శ్యాం కిది పెద్ద న్యూసెన్స్‌గా వుంది. జీవితం ఒక డ్రైనేజి గుంటలో పడిపోయినట్టు ఫీలయ్యాడు.

"అబ్బా! రాధా జీవితం-యింటిలో లేదు. అలా రోడ్ మీదికి వచ్చి చూడు.. లోకంలోని అందం, ఆనందం, కనపడుతుంది.. ఛీ ఛీ. వరి వొంటింటి ఎలుకవు దొరికేవు " అని భర్త ఎత్తి పొడుస్తుంటే ఆమె సుకుమార ఊహలు తల్లడిల్లాయి. మనస్సు చివుక్కుమంటుంటే-పెరటిలోకెళ్ళి భోరున ఏడ్చేది.

"చూడు రాధా . ఆ ప్రక్కింటమ్మాయి లేటెస్ట్ ఫ్యాషన్ నీకోసం తెచ్చాను." -రాధకు తేవడం . బాగుంది. ఆ ప్రక్కింటమ్మాయి పోలికే బాగాలేదు.

"చూడు రాధా ఆ ఎదురింటి కాలేజీ అమ్మాయి జాకెట్ ఎంత స్టయిల్‌గా వుంటుందో అలావుంటే నువ్వూ "

"చూడు రాధా పూలు యిప్పుడిలా పెట్టుకోరు . ఆ ఎదురింటి ... . "

"అబ్బబ్బ . ఎప్పుడూ యిల్లూ యిల్లూ ... ఆ ఓవర్సీస్ భార్య-వచ్చిన సినిమాకెల్లా భర్తను వెంటేసుకుని స్టయిల్‌గా-సో, మనమూ సాయంత్రం— అలా షికార్ హోటల్ భోజనం ఆపై అప్సరలో "కిస్స్ కిస్....కిస్" ఓ-కే..! చూడు, రాధా! మనకు తెలియనంతలో తప్పుకాదు. చూసి నేర్చుకోవాలి."

ఇలా భర్త ప్రతిరోజూ ప్రతిపనిలో ఎవర్నో వొకర్ని పోలిక తెచ్చి తనను కించ పర్చడం రాధకు బాధగా వున్నా, భర్త మనః స్తత్వాన్ని బట్టి నోరు తెరచి, స్వాభిప్రాయాన్ని యివ్వలేక పోయేది.

ఒకనాటి రాత్రి-కవుగలింతల గడియలో .. "చూడు రాధా...." అంటూ శ్యాం ఏదో చెప్పబోయేసరికి-రాధ- "ఆ ఎదురింటమ్మాయి సంగతేనా? యింకేం చూసేను? నిన్న రాత్రి ఎవడ్నో లేపుకొని పోయింది-మెడలో మంగళసూత్రం లేదు గాని, కడుపులో మూన్నెళ్ళ బేబీ వుందట." అంటూ సిగ్గుతో, చిరునవ్వుతో భర్తను అతుక్కుంది.

ఆ తర్వాత రోజుల్లో-శ్యాం ఎదుటి వాళ్ళతో భార్యను పోలిసే ఒట్టు!

సామెతల కథలు

యామిజాల పద్మనాభస్వామి

ఒక పొడుపు కథవంటిది 'అప్రశిఖ'— వ్రాశాను. చదివి ఉంటారు. ఆలాటివి తెలుసుకొనడం కొంత మంచిదే. మేక వన్నె పులులవంటి మిత్రులుంటారు. వారి అఘాయిత్యాలనుంచి తప్పించుకునే తెలివి తేటలతో ఉంటూవుండాలి. ఆలాటి కథలే కాకపోయినా మరొక విధమైనవి నీతిని బోధించేవి సంస్కృత వాఙ్మయంలో చాలా ఉన్నాయి. అప్పుడప్పుడు వాటిని విందు సందడిలో 'గోవిందా' అన్నట్టు రుచి చూపుతూ ఉంటాను. 'ససేమిరా' కూడా ఆలాటిదే. దానిని సందర్భాను సారంగా వ్రాస్తాను. సామెతల కథలు అని పేరుపెట్టి ఏవో న్యాయాలనీ, సాంకేతిక కథలనీ ఏవేవో వ్రాస్తున్నాడు ఇదేం న్యాయం అని పాఠకులలో కొందరికి విసువుపుట్టవచ్చు. లేదా నిరుత్సాహం కావచ్చు. అందుకని సామెతల కథలు ప్రధానంగా యిక వ్రాయడానికి ఆరంభిస్తున్నాను.

'అందరికీ తెద్దునా

కొందరికి తెద్దునా' అని ఒక సామెత. దీనికి సంబంధించి పెద్దలు చెప్పిన కథ వ్రాస్తున్నాను. చదివి సంతోషించండి.

ఇది ప్రశ్న వేస్తున్నట్టుంది కదూ? బజారుకి పిల్లవాణ్ణి పంపిస్తున్నామనుకోండి. ఏవేవో సామాను చిరా వ్రాసి యిస్తాము. దానిలో ఏదేనా అపురూపమైన వస్తువు వుంటుంది. 'ఇది అందరికీ తెచ్చేదా? అంటే యింట్లో ఉన్నవారందరూ దీనిని ఉపయోగిస్తారా? లేక యే యిద్దరు ముగ్గురో ఉపయోగిస్తారా? సమృద్ధిగా తెచ్చేదా? పరిమితంగా తెచ్చేదా?' అని అడగవచ్చు. దానికి వచ్చిన జవాబును బట్టి ఆ వస్తువు తెస్తాడు. అలాగే పై సామెతలో ఎవరో తెచ్చేవారు తెమ్మన్న వార్ని అడుగుతూన్నట్టు మనకి అర్థమౌతూంది. దానికి వచ్చిందీ కథ:—

'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి' అనే సామెత పుట్టించింది భారతం. ఎందుకా సామెత పుట్టింది? భారత కథలో విశేషం ఏమిటి? అంత రుచి దేనినిపట్టి వచ్చింది? అనే ప్రశ్నలు పుట్టవచ్చు. ముందుముందు వచ్చే సామెతలలో సందర్భం చూసి సరిపడే సమాధానాలు చెప్తాను. భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో భారతం ప్రతి గ్రామంలోనూ ప్రచారం పొందు

తూన్న రోజులవి. కృష్ణరాయలు ఆంధ్ర దేశానికి అన్ని విధాలా స్వర్ణయుగం గౌరవం కలిగించిన కాలం. అతనికి యుద్ధములో నిరాఘాటంగా కత్తి నడచినట్టే సాహిత్యములో గంటం నడిచేదని చరిత్ర చెప్తుంది. అతని ఆస్థానములో పేరుపొందిన కవులు, పండితులు, గాయకులు, వైణికులూ ఉండేవారు. దక్షిణాది భాషలకు చెందినవారిలో తెలుగువారికి ఆస్థానములో ఎక్కువ స్థానాలుండేవట! వారిలో అల్లసాని పెద్దన మొదలుగా ఎనిమిది మంది 'అష్టదిగ్గజాలు' అనే ప్రసిద్ధితో మహాకవులుండేవారట! వారిలో కడపటివాడు తెనాలి రామలింగకవి అని అంటారు. కాలాన్నిపట్టి ఈ మహానుభావుడు రాయల ఆస్థానములో లేడని కొందరంటారు. కాని తెనుగునాట అతని కథలకు గల ప్రచారాన్నిబట్టి పై వాదం భగ్నమవుతూంది.

కృష్ణరాయల కాలములో భారతానికి దక్షిణ దేశమందు బాగా ప్రసిద్ధి వచ్చింది. ఊరూరా భారతాన్ని ఒకరు చదువుతూంటే యింకొకరు అర్థం చెప్పుతూ రాత్రి సమయాలలో కులాసాగా కాలక్షేపం చేస్తూ ఉండేవారు.

అలాగుండగా ఆ కాలములో ఢిల్లీని పాలించే మహమ్మదీయ రాజుకి భారతం మొదటినుంచి తుదివరకూ క్షుణ్ణంగా వినాలని కోరిక పుట్టింది. ఆస్థానపండితుల నడిగేడు భారతం చదివి చెప్పవలసిందని. ఆ పండితులలో ఒకడు 'ప్రభూ! దక్షిణ దేశములో కృష్ణదేవరాయల కొలువులో ఉన్న పండితులు భారతం చక్కగా చదివి చెప్తారని వింటున్నాము. ఆ రాజుగారికి తమరు ఒక జాబు వ్రాయించి ఆ పండితులను మన ఆస్థానానికి రప్పిస్తే తమ కోరిక తీరుతుంది'—అని విన్నవించాడు. వెంటనే సుల్తాన్ రాయలవారికి ఒక జాబు వ్రాయించి తమముద్రవేయించి తగిన జవానుల కిచ్చి విజయనగరం పంపించాడు.

రాయలు కొలువులో ఉన్నాడు. సుల్తాన్ భటులు వచ్చి జాబు అందించారు. రాయలా జాబు ప్రధానమంత్రికి యివ్వగా తిమ్మరుసు చదివి 'ప్రభూ! భారతం చెప్పడానికి మన పండితులను పంపవలసింది' అని సుల్తాన్ కోరిక అన్నాడు. 'చాలా సంతోషం. సుల్తాన్ మన పండితులను కోరడం మన సంస్థానానికి సమ్మానంగా భావించాలి. పండితులారా! ఢిల్లీ వెళ్ళి చక్కగాభారతం వినిపించి సమ్మానాలందుకుని రావలసిందని కోరుతున్నాము' అని రాయలనగా అందరూ సంతోషించారు.

ఆ కాలములో విమానాలా? రైళ్లా? బస్సులా? ఉంటే బళ్లు, లేకపోతే కాలినడక

ఆ పండితులలో కొంటె కోణంగి రామలింగం కూడా ఉన్నాడు. అందరూ మజిలీలు చేసి చేసి కొన్నాళ్ళకు ఢిల్లీ పొలిమేరకి వెళ్ళారు. అప్పటికి జాము ప్రొద్దెక్కింది. ప్రక్కనే ఒక పల్లెటూరుంది. కొందరు వెళ్ళి వంటసామాన్లు తెచ్చారు. తెలిసినవారు వంటచేశారు. అందరూ దారి ప్రక్కనున్న అరటితోట నూతివద్ద స్నానంచేసి వచ్చారు. ఇక భోజనాలు తరవాయి. ఒక పండితుడు రామలింగంను చూసి 'రామలింగా! ఆ తోటలోకి వెళ్ళి అరటాకులు తెస్తే భోజనాలు చెయ్యవచ్చు. ఎంత బాగున్నాయో చూడరా!'

అన్నాడు. రామలింగం 'సరే తెస్తానుగాని అందరికీ తెద్దునా? కొందరికి తెద్దునా?' అని అడిగాడు. ఆ పండితుడు నవ్వి "కొందరికి తెస్తే మిగతావాళ్లెలా తింటా రురా! అందరికీ తీసుకురారా! - ఏ పని చెప్పినా కొంటె ప్రశ్న వెయ్యక ఏ పనీ చెయ్యవు. వెళ్లు - త్వరగా రా!' అని అన్నాడు. 'ఇదుగో తెస్తున్నాను' అని రామలింగం తోటకి వెళ్ళి అరటి ఆకులు కోసి లెక్క పెట్టి ఒకటి తక్కువగా తెచ్చాడు. అందరూ ఆకులు వేసుకున్నారు. ఒకటి చాలదు. 'ఏమిరా నీకో' అని ఒక పండితుడడిగాడు. 'నేను తరువాత తింటాను. మీ పని చూసుకోండి' అన్నాడు రామలింగం.

అందరూ అన్నం, కూరా వడ్డించుకుని అరటాకులు చూసి 'జన్మలో యింతవరకు ఇలాటి ప్రశస్తమైన ఆకులు ఎరగం. ఎంత బాగున్నాయయ్యా!' అని మెచ్చు కుంటూ భోజనాలు ముగించి చేతులు కడు క్కుని దారి ప్రక్కనున్న చెట్లకింద కూర్చు న్నారు విశ్రాంతిగా.

అంతలో తోటమాలి వచ్చాడు. పువ్వు లతో, కాయలతో ఉన్న చెట్లు ఇటూ అటూ ధ్వంసమై ఉన్నాయి. ఆకులు కోసిన గుర్తులు కనిపించాయి. ఎవడు చేసిన పని యిది. నేను లేనప్పుడు చేశాడెవడో దుర్మార్గుడు—అని నోటికి వచ్చిన తిట్లు తిట్టుతూ దారి ప్రక్కన చెట్ల కింద కూర్చున్న పండితులను చూసి దగ్గరకు వచ్చి 'ఏమయ్యా! ఆకులు కోశారా?' అని అడిగాడు. వాడి ఆర్భాటం చూసి, ఒక పండితుడు 'మేము కొయ్యలేదు. అదుగో ఆ కుర్రాడు కోశాడు' అని గడుసుగ అన్నాడు రామలింగాన్ని చూపి.

తోటమాలి రామలింగం దగ్గరకు వచ్చి గద్దించి 'ఆకులెందుకు కోశావు నాకు చెప్పకుండా? ఇది నీ తాత వేసిన తోటా?' అని అడిగాడు.

'ఏమో నాకు తెలియదు. భోజనాలు చెయ్యాలి. ఆకులు కోసి తీసుకునిరా అని అన్నారు. వారంతా పెద్దవాళ్ళు. కోసి తెచ్చాను. వాళ్ళకే తెచ్చాను. లెక్కపెట్టి చూడు. నేను ఇంకా భోజనం చెయ్య లేదు' అని రామలింగం నిభావుగా చెప్పాడు.

తోటమాలి పండితుల్ని లెక్కపెట్టి ఆకుల్ని లెక్కపెట్టాడు. సరిపోయింది. తిరిగి వచ్చి 'ఈ కుర్రాడు తిన్నాడా?' అని పండితుల్ని అడిగాడు. 'లేదు'— అన్నారు.

'అయితే ఈ తప్పు మీదే—పాపం! కుర్రాడేం చేస్తాడు. మీ సొంతమా యీ తోట?' అని ఒక్కొక్కరికే పిలకలు కోసేశాడు వరసపెట్టి. 'ఇక నెప్పుడూ యిలాటి చొరవ సెయ్యకండి' అని వెళ్ళి పోయాడు.

అందరూ కుయ్యో మొర్రో అని 'ఏమిట్రా రామలింగం ఈ పని? కొంప ముంచావురా' అన్నారు తలలు తడువు కుంటూ—

'అప్పుడే అడిగాను. అందరికీ తెద్దునా? కొందరికి తెద్దునా? అని. అంద రికీ తెమ్మన్నారు. తెచ్చాను. అయినా ఏం? మంచి పనే జరిగింది. వెళ్లేది నవాబు దర్బారు. దానికి తగినట్టు కుదిరింది మీ వేషం'అని సన్నగా నవ్వాడు రామలింగం.

ఎలా ఉన్నదీ కథ? ★

రైడ్ పార్టీ

— డి. హరినాథ్ రెడ్డి

రైడ్ పార్టీకి అక్కప్ప దొరికిపోయింది.

రైడ్ పార్టీ అంటే పోలీసువారు కాదు; అక్కప్ప రంకుతనం చేసి పట్టు పడనూలేదు.

అక్కప్ప దొంగతనంగా సారా వ్యాపారం చేస్తోంది; చేస్తూ రైడ్ పార్టీకి దొరికిపోయింది. దొంగ సారా పట్టుకున్న రైడ్ పార్టీ దొరగారు వరహాల్రాజు, దొంగ అక్కప్ప!

* * *

వరహాల్రాజు ఎలా ఉంటాడనగా—

ఎత్తుగా, లావుగా, భారీగా, గంభీరంగా —సెవంటీ యమ్. యమ్. స్క్రీన్‌లా వుంటాడు. అతనిగొంతు ఫుల్ స్టెరీఫోనిక్ సౌండులా ఖంగు ఖంగు మంటుంది. అతను నడిస్తే కొండ కదిలినట్టు, ఏనుగు నడుస్తున్నట్టు వుంటుంది. హుందాగా వుంటుంది రీవిగా వుంటుంది.

వరహాల్రాజు నిజంగా వరహాల్రాజే.

అతనికి బోల్డు ఇల్లు, పెద్ద వ్యాపారం చాలా భూములూ వున్నాయి.

తాళికట్టిన పెళ్లాం ఒకత్తేగాని పక్క మీద పడతులు బోల్డుమంది.

ఇరవైఏళ్ళ కిందట ఇరవై ఆరేళ్ళ వరహాల్రాజు వొట్టి వరహాల్రాజు. అప్పుడు రాజుకి చెప్పుకోడానికి ఒక మామ్మ మాత్రం వుండేది. జేబులో చిల్లికానీ వుండేది. కమీజు మీద చిరుగులుండేవి. తలనిండా కురుపులుండేవి. అంచేత వరహాల్రాజు మామ్మ ప్రతినెల వరహాల్రాజుకి గుండు కొట్టించేది. అపుడంతా వరహాల్రాజుని బోడిరాజని పిలిచేవారు. బోడిరాజుకి మామ్మ తప్పించి మరో ఆస్థిలేదు. మరో దిక్కులేదు.

బోడిరాజు మామ్మ దగ్గర మాత్రం మామ్మలాగే పనికిరాని బోల్డు పోరంబోకు భూమివుండేది, ఆ భూమిని ఎవర్నయినా వూరికే, వట్టినే తీసుకోరా బాబ్బాబని బతిమిలాడినా తీసుకోరని బోడిరాజుకి బోడిరాజు మామ్మకీ తెల్సు. అంచేత భూమివున్నా లేనట్టే అనుకున్నారు. ఆ భూమి గురించి పట్టించుకోవడం మానేశారు.

కాని గవర్నమెంటు పట్టించుకుంది. ఆ భూమి ఫ్యాక్టరీ కట్టడానికి చాలా అనువైన అనుకూలమైన స్థలమంది. దాంతో బోడిరాజు, బోడిరాజుమామ్మ తినిపించే వాళ్లకు తినిపించి పైసాకూడా చేయని భూమికి చదరపుగజానికి ఇరవై రూపాయల చొప్పున ఒక లకారంలో సగం లాగడం జరిగింది.



ఆ యాభై వేలు ఒక్కసారిగా చూశ్లేక భరించలేక గుండెలు తిరగబడిపోయి రా అంది మునిలిముండ. శని విరగడయిం దనుకున్నాడు బోడిరాజు—కాదు వేలరాజు. ఫ్యేక్టరీ పెద్దది కావడంవల్ల మిగిలే స్థలానికి మంచి డిమాండు వచ్చింది. వేలరాజు ఆ స్థలానికి ప్లాటులు వేసి చదరపు గజం ముప్ఫయిమూడు రూపాయల చొప్పున అమ్మి వేలరాజుల్లా లక్షలరాజయ్యేడు.

ఈ బిజినెస్ చాలా బాగుందను కున్నాడు. పనికిరాని భూములు ఎక్కడెక్కడివో కొనడం ఆ భూమికి గిరాకీ రావడంతో కొన్న ఖరీదుకి నాలుగైదు రెట్లకి అమ్మడం, భూమిని ప్లాట్లువేసి అమ్మడం, ఇల్లు కట్టి అద్దెకివ్వడం ఈ విధంగా సాగించాడు వ్యాపారం.

వ్యాపారం మూడు పూవులు ఆరు కాయల్లా వుండటం వల్ల అతని అసలు పేరు అతన్ని అడగకుండానే వరహాల్రాజని తెల్సుకొని, వరహాల్రాజుగారిని' కూడా అనలేక భయభక్తులతో బాబుగారనీ అయ్యగారనీ మాత్రమే అనగల్గుతున్నది ప్రజలు.

సరిగ్గా ఆ సమయంలోనే సారాపాట కులుకుతూ వచ్చింది.

దాన్నెందుకు వదిలేయాలా అను కున్నాడు అంతే. స్వాధీనమైపోయింది. ఆ పట్నానికి సారాకాంట్రాక్టు తనే తీసు కున్నాడు.

అప్పణ్నించి, ఆ పట్నంలో ప్రతి ఏడాది వరహాల్రాజుదే పాట. అయిదు లక్షల పాట.

కాని ఈ ఏడాది ఎవడోఏదో పూర్నించి, చాలా దూరంనుంచి, లాభాలు జేబులో నింపుకుందామని వచ్చి పాట అయిదున్నర లక్షలకు పెంచేడు.

ఎవడో కోన్ కిష్కాయ్‌గాడు తన మీద పోటీ వచ్చినందుకు వరహాల్రాజు ఒళ్లు బాగా మండిపోయింది. మండిపోయి ఆరు లక్షలన్నాడు. ఆ దెబ్బతో కోన్ కిష్కాయ్‌గాడు ముఖం వెనక్కి తిప్పి రైలు ఎక్కేశాడు.

ఆ తర్వాత వరహాల్రాజు వచ్చేలాభం దెబ్బతినకుండా వందగ్రాముల సారాకి ఇరవై పైసలు చొప్పున పెంచేడు—జీతాలు పెంచితే ధరలు పెరిగినట్టు.

సారా ఖరీదు పెరిగినా తాగుబోతులు తు. చ. తప్పకుండా తాగుతూనేవున్నారు. వరహాల్రాజు వ్యాపారం సజావుగా సాగు తూనేవుంది.

అయినా పట్నంలో ఎవరూ దొంగ సారా, నాటుసారా, అమ్మకుండా చూడ్డా నికి తనే ఒక 'రైడ్ పార్టీ'ని తయారు చేశాడు వరహాల్రాజు. రైడ్ పార్టీలో వుంటారు వందమంది. వందమందిని పది బేచీలుగా చేశాడు. రోజూ పది బేచీలు పది మూలల కెళ్తాయి. మూలమూలలా గాలిస్తాయి.

రైడ్ పార్టీకి ఎలాంటి యూనిఫారం లేదు. వాళ్ళు ఎవరింట్లోనైనా వెదకొచ్చు. ఎవరమ్మినా పట్టుకోవచ్చు. రైడ్ పార్టీని ఎవరూ ఏమీ అనడానికి వీల్లేదు. ఎవడైనా ఏమైనా అంటే వాడికి భూమ్మీద మరిక నూకలు చెల్లు. పవరులోనున్న వరహాల్రాజు రైడ్ పార్టీకి ఫుల్ పవర్సు ఇచ్చేడు.

రైడ్ పార్టీలో ఒక్కొక్కడి జీతం ఒక్కొక్క వంద. రైడ్‌పార్టీలో వాళ్ళంతా

అవారాగాళ్లు, పచ్చిబేవార్సుగాళ్ళూనూ.

అదీ రైడ్ పార్టీ సంగతి. అదీ వర హాల్రాజు చరిత్ర.

వరహాల్రాజు పరిస్థితులను క్రియేట్ చేయగలడు; ఏ విధంగా కావాలనుకుంటే ఆ విధంగా పరిస్థితులను మార్చగలడు. కాని——

అక్కప్ప పరిస్థితులను క్రియేట్ చేయలేదు; మార్చలేదు. పరిస్థితులే అక్కప్పను అధ్వానంగా క్రియేట్ చేయ గలవు. నీచంగా మార్చగలవు.

* * *

అక్కప్పకు భర్తవున్నంత కాలం ఇల్లు కదలవలసిన పనిగాని పరాయి మగాడివైపు కన్నెత్తి చూడవలసిన అవ సరంగాని లేకపోయింది. భర్త తెచ్చిన జీతం తక్కువైనప్పటికే దానితోనే సర్దుకు పోతూ యింటిని చక్కగా చక్కబెట్టు కునేది.

కాని——

ఆ రోజునుంచి అక్కప్ప జీవితం అంధకార బంధురం అయిపోయింది, అవును.

ఆరోజు——

అక్కప్ప మగ బిడ్డను కన్నది. అక్కప్పకెంతో ఆనందమైపోయింది. వరుసగా తను మూడు సార్లు ఆడపిల్ల లనే కన్నది. కాని మావ (భర్త) మగ పిల్లాడు పుట్టడం లేదని మూడుసార్లు మూతి ముడ్చేసుకున్నాడు. ఈసారి కొడుకు పుట్టాడని వార్తవిని మావ ఎంత మురిసి పోతాడో——అక్కప్ప మురిసిపోయింది ముందు.

కొడుకు పుట్టేడన్న వార్త అక్కప్ప మొగుడికి చేరింది.

అప్పుడతనున్నది వర్కుషాపులో. అప్పుడు సమయం రాత్రి ఏడుంబావు.

ఉదయం ఆరు గంటలకెళ్లిన వాడు ఇంకా పన్జేస్తూనే వున్నాడు——అది ఓవర్ టైముకాదు.

అక్కప్ప మొగుడు కొడుకు పుట్టేడని చెప్పగానే అభినందనలు తెల్పాడు ప్రొప్రయిటర్.

కొడుకును చూసుకోడానికి పర్మిషన్ ఇమ్మంటే ఆగ్రహంతో చిందులు తొక్కేడు ప్రొప్రయిటర్.


"వీల్లేదు, ముందు పని తర్వాత కొడుకు."

"ఈ ఒక్కసారి మాత్రం సార్. సార్ సార్సార్ సార్."

"త్వరగా జాబ్ కంప్లీట్ చేసి త్వరగా వెళ్లిపో. నాకభ్యంతరం లేదు."

కాని ఆ జాబ్ అంత తొందరగా అవ్వదు. అవ్వదని ఆ ప్రొప్రయిటర్‌కి తెల్సు. అక్కప్ప మొగుడికి ఎలాగూ తెల్సు. తెల్సినా తొందరగా చేద్దామని నిశ్చయించుకున్నాడు. మిషన్ మీద కెక్కాడు. ఉదయం ఆరు గంటలనుంచి పన్జేస్తున్నాడేమో బాగా అలిసివున్నాడు. సొలసివున్నాడు. నీరసంగావున్నాడు. అయినా మొండిగా-కొడుకుని, తన వరాల పంటని వెంటనే చూడాలన్న ఆతృతతో గబగబా పన్జేస్తున్నాడు.

చేస్తుండగా కళ్ళు తిరిగాయి. వళ్ళు వశం తప్పింది. మిషన్‌మీద పడి పోయాడు. మిషన్ రాకాసి అతన్ని లాగేసు కుంది. పళ్ళ చక్రాలతో కొరుక్కుతినే



సింది. మిగతా వర్కర్లు రాకాసి బారినుండి లాగి ఆసుపత్రిలో జాయిన్ చేసేలోగా తోవలోనే చచ్చిపోయాడు అక్కప్ప మొగుడు.

కాని, ప్రొప్రయిటర్ అక్కప్ప మొగుడి హృదయ విదారకమైన చావుకి చాలా విచారించి వందరూపాయిలిచ్చేడు-దహన ఖర్చులికి!

కార్మికులు ఒకరోజు జీతం అందరిదీ కలిపి అక్కప్పకు ఇచ్చేరు. అంతకన్నా వాళ్ళేం చేయగలరు.

ఆ మొత్తం మూడు వందలు.

మొగుడుపోయి మూడొందలొచ్చినందుకు మరోమారు నెత్తి బాదుకుంది అక్కప్ప. అలా ఎంతని ఏడుస్తుంది?

నిన్న మొన్నటి వరకు మొగుడూ, తనూ, పిల్లలు.

ఇప్పుడు మూడొందలూ, తనూ, పిల్లలు.

మొగుడు పోయి వచ్చిన మూడొందలు అవి మొగుడుకన్న వేగంగా పోతాయి. అవి పోకముందే పిల్లలకు ఆధారం చేసుకోవాలి. అవును చేసుకోవాలి? ఈ కరువు కాలంలో, ఈ దరిద్ర దేశంలో, మూడొందలు దేనికి సరిపోతుంది? ఎన్ని రోజులొస్తుంది? దేనికీ సరిపోదు; ఎన్ని రోజులోరాదు గాబట్టి కూలి చేద్దామని నిశ్చయించుకుంది. నిశ్చయించుకుంటే సరా! కూలి దొరకొద్దూ?

కూలిపని ఎక్కడా దొరకలేదు.

తన దగ్గర ఏముందని ఇస్తాడు పని? చదువా, సంధ్యా, వయసా, సొగసా, వంపులా, సొంపులా! ఏముందని ఇస్తారు?

ఆఖరికి అంట్లుతోమే పనికూడా దొరకలేదు. ఈ లోపుగా మూడొందల్లో ఎంత జాగ్రత్తగా ఖర్చుపెట్టినా అయిదు పదులు

ఎగిరిపోయాయి.

గుండెలు బాదుకుంది. గుండెలవిసేలా ఏడ్చింది. తనని చావనీయకుండా పిల్లలు రిస్కులో పెట్టినందుకు పిల్లల్ని తిట్టింది. దబాదబా బాదింది. ఆ వెంటనే పిల్లల్ని వాటేసుకొని వలవలా ఏడ్చింది.

అక్కప్ప ఏడుపు చూశ్కేని వూళ్లో వాళ్ళ ఉచిత సలహా—'టీ కొట్టు పెట్టి చూడు'

ఆపదకాలంలో ఎటువంటి బోడి సలహా అయినా బోల్డు ఊరడింపు.

అక్కప్ప టీ కొట్టు పెట్టింది. పెసరెట్లు కూడా చేసింది. ఎవరో దారిన పోయిన దానయ్యే కొనక్కర్లేదు. వూళ్లో వాళ్ళే కొంటే చాలు. కాని వూళ్ళోవాళ్లు సలహా అయితే ఇవ్వగల్గేరుగాని టీలు, పెసరెట్లు కొనలేకపోయేరు. కొందరు మాత్రం దయ తలచి అరువు మాత్రం తీసుకునేవారు.

తర్వాత అరువు పెట్టిన వాళ్ళు రావడం మానేశారు. అక్కప్ప వాళ్ళ దగ్గరకు వెళ్లేది. వెళ్తే గొడవలు తప్పించి డబ్బులు వచ్చేవికావు. అంచేత అతి తొందరలోనే అక్కప్ప టీకొట్టు కుదేల్ అయిపోయింది.

దాంతో మళ్ళీ అక్కప్ప ఏడుపు, రాగాల ఏడుపు, ఏడుపు రాగాలు.

'నా నీ యా పా ర ం సే య లే ను దేవుడోయ్. దేవుడోయ్, దేవుడా!'

అక్కప్ప చేతుల్ని దేవుడివైపు చాపుతోంది. చాపిన చేతుల్తో దభాల్ని నేలను చరుస్తోంది. నేలను చరిచి నెత్తిని బాదుకుంటోంది. బాదుకుంటూ ఏడుస్తోంది. ఏమని ఏడుస్తుందంటే—

"నానీ పిల్లల్ని పో షి ం చ లే ను దేవుడోయ్, దేవుడా, పిల్లల్ని నూతిలో తోసేసి ఆ నూతిలో నానూ పడిపోతాను దేవుడోయ్, దేవుడా, దేవుడా" నన్నూ. నా పిల్లల్ని దిక్కుమాల్నాల్లోగా జేసి, నావు దేవుడోయ్. దేవుడా ఏడ్చి ఏడ్చి ఏడుపు మానేక ఆలోచించింది. ఆలోచిస్తూంటే తళుక్కుమని జ్ఞానోదయమైంది అక్కప్పకు.

"ఏలాగైతేటిం నా పిల్లల్ని పెద్దోళ్ళగ నేత్తాను నాను సావను. నా పిల్లల్ని సావనీయను" అని నిర్ణయించుకొని చెదిరిపోయిన జుత్తుని చేతుల్లోకి తీసుకొని, చుట్టి, కొప్పు ముడిచి, లేచి నించుంది అక్కప్ప.

* * *

అందరికీ ఒకే అందం నచ్చదు. ఆకర్షణకూడా అందరికీ ఒకేలా కన్పించదు. కొందరికి లావుపాటి ఆడవాళ్ళంటే ఇష్టం—మరి కొందరికి సన్నపాటి ఆడవాళ్ళంటే ఇష్టం. ఇంకొందరికి కన్నెపిల్లలంటే ఇష్టం. కాని నాగన్నకు పిల్లల తల్లులంటే ఇష్టం. నాగన్నో పిల్ల కంట్రాక్టరు.

నాగన్నను అక్కప్ప ఆకర్షించింది. అక్కప్పలో ఎక్కడో సెక్సు కనిపించింది. అక్కప్పలో మనకు కన్పించని అందాలు ఏవో నాగన్నకు కనిపించేయి. కంపర మెత్తించేయి. కసిని కల్గించేయి.

అక్కప్ప ఇంటికి నాగన్న రోజూ రాత్రి వస్తున్నాడు. రోజుకో నాలుగైదిస్తున్నాడు. తెల్లగా తెల్లారకముందే చడి చప్పుడు లేకుండా పోతున్నాడు.

అయినా, చీకటైనా చడయింది. చప్పు

డయింది. చడీ చప్పుడు లేకుండా రంకు తనం దాగలేదు సాగలేదు కదా! వూరు మధ్యకెళ్లి సారా కంపులా గుప్‌మంది. అక్కప్పను'ఎలాగోలా'పిల్లల్ని పోషించు కొమ్మని సలహా యిచ్చిన అమ్మలక్కలే అమ్మో! అమ్మో! అని గుండెలు బాదుకున్నారు.'దానికెంత గుండె ధయిర్నం'అని నోళ్లు నొక్కుకున్నారు. 'అంతమంది పిల్లల్ని కనికూడా ఎంత బరితెగించింది' అని ముక్కుమీద వేలేసుకున్నారు. సూటి పోటి మాటలు అక్కప్ప మీదకు విసర నారంభించారు.

అక్కప్పది భరించలేక రంగంలోకి దిగక తప్పలేదు; పురాణం విప్పక తప్ప లేదు.

“అవునే సవుతుల్లారా నాను రంకు దాన్ని.ఏటంతార్రైతే. నాగన్న నామొగుడు. నా వుంచుకున్నాడు, సరిపోనాదా, సాల్దా. ఎందుకిలా ఏడుత్తారు నామీద. ఆడు మీ ఇల్లకు రాకుండా నాఇంటి కొత్తండనా. మీ పక్కల తొంగోకుండా నాపక్కల తొంగుంటుండనా. సెప్పండి మరి, మీరు నిజంగా రంకోరు కాకపోతే నాగన్న పెళ్లాలు ఒవులైనా వుంటే ఆలొచ్చి నాతో మాటాడండి. నేకపోతే నోరు మూసుకు పొండి, పోతారా నేదా?”

అంతా నోరుమూసుకు పోయేరు—కిక్కురు మనకుండా. అక్కప్ప ఎదురుగా ఇక ఆవూసు ఎత్తడం మానేసి, నవ్వుతూ మామూలుగా మాటాడ్డం మొదలెట్టేరు.

అయితే—

అతికొద్ది తక్కువ కాలంలోనే అక్కప్పపై నాగన్న మోజు తీరింది.



కొత్తదనాన్ని కోరే నిర్మాత ఎ. పూర్ణచంద్రరావు తాజాచిత్రం 'రాజు వెడలె'లో చిత్రమైన గెటప్‌లో కన్పిస్తున్న శోభన్‌బాబు.

ఇపుడు నాగన్నకు అక్కప్పలో అందాలు కన్పించడంలేదు. ఆకర్షణ, సెక్సు అంతగా కన్పించడంలేదు. సరిగదా గుడ్డిగా తనే ముసిలిదాని మాయలో పడి పోయాననుకున్నాడు. ఈ లంపటంనుంచి ఎలా తప్పుకోవాలా? అని ఆలోచనలు చేయ నారంభించేడు నాగన్న.

అక్కప్ప తెలివి తక్కువది కాదు. నాగన్న రాకముందే రెండొందల్నీ జాగ్రత్త చేసివుంచింది. ఏ టైము ఎలా వుంటుందా?

రంకు మొగుళ్లు ఎప్పుడూ స్థిరంగా వుండరని అక్కప్ప ఎప్పుడో గ్రహిం

చింది. నాగన్న తనని విడిచేస్తే అక్కప్ప భయమల్లా వాంఛలూ, కోరికలూ, కోకలూ ఇక వుండవనికాదు. తన ఒళ్ళేమి కొవ్వెక్కలేదు, కోరికలేపుడో చచ్చిసేయి. కోకలు . ముష్టి కోకలు మీద ఇంకా మోజా! కాని పిల్లలు పచ్చులై పోతారు. అనాదులై పోతారు.

"ఇక వుంచుకోను" అనుకొనేవాడు ఎలానూ వుంచుకోడు. ఇంకా వుంచుకో అంటే—మరీ మొండిగా ముందే పారి పోతాడు. అంచేత ఉండమని ప్రాధేయపడి బ్రతిమిలాడ్డం అనవసరం అనుకుంది అక్కప్ప.

కాని తన పిల్లలు బతకటానికి, పిల్లలు కోసం తను బతకటానికి ఏదో దారి మాత్రం చూపించమంది అక్కప్ప అంత కన్నా మరేమి అనలేదు. దాచుకొన్న రెండొందలు కూడా చూపించింది.

ఆలోచించాడు నాగన్న బాగానే వుందనుకున్నాడు నాగన్న. జీడిబంకలా ఎల్లకాలం అంటుకోకుండా, పరువు బజారు కెక్కించకుండా అక్కప్ప ఇంత వేగంగా వదిలేస్తే ఎంత హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చును కున్నాడు. అక్కప్ప చూపించమన్న దారికోసం ఆలోచించేడు.

ఆలోచించాడు దారి.

ఆ కొండ పక్కనుంచి .చెట్ల మధ్య నుంచి .... తుప్పల్లోంచి, రాళ్ళరప్పల మీంచి. . పదిమైళ్ళ పొడవున దారి. ఆ పది మైళ్ళ దారి దాటేక . .అక్కడ చిన్న వూరు పక్కన చేలు. . .చేలో బట్టీలు సారా బట్టీలు దొంగసారా బట్టీలు, అక్కడ దొంగతనంగా నాటుసారా వండు తారు. ఆ వండిన సారాని కొందరు దొంగ చాటుగా కొంటారు. కొని బస్తీలో, పెద్ద పల్లెల్లో లాభానికి అమ్ముతారు.

అదే నాగన్న అక్కప్పకు చూపించిన దారి. నాగన్నకి పిల్ల (కాంట్రాక్టులు చేయకముందు, గవర్నమెంటు సారా రాకముందు సారా వ్యాపారం చేసే అను భవం వుంది)

అక్కప్ప ఆ వూరు వెళ్లి దొంగసారా కొంటోంది. కొని తీసుకువచ్చి దొంగ చాటుగా ఇంట్లో అమ్ముతోంది. నాగన్న అక్కప్ప సారాకి కస్టమర్నికూడా చూపించేడు.

"మావా! నీమేలు జనమజనమలకీ మరిసిపోలేనంది"—అక్కప్ప.

నాగన్నమటుకు అక్కప్పను మర్చి పోయేడు. మరికరావడం మానేసేడు. తాగు బోతుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. ఎందుకు పెరగదూ? అక్కప్ప సారా గవర్నమెంటు సారాకన్నా ఘాటు. గొప్ప నిషా. భలే చౌక.

దొంగతనం కూడా కష్టమైన పనే. కష్టం సగం చెమటకారిస్తే, భయం సగం చెమట కారుస్తుంది, చెమటలు ముచ్చె మటలు కక్కుతూ అక్కప్ప మూడ్రోజుల కొకసారి సారా పట్టుకొస్తుంది

పది మైళ్ళ దూరం. ఆ దూరమంతా కోక గోచికట్టుకట్టి పరుగులాంటి నడక . బయల్దేరేది అర్ధరాత్రి. ఇంటికి చేరేది వేకువజాము. వచ్చే తోవంతా భయం కరంగా వుంటుంది. చిట్ట చీకటి, దారి దారంతా రాళ్ళు రప్పలూ, ముల్లులూ, తుప్పలూ, పాములూ, నక్కల ఈలలూ

దట్టమైన చెట్లూ, భీకర నిశ్శబ్దం .. అయితే వీటివల్ల అక్కప్పకేం భయం లేదు. ఆమె భయమంతా వరహాల్రాజు రైడ్ పార్టీ వల్లే. అక్కప్ప తోవ తోవంతా ప్రతిరాయి, ప్రతిచెట్టూ, ప్రతి కొండా వరహాల్రాజునే భ్రమచెందుతుంది. ప్రతి చిన్న చప్పుడుకీ రైడ్ పార్టీయనే భయపడుతుంది.

ఇంటికి చేరేవరకూ భయం. ఇంటికి చేరినా భయం. ఇంట్లో సారాచెల్లుబడి అయి పోయేవరకూ భయంభయం. చెల్లుబడి అయి పోయేక హమ్మయ్య అనుకుందా మను కుంటే మళ్ళీ నెత్తిన మూట-పొత్తికడుపు కింద చుట్టుకున్న పాములు. దాంతో మళ్ళీ భయం, పిల్లల డొక్కలు నిండడంకోసం. ఇలా బతుకంతా భయం. భయంతో ఈడ్చ వల్సివస్తోంది. అక్కప్ప భయం పోడానికి సారాకూడా సేవిస్తోంది. రైడ్ పార్టీకి దొరకగూడదని రోజూ ఏడుకొండలవాణ్ని కూడా సేవిస్తోంది.

ఒకరోజు నాలుగురోజులు వారం పది రోజులు నెల రెండు....మూడు నాలుగు నెలలయినా కాలేదు. అంతలోనే కారుచీకట్లు కమ్ముతున్నాయి. గుడ్డి వెన్నెల కాస్తా హరించుకు పోయింది. మేఘాలు ఘర్జించేయి. పిడుగులు పడ్డాలు. వడగళ్ళు రాలేయి. ఉరుములు ఉరిమేయి. అక్కప్ప యిల్లు కుప్పలా కూలిపోయింది. పిల్లలు కేర్‌మన్నారు. అక్కప్ప బావురుమంది.

అక్కప్ప సారా ట్యూబులు రైడ్ పార్టీకి దొరికిపోయింది. అక్కప్ప, అక్కప్ప పిల్లలూ వరహాల్రాజుకి చిక్కి పోయేరు.

* * *



సారాకొట్టు తాలూకా ఆఫీసు. గోడ వారగా కుర్చీ. కుర్చీలో అతి ప్రసన్న వదనంతో వరహాల్రాజు. ఎదురుగా నించొని అక్కప్ప. అక్కప్ప చుట్టూ కోడి పిల్లల్లా అక్కప్ప పిల్లలు. తల్లి బ్రతి మాలుతోంది. పిల్లలు ఏడుస్తున్నారు.

ముందుగా అక్కప్ప సారా ట్యూబుని రైడ్ పార్టీవారు కస్‌కస్‌మని కోసేరు— కాదు వరహాల్రాజు కోయించేడు - కాదు కాదు, అక్కప్ప కడుపుని వరహాల్రాజు కోసేసేడు. ముక్క ముక్కలైన సారా ట్యూబుని రోడ్డుమీద పడేశారు.

వరహాల్రాజు అక్కప్పను తిట్టలేదు. 'నీవు చేసింది తప్పు అనికూడా అనలేదు. పిల్లల ఏడుపు ముఖాలవైపు చూపు తిప్ప లేదు. అక్కప్ప ప్రార్థనలను పట్టించు కోవడంలేదు. కాని అతనికి తెగ చిరాగ్గా వుంది. ఆమె ఏడుపు అతన్ని విసిగిస్తోంది. ఆఫ్టరాల్ అక్కప్పతో తను యింత టైము వృధాచేయడం తనని తనే అవమానం

చేసుకోవడం అనుకున్నాడు. వెంటనే వెను వెంటనే తేల్చేయాలనుకున్నాడు.

అంచేత ఒకే ఒకమాట అన్నాడు. 'జరిమానా మూడొందలు కట్టేసిపో'?

-అమ్మో! మూడొందలే! తను ఎక్కణ్ణుంచి తేగలదు?

"నాకాడ డబ్బు లేదుబాబు, వుంటే ఈపాడు బతుకు ఎందుకు బతుకుతాను బాబు. తల్లి మాలచ్మి పమానంగా సెబుతున్నా బాబు. నాకడ దమ్మిడీకూడాలేదు. వున్న డబ్బంతా సారాకే మదుపెట్టేసినాను. ఈ పేద్దాని కనికరించి వొదిలేయ్ బాబు. నాయిన్నాయినా. చచ్చి నీ కడుపున పుడతా.

బాబ్బాబభయ్య.

బాబ్బాబు. నీకాళ్ళొట్టుకుంటాను బాబ్బా బాబ్బాబు

లాభం లేదు.

ఆఖరి సారి.

కట్టుకుంటావా, లేదా?

మరిక లాభంలేదు.

వరహాల్రాజు నిట్టూర్చేడు చిన్నగా. ఫోన్ చేసేడు నెమ్మదిగా. వెంటనే ప్రొహిబిషన్ పోలీసు వ్యాను వచ్చింది. వచ్చి అక్కప్పను తీసుకుపోయింది.

తర్వాత ఏమి జరిగింది. మామూలే కష్టడీ, కోర్టు, జైలు.

చీకటి కొట్లో అక్కప్ప. వల్లకాట్లో అక్కప్ప మొగుడు.

చీకటి యింట్లో బిక్కుబిక్కు మంటూ అక్కప్ప పిల్లలు.

కొట్లోను, వల్లకాట్లోనూ, ఇంట్లోనే కాదు చీకటి సారాకొట్టు దగ్గరకూడా చీకటిగానే వుంది.

అవును చీకటిగావుంది. సారాకొట్టు కెదురుగా లారీ వుంది. లారీనిండా గడ్డి వుంది. లారీలోంచి ఎంత లాగినా ద్రౌపది చీరలా వస్తూనేవుంది గడ్డి. గడ్డి పూర్తిగా తీసేయగానే డ్రమ్ములు! డ్రమ్ములు!

సారాకంపు గుప్ గుప్ మంటూ ముక్కుల్ని పిండేస్తోంది.

ఆ డ్రమ్ముల్లో సారా చట్ట ప్రకారంగా గవర్నమెంటు ఇచ్చిన కోటాకాదు. చాటు చాటుగా రప్పిస్తున్న దొంగ సారా ఆ డ్రమ్ముల్లో సారా. ఆ లారీ (కాకుంటే అటువంటి మరో లారీ) రావడం రోజూ జరుగుతోంది. (ఇలాంటి కల్తీ సారాలే మనుష్యుల్ని చంపేయడం, అంగ వైకల్యాది వ్యాధులు కల్గించడం తరుచూ మనం పేపరో చూస్తున్నదే)

లారీలో కూర్చున్న ఆసామి చేతుల్లోకి.

కిందనున్న వరహాల్రాజు చేతుల్లోంచి నోట్లు, నోట్లు రూపాయల నోట్లు.

నోట్లు సరసర చప్పుడు ముగిసింది.

డ్రమ్ములు కొట్లో కెళ్ళేయి.

ఆ తర్వాత—

వరహాల్రాజు ఇంటికెళ్ళి హంసతూలికా తల్పం మీద మత్తుగా తాగి పడుకున్నాడు. కాని నిద్ర సరిగ్గా పట్టడంలేదు. ఈ మధ్య రోజూ ఇలాగే అవస్థగా వుంది. అదేం జబ్బుకాదు. ఇపుడిపుడే దేశంలో సమ సమాజం కోసం ప్రజ్వరిల్లుతున్న విప్లవాత్మక పరిణామాల ప్రచండదాడికి తన ప్రాణం, తన ప్రాపర్టీ ఆహుతి అయిపోవుగదా అనే సహజమైన భయంవల్ల వరహాల్రాజుకి నిద్రపట్టని మాట నిజం. ★



'సెక్రటరీ'లో అక్కినేని నాగేశ్వరరావు, వాణిశ్రీ

కొన్నాడు. యువనిర్మాత అశ్వనీదత్ వైజయంతీ మూవీస్ పతాకం క్రింద నిర్మించిన "ఎదురులేని మనిషి" నూరు రోజులు ప్రదర్శింపబడటం ద్వారా, ఖరీదయిన హోటల్ చోళా (మద్రాసు)లో చక్కగా నిర్వహించబడింది నూర్రోజుల పండుగ. ప్రముఖ నిర్మాత, ఎన్. టి. రామారావు సోదరుడు త్రివిక్రమరావు మెమోంటోస్ అందించారు యీ చిత్రంలోని నటీ నటులకూ, సాంకేతిక నిపుణులకూ. డా॥ దాశరథి, ఈచిత్ర నాయకుడు ఎన్. టి. రామారావు ఆ చిత్రం విజయవంతం కావడం గురించి తమ సంతోషం వ్యక్తపరుస్తూ నిర్మాతను అభినందిస్తూ ఉపన్యసించారు.

నవ్వుకొంటూ ప్రేమను చూడండి!

శ్రీ శ్రీనివాసా ఏజన్సీస్ నిర్మించే "ప్రేమాయణం" మిమ్మల్ని నవ్విస్తూ అందమైన ప్రేమ కథను చెబుతుంది. (మళ్ళీ మళ్ళీ చెబుతున్నందుకు మన్నించాలి—మీరీ కధను చదివారుగా అదేనండీ 'జ్యోతి నవలానుబంధం'లో పోలాప్రగడ సత్యనారాయణమూర్తి నవల ప్రేమాయణం చదవలేదూ మీరు!) నవ్వుల రసవల్లరిగా తయారైన యీ చిత్రంలో రావుగోపాలరావు రంగస్థల నటుడిగా అభినయంలో అనేక పాత్రలు ప్రత్యేకాకర్షణగా ఉంటాయి. చంద్రమోహన్, హేమాచౌదరి, రాజబాబు, రోజారమణి, నారాయణరావు, గిరిజా



జగపతి ఫిలింస్ 'దశావతారాలు'లో రవికుమార్, జయచిత్ర

రాణి ఈ చిత్రంలోని మూడు ప్రేమ జంటలు, అల్లురామలింగయ్య, మాడా కూడా నటించిన యీ చిత్రాన్ని ముప్పల నేని శేషగిరిరావు నిర్మించారు. దర్శకుడు పెండ్యాల నాగాంజనేయులు.

పద్నాలుగయింది!

త్వరలో విడుదల కాబోయే "అల్లు డొచ్చాడు" చిత్రం పి. ఏ. పి. సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందించే పద్నాలుగో చిత్రం. విజయవంతమైన చిత్రాలు నిర్మించే సంస్థగా పేరొందిన ఈ సంస్థ అధినేత ఎ. వి. సుబ్బారావు. దర్శకుడు ప్రత్యగాత్మకీ సంస్థ కొత్తది కాదు. హిట్ చిత్రాలు భార్యాభర్తలు, కులగోత్రాలు, పునర్జన్మ, పల్లెటూరి బావ మొదలైన వాటికి దర్శకత్వం నిర్వహించారు. ప్రత్య గాత్మ దర్శకత్వంలో తయారయిన అల్లు డొచ్చాడులో రామకృష్ణ, జయసుధ, రాజ లింగయ్య, కృష్ణకుమారి, గోకిన రామా రావు, జయమాలిని నటించారు. గణేష్ పాత్రో మాటలు గల యీ చిత్రానికి టి. చలపతిరావు సంగీత దర్శకుడు.

బి. ఎన్. రెడ్డి, విద్వాన్ విశ్వంలకు సన్మానం

మద్రాసులోని సాంస్కృతిక సంస్థ కళావాహిని తెలుగు సంవత్సరాది రోజు తెలుగుజాతి గర్వించదగ్గ ఇద్దరు ప్రము ఖులను సన్మానించి సత్కరించింది. చలన చిత్ర దర్శకుడుగా అఖిలభారత ఖ్యాతి గాంచిన బి. ఎన్. రెడ్డినీ, రచయితగా, విమర్శకుడుగా, పత్రికా సంపాదకుడిగా సాహిత్యసేవచేస్తున్న విద్వాన్ విశ్వంనూ ఆ సంస్థ సన్మానించిందా రోజు. జస్టిస్ కృష్ణస్వామిరెడ్డి అధ్యక్షత వహించిన ఆ సభలో ప్రముఖ రచయిత ఇచ్ఛాపురపు జగన్నాధరావు ఉపన్యసించారు. కళా

రావు స్వాగతోపన్యాసం గావించారు. కళా వాహిని సెక్రటరీ బాబు, మెంబర్ ఇన్ ఛార్జి సి. మోహనరావు సన్మాన పత్రాలు చదివి వినిపించారు. సన్మాన కార్యక్రమం పిమ్మట శ్రీ కాళహస్తీశ్వర మహత్యం నాటకం ప్రదర్శించబడింది.

ఐకమత్యమే అన్నిటికీ మందు!

గ్రామసీమలు సుఖశాంతులతో మన గలగాలంటే, ఊరిపెద్దల మధ్య ఐక మత్యం వుండాలి. అదే ఇప్పటి గ్రామా లను పీడిస్తున్న అశాంతి వ్యాధికి మందు. 'మనఊరికథ' చిత్రానికి ప్రధాన కథాంశం ఇది. సాహిత్య అకాడెమీ బహుమతి పొందిన నవల 'నల్లరేగడి' (పాలగుమ్మి పద్మరాజు రచన) ఆధారంగా రంగుల్లో నిర్మించబడిన ఈ చిత్రంలో కృష్ణ, జయ ప్రద, రోజారమణి, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, గిరిజా రాణి, రాజేశ్వరి మొదలైనవారు నటిం చారు. రంజిత్‌కుమార్ సమర్పించే ఈ చిత్రాన్ని కె. హేమాంబరధరరావు దర్శ కత్వంలో కె. రామచంద్రరావు నిర్మిం చారు.

విద్యార్థి సమస్య

ఉత్సాహం నిండి, భవిష్యత్‌వైపు దృష్టిసారించే విద్యార్థి శక్తి సరైనదారిలో పయనం చేయకపోతే వ్యక్తిగతంగా వారికేగాక మొత్తం దేశ భవిష్యత్తుకే భంగం వాటిల్లుతుంది. ఈ తరం విద్యార్థి, విద్యార్థినుల అభిరుచులు, అలవాట్లు ఎలా ఉంటున్నాయి. వాటి పరిణామాలెలా రూపొందుతాయి అన్న సమస్య ప్రధా నంగా అనంతలక్ష్మి కంబైన్స్ 'ఈ కాలపు పిల్లలు' చిత్రం నిర్మించింది. త్వర లోనే మీరు చూడబోయే యీ చిత్రంలో

'దేవదాస్, ప్రభ, శ్రీదేవి, జి. వరలక్ష్మి, పి. ఆర్. వరలక్ష్మి, జ్యోతిలక్ష్మి, జయ మాలిని ప్రధాన పాత్రలలో కన్పిస్తారు. లక్ష్మీదీపక్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించింది దగ్గుపాటి భాస్కరరావు.

ఖరీదైన జానపదం

ప్రముఖ నిర్మాత ఎం. ఎస్. రెడ్డి రసవత్తరమైన ఓ జానపద కథకు చిత్ర రూపం కల్పించారు. అధిక వ్యయంతో అత్యంతాకర్షణీయంగా రూపొందించబడిన ఈ నవరసభరిత చిత్రానికి స్క్రీన్‌ప్లే,కథ, మాటలు, పాటలు 'మల్లెమాల' సమ కూర్చారు. వాణిశ్రీ ద్విపాత్రాభినయ ప్రత్యేకత కలిగిన 'ఈ చిత్రంలో రామ కృష్ణ, రంగనాథ్, చంద్రమోహన్, శ్రీధర్ మొదలైనవారు నటించారు. దర్శ కత్వం కె. యస్. ఆర్. దాస్. 'సూటిగా హృదయానికి గుచ్చుకుపోయే రంగుల ప్రశ్నల పత్రంగా' అభివర్ణింపబడిన యీ చిత్రం త్వరలోనే విడుదల కాబో తోంది.

సిరి సిరి మువ్వ-పుట్టిన రోజు!

గీతా కృష్ణా కంబైన్స్ నిర్మించే 'సిరి సిరి మువ్వ' చిత్రం తూర్పు గోదావరి జిల్లా పసలపూడిలో షూటింగు జరుపు కొంటూంది. ఆ చిత్రంలో కథానాయిక జయప్రద పుట్టిన రోజు - ఏప్రియల్ మూడు. ఆ చిత్ర నిర్మాతలు, యూనిట్ ఔట్‌డోర్ లోకేషన్‌లో పుట్టిన రోజు వేడుకలు జరిపి వర్ధమాన అందాల తార జయప్రదకు 'హాపీ బర్త్‌డే' చెప్పారు. ఆ చిత్ర దర్శకులు కె. విశ్వనాథ్, నిర్మాతలూ తదితర యూనిట్ సభ్యులకు జయప్రద

తెలుగు తెరకు

శ్రీధర్



'తల్లా-పెళ్లామా' చిత్రంతో ప్రారంభమయిన శ్రీధర్ సినీ నట జీవితం ఒక తిన్ననైన ప్రగతి గ్రాపు. చిన్నవేషాలు వేస్తూన్న తరుణంలో పెద్దవేషాలకు నిర్మాతలు ఇతనివైపు చూసేలా చేసింది 'రైతుబిడ్డ' చిత్రంలోని బి. డి. ఓ. పాత్ర. కథానాయకుడి పాత్రలో కాకపోయినా ముఖ్యమైన పాత్రలెన్నో నటిస్తూ అవకాశమొచ్చినప్పుడు హీరో పాత్రలూ ధరిస్తూ వచ్చాడు. హీరోగా నటించిన రెండు

చక, తాను 'కథానాయకుడి' స్థానాన్ని చేరుకోలేనా అన్న నిరాశ ఆవరించే పరిస్థితులలో, 'షాట్ ఇన్ ది ఆర్మ్' లాగా వచ్చింది, ముత్యాల ముగ్గులో హీరో అవకాశం. ముత్యాలముగ్గు చిత్రం అఖండ విజయం సాధించింది. శ్రీధర్‌ను హీరోగా ఆంధ్రదేశం ఆదరించింది. అయినా 'హీరో' గానే నటించాలన్న నియమం పెట్టుకోక నటుడిగా మంచి పాత్ర ఏదైనా సరే నటించాలన్న సూత్రానికి కట్టుబడిన ఈ నటుడి 'చేతిలో' ఇప్పుడు ఇరవై చిత్రాలున్నాయి. నటుడు కాకముందు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేసిన శ్రీధర్‌కు నాటకానుభవం పుష్కలంగా ఉంది. నాటకాలలో నటనకు బహుమతులూ గెలిచాడు. నటుడిగా విజయం తలకెక్కి దురలవాట్ల వైపు మొగ్గక తీరిక సమయంలో సిగిరెట్లు (తనకున్న 'ఒకేఒక మంచిదికాని' అలవాటు) కాల్చుకొంటూ, స్నేహితులతో కబుర్లు పంచుకొంటూ కాలం గడుపుతుంటాడీ నటుడు. 'నటుడినయ్యే ప్రయత్నంలో ఏ క్షణానా 'ఫ్రస్ట్రేటెడ్'గా లేను నేను. చేసిన ప్రయత్నానికి లభించే ఫలితం ఎలాంటిదైనా ఒకేరకమైన స్థిరత్వంతో అందుకోగలిగిన నిండుకుండ శ్రీధర్. తెలుగు చలనచిత్ర కళామతల్లికి సేవచేస్తూ హాయిగా కాలాన్ని భోం

నూతన తరం

జయలక్ష్మి



'మా నాన్న సినిమా పరిశ్రమలోని వ్యక్తే (జయలక్ష్మి తండ్రి జి.ఆర్. రెడ్డి దాదాపు 25 సంవత్సరాలుగా సినిమా ప్రపంచంతో సంబంధం కలిగిన వ్యక్తి. ఆయన 'అందరూ మంచివారే' చిత్రానికి మాటలు కూడా రాశారు.) అయినా నాకు నటి కావాలన్న కోరిక చిన్నతనంనుంచీ లేదు. నిజానికి ఆయన మమ్మల్ని షూటింగులకు కూడా తీసికెళ్ళేవారు కాదు' అంది స్వర్గం - నరకం తార జయలక్ష్మి. పదేళ్ళప్రాయంలో 'బంగారు పంజరం' లో అనుకోకుండా వేసిన వేషం ఆమెలో నటి కావాలన్న కోర్కెకు బీజం వేసింది. అప్పటికీ నటి జయలక్ష్మి కాదు. నీరజ. నీరజగా కొన్ని చిత్రాలలో నటించాక దాసరి దర్శకత్వంలో కొత్త తారలతో నిర్మించబడ్డ స్వర్గం-నరకం చిత్రంతో నటిగా చక్కని గుర్తింపు పొందింది తెలుగు ప్రేక్షకుల దగ్గర. అయితే తమిళంలో, ఇప్పుడు తెలుగు 'అంతులేని కథ' చిత్రంలోని పాత్ర జయలక్ష్మికి గొప్ప గుర్తింపు తెచ్చింది. తమిళంలో అంతులేని కథ మాతృక విడుదలయ్యాక యీ నటిని 'ఫటాఫట్ జయలక్ష్మి' గానే వ్యవహరిస్తున్నారు. అంతటి ప్రాచుర్యం పొందింది ఆ పాత్ర ద్వారా. ఇంకా 'టీనేజ్' లోనే వున్న యీ తారకు క్షణాలమీద తారాపథాన్నధిరోహించాలన్న భ్రమలు లేవు. 'నటినయ్యాను. కృషి చేస్తున్నాను. ఎంతో ఉన్నతస్థాయికి చేరాలన్న కోరిక ఉండటం చాలా గొప్పదాన్నైపోయానని భావించడం లేదు' అన్నది జయలక్ష్మి తన భవిష్యత్ ఎలా ఊహించుకొంటున్నారని అడిగితే. తెలుగు, తమిళ భాషలలోనేగాక మళయాళంలోకూడా నటించిన ఈ తార ఇప్పుడు 'స్వర్గం-నరకం' కన్నడ పునర్నిర్మాణంలోకూడా నటిస్తోంది. జ్యోతి, మంచిని పెంచాలి. లంబాడోళ్ళ రాందాసు, ముత్తయిదువు మొదలయిన చిత్రాలలో నటిస్తోందిప్పుడు. అక్కినేని నాగేశ్వరరావుకూ, సావిత్రికీ చిన్నతనంనుంచీ అభిమాని. 'సావిత్రిగారిలా నటించ గలిగితే అంతకన్న గొప్పేముంటుంది' అందీ పెద్దలను గౌరవించే వర్ధమాన తార.

"నటనకూ, నటనా జీవితానికీ సంబంధించని అనవసరపు 'కాంట్రవర్శీ'లో పడవేయకుండా, తన నటనపై విమర్శనూ, సలహాలనూ సంతోషంగా స్వీకరించగలను" అన్న జయలక్ష్మి 'విమర్శ కూడా నటిగా నా భవిష్యత్తుకు ఉపయోగకరమే కదండీ' అని కూడా అంది.

ఉత్తరాలు

ఈ నెల జ్యోతిలో వాణిశ్రీగారి 'మాయ మనసులు' కథ చాలా బాగున్నది. రచయిత్రి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవిగారి 'సత్యం శివం సుందరం' సీరియల్ ఆరంభంలోనే చాలా ఇంటరెస్టుగా ఉన్నది.

—యస్. కె. బషీర్, కావలి.

మాయ మనసులు అన్న కథ పాత కథల మాదిరిగానే ఉంది. ఏమంత కొత్త పెంపోలేదు. మిగిలిన కథలు బాగానే వున్నాయి. అన్నిటిలోకీ బాగా ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవిగారి క్రొత్త సీరియల్ "సత్యం శివం సుందరం" రచన నాకెంతో బాగా నచ్చింది. ఆ తరువాయి కథ గురించే మే నెల సంచిక కొరకు ఎదురు చూస్తుంటాను.

—యం. విజయకుమార్, వరంగల్.

క్రొత్త సీరియల్ "సత్యం శివం సుందరం" మొదటి భాగమే చాలా ఆసక్తి కలిగించింది. 'ఐ బెగ్ యువర్ పార్డన్' 'మాయ మనసులు' కథలు బాగున్నాయి.

కార్టూన్స్ కడుపుబ్బ నవ్వించేటట్లుగా గలవు. సినిమాలో హాలీవుడ్ నాడు నేడు ప్రచురించినందులకు ఎడిటర్‌గార్కి చాలా థాంక్స్. ప్రతినెలా జ్యోతి ఇదేవిధంగా రావలెనని కోరుచున్నాను.

—యస్. సాంబశివ దా.మోదర్, తెనాలి.

ఏప్రియల్ '76 సంచికలో ప్రారంభమైన "సత్యం శివం సుందరం" సీరియల్ చాలా బాగుంది. "మిస్టర్ సంపత్ ఎం. ఏ" రసవత్తరంగా సాగుతూ చదువరుల అభిమానాన్ని పొందుతున్నది. ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది.

—యం. అనంత్, మహబూబాబాద్.

అక్కినేని ముఖచిత్రంతో వెలువడిన ఏప్రిల్ జ్యోతి ఎంతో చూడ ముచ్చటగా ఉంది. మా అభిమాన రచయిత్రి కౌసల్యాదేవిగారి "సత్యం శివం సుందరం" మొట్టమొదటి సారికే అందరినీ ఆకట్టుకుంది. వాణిశ్రీగారి "మాయ మనసులు", పర్వతనేని గంగాధరరావుగారి "భారతదేశంలో ఓ భార్య" కథలు చాలా బాగున్నాయి. మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి "మరో ప్రేమ కథ" ఈ నెల జ్యోతిలో జ్యోతిలా వెలిగింది.

—సి. జి. మోహన్ బికాం.,
నిజామాబాద్.

ఏప్రిల్ నెల జ్యోతి కమ్మని కథలతోను, చక్కని నవలతోను ముస్తాబై మమ్మల్నెంతో ఆనందపరిచింది. మినీ కథలు చాలా బాగున్నాయి. కార్టూన్స్ కడుపుబ్బ నవ్వించాయి.

—శ్రీమతి ఎన్. రాధాగంగాధర్,
భీమవరం.



1975—76 సంవత్సరానికి కేంద్రీయ విద్యాలయాల క్రీడా పోటీలలో జావలిన్ త్రోలో మొదటి బహుమతిగా గోల్డ్ మెడల్ గెలుచుకొన్న రిషి రోహి. మద్రాసు గిల్‌నగర్ కేంద్రీయ విద్యాలయంలో పి. యు. సి. చదువుతున్న ఈ విద్యార్థిని, త్రో బాల్, కోకో, బాస్కెట్ బాల్, బేస్ బాల్ మొదలయిన ఆటలలో కూడా ప్రతిభ గలది. ప్రధాన బాధ్యతయి విద్యను అలక్ష్యం చేయకుండానే క్రీడాకారిణిగా కూడా విజయం సాధిస్తోందీ ఉత్సాహవంతురాలయిన రిషి రోహి.

ఏప్రిల్ నెల జ్యోతిలోని పూర్తి నవల "రజని" ముఖచిత్రం చాలా బాగుంది. "రజని" నవల పేరుకు తగ్గట్టుగా వుంది. కథ నడిపిన తీరు హృదయాలను ఆకర్షించింది.

—సి. హెచ్. వి. ప్రభాకరరావు,
జగిత్యాల.

"భారత దేశంలో ఓ భార్య" కథ చాలా బాగుంది. రచయితకు మా ధన్య వాదాలు తెలియ చేయండి; రచయిత్రి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవిగారు రచించిన "సత్యం శివం సుందరం" సీరియల్ మొదటిలోనే మాకెంతగానో నచ్చింది.

—వి. సురేష్, హిందుపూర్.

ఏప్రిల్ నెల "జ్యోతి" నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు ముఖ చిత్రంతో ముగ్ధమనోహరంగా ఉంది. "భారత దేశంలో ఓ భార్య" భర్తలయెడ నిజ మైన ప్రేమను చూపే భార్యలకు ఒక నిదర్శనం. "సత్యం శివం సుందరం" చాలా ఇన్‌ట్రస్టింగ్‌గా ప్రారంభమయింది. "జై మంగళా" గల గల పారే గోదా రిలా పరవళ్లు త్రొక్కుతూ పోతూంది. "మిస్టర్ సంపత్ ఎం. ఏ." చాలా గంభీరంగా నడుస్తూంది.

—డి. వి. సుబ్బారావు, కొండాపురం.

డా॥ కొమ్మూరి వేణుగోపాల రావుకు సన్మానం!

ప్రఖ్యాత నవలా రచయితగా అశే షాంధ్ర పాఠకుల ఆదరాభిమానాలు చూర గొన్న డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు సాహిత్య రజతోత్సవం హైద్రాబాద్ రవీంద్రభారతిలో 23-4-76 శుక్రవారం సాయంత్రం 6-30 గం॥కు జరుగుతుంది. శ్రీ కొమ్మూరికి జరిపే ఈ సన్మాన సభకు సాహితీప్రియులందరూ విచ్చేసి, జయప్రదం చేయగోర్తాము.

—జి. సిహెచ్. రామారావు.
ప్రధాన కార్యదర్శి,
డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు
సాహిత్య రజతోత్సవ సంఘం,
హైద్రాబాద్-18.

Edited and Published by V. Leelavathy Raghavaiah
40/1, Moosasait Street, Madras-600 017 and Printed
D. Hanumantha Rao, at Kranti Press,